సెప్టెంబర్, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 8 పేజీలు: 64 వెల: రూ. 20/-





వినాయక చవితి శుభాకాంక్షలు

ఏకదంతం మహాకాయం తప్తకాంచన సన్నిభమ్ ।
లంబోదరం విశాలాక్షం వన్దే ఽహం గణనాయకమ్ ॥

# దీపావళి కథల పోటీ
## (గ్రామీణ కథలు, హాస్య కథలు)

సాహిత్య ప్రక్రియల్లో కథ స్థానం కథదే. అయితే, రాను రాను హృదయాన్ని తాకే మంచి కథలు కరువయిపోతున్నాయి. అందువల్ల మంచి కథకి పట్టం కట్టాలని 'స్థానిక పాలన' పత్రిక నిర్ణయించింది.

ఈ దీపావళి సందర్భంగా గ్రామీణ కథలు, హాస్య కథలు అనే రెండు విభాగాల్లో పోటీ నిర్వహిస్తున్నాం. గ్రామీణ నేపథ్యం ఉండి, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే కథలు ఒక విభాగంలోను, హాస్య కథలను మరొక విభాగంలోను పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

## బహుమతుల వివరాలు

*రెండు విభాగాలకు విడివిడిగా ఈ కింద పేర్కొన్న బహుమతులుంటాయి.*

| | |
|---|---|
| ఉత్తమ గ్రామీణ కథ | రూ. 15,000 |
| ఉత్తమ హాస్య కథ | రూ. 15,000 |
| ద్వితీయ ఉత్తమ గ్రామీణ కథ | రూ. 10,000 |
| ద్వితీయ ఉత్తమ హాస్య కథ | రూ. 10,000 |
| తృతీయ ఉత్తమ గ్రామీణ కథ | రూ. 8,000 |
| తృతీమ ఉత్తమ హాస్య కథ | రూ. 8,000 |
| ప్రతి విభాగంలో మూడు కన్సోలేషన్ బహుమతులు (ఒక్కొక్క కథకి) | రూ. 5,000 |
| సాధారణ ప్రచురణకు ఎంపికైన గ్రామీణ, హాస్య కథలకు | రూ. 2,000 |

## గ్రామీణ, హాస్య కథల పోటీకి కథలు పంపే రచయిత(త్రు)లు ఈ కింది సూచనలను గమనించాలి:

☆ కథలు కింద పేర్కొన్న చిరునామాకు అక్టోబర్ 1వ తేదీ లోగా అందే విధంగా పంపాలి.

☆ ఒక్కొక్కరు ఎన్ని కథలయినా పంపవచ్చు ☆ రెండు విభాగాల పోటీలలోను పాల్గొనవచ్చు.

☆ కథ రాతప్రతి మీద కథ పేరు మాత్రమే ఉండాలి. రచయిత పేరు కథకి జతపరిచే హామీ పత్రంలో వుంటే చాలు.

☆ కథ నిడివి చేతి రాతలో A4 సైజు కాగితాల్లో 6 పేజీలు మించకూడదు. సైజుకు మించిన కథలను పరిశీలించటం సాధ్యపడదు.

☆ పేజీకి ఒక పక్క మాత్రమే, దస్తూరీ అర్థమయ్యే విధంగా, స్పష్టంగా రాయాలి.

☆ సామాజిక అంశాలతో పాటు అన్ని అంశాలపై కథలు పంపవచ్చు. అశ్లీలత, అసభ్యత, కులమతాలను రెచ్చగొట్టే ధోరణులు, రాజకీయాలు, వ్యక్తిగత దూషణ, వెకిలితనం లేకుండా ఉండే కథలు పంపాలి.

☆ పోటీకి పంపే కథలు తెలుగు సంస్కృతికి దగ్గరగా ఉండాలి. అరువు తెచ్చుకున్న కథాంశాలు, విదేశీ సంస్కృతీ కథలో ప్రతిఫలించకూడదు. అనుకరణ పాత్రలతో కూడిన కథాంశాలకు దూరంగా ఉండాలి.

☆ ఎంపిక కాని కథలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. ఎంపికకాని పక్షంలో తమ కథలను త్రిప్పి పంపాలని కోరుకునేవారు అందుకు అవసరమైన స్టాంపులు అంటించిన కవర్లను కూడా తప్పక జత చేయాలి.

☆ న్యాయనిర్ణేతల కమిటీ మాత్రమే బహుమతి పొందే కథలను నిర్ణయిస్తుంది.

☆ ఎంపికైన కథలు 'స్థానిక పాలన' పత్రికలో ప్రచురితమవుతాయి.

☆ ఫలితాలను నవంబర్ 2010 'స్థానిక పాలన' పత్రికలో చూడవచ్చు.




*చిరునామా:*

**ఎడిటర్, 'స్థానిక పాలన'**

ఎ.ఎం.ఆర్. అపార్డ్, రాజేంద్రనగర్,
హైదరాబాద్-500 030. ఆంధ్రప్రదేశ్, ఇండియా.
ఫోన్: 040-24018656, ఫ్యాక్స్: 040-24017005
E-mail: phanikumar@ap.gov.in

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 8

సెప్టెంబర్, 2010



చీఫ్ ఎడిటర్

**డా॥ ఫణి కుమార్**

ఎడిటర్

**డా॥ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ అరుణజ్యోతి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**సి. వెంకటేశ్వర రావ్**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా,
హైదరాబాద్

ప్రచురణ

**ఎ.ఎం.ఆర్. అపార్డ్**



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : phanikumar@ap.gov.in
phaniapard@gmail.com


# విషయ సూచిక


సంపాదకీయం ..... 2

ఆదర్శవంతమైన గ్రామం అంటే - జేగురుపాడు ..... 3

శాశ్వత కుల, నివాస, పుట్టిన తేదీ ధృవీకరణ జారీ ప్రక్రియను తెలుసుకుందాం ..... 6

'అపార్డ్' వ్యూహాలు ప్రశంసనీయం ..... 9

పేదల ఆశాజ్యోతి 'ఇందిర ప్రభ' ..... 11

పట్టణ ప్రజా ప్రతినిధులకు శిక్షణపై 'అపార్డ్' లో సమావేశం ..... 13

సత్వర గ్రామీణాభివృద్ధి సాధనకు స్థానిక ప్రభుత్వాల బలోపేతం ..... 14

శ్రీ రమణ పేరడీలు ..... 17

సంపూర్ణ అక్షరాశ్యతను సాధించుకుందాం ..... 20

కుజ గ్రహంపై జీవరాశి ఉందా ? ..... 23

తిరుమల వెంకటేశుడి బ్రహ్మోత్సవాలు ..... 25

కలౌ విఘ్నేశ మారుతీ ..... 27

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పైలట్ ప్రాజక్టుగా సంపూర్ణ పారిశుధ్య పనులు ..... 31

భారతదేశపు అతి పెద్ద క్రీడా సంరంభం ..... 32

కృష్ణ ! కృష్ణ ! హరే ! హరే ! ..... 36

శాలివాహన ..... 40

నిజమైన నాయకుడు ..... 44

శాపానుగ్రహ సమర్థుడు వేములవాడ భీమకవి ..... 46

'ఈదుల్ ఫిత్ర్' పర్వదిన వేడుక ..... 49

చావు వీలునామా ! ..... 52

మంచినీటి సరఫరా, గ్రామ పారిశుధ్యం - పంచాయితీల పాత్ర ..... 56

స్థానిక పాలనకు స్ఫూర్తిదాయకం శ్రీకృష్ణ దేవరాయల పరిపాలన ..... 57

కేబినెట్ నిర్ణయాలు ..... 58

వర్షాకాలపు వ్యాధులను ఎదుర్కోవటం ఎట్లా ? ..... 60

రాజకీయ భీష్ముడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు ..... 62

తన భాగ్యమే తనకు గాక... (వెంటాడే వాక్యం) ..... 64

సెప్టెంబర్, 2010

# సంపాదకీయం..

## ఆచార్య దేవోభవ

**మా**తృ దేవోభవః పితృ దేవోభవః ఆచార్య దేవోభవః అన్నారు మన పెద్దలు. మనం అత్యంతగా గౌరవించదగిన, ప్రేమించదగిన, పూజింపదగిన బంధాలలో ఆచార్యునకు మూడో స్థానం ఇచ్చి గౌరవించారు. ఈ ముగ్గురి తరువాత మన జీవితంలో అనేకానేక బంధాలు నెలకొంటాయి. ఎవరైనా ఈ ముగ్గురి తరువాతే.

సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక స్థానం ఉంది. బాలలను బాధ్యతాయుతమైన పౌరులుగా మలిచే గురుతర బాధ్యత వారి భుజస్కంధాలపై ఉంది. నేటి విద్యార్థుల నుంచే రేపటి సమాజానికి కావలసిన వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, సంగీత విద్వాంసులు, నాట్యకారులు, భాషా ప్రవీణులు తయారవుతారు. వీరిని ప్రతిభావంతులుగా మలుస్తున్నది ఉపాధ్యాయులే. ప్రోత్సహించటంలోనూ, దారి చూపటంలోనూ, తోడ్పాటునందించటంలోనూ తల్లిదండ్రుల పాత్ర ఉన్నప్పటికీ, కీలకమైన స్థానం ఉపాధ్యాయులదే. ప్రతి విజయం వెనుక స్ఫూర్తి, దీప్తి వారిదే.

అటువంటి గురుతర బాధ్యతలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించడానికి మన దేశంలో ప్రతి సెప్టెంబర్ 5వ తేదీన "ఉపాధ్యాయుల దినోత్సవం"గా జరుపుకుంటున్నాము. భారతదేశంలో జన్మించిన బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు అయిన సెప్టెంబర్ 5వ తేదీని ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకోవటం నేటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గొప్ప స్ఫూర్తిదాయకమనే చెప్పాలి. సమాజానికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను స్మరించుకుంటూ, తరించడానికి ఇదొక గొప్ప అవకాశం.

ఉపాధ్యాయుడిగా, దౌత్యవేత్తగా, పండితుడిగా, భారత రాష్ట్రపతిగా దేశానికి బహుముఖ సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఒకసారి శిష్యులు, స్నేహితులు ఆయన పుట్టిన రోజును జరపడానికి అనుమతి అడిగారట. "నా పుట్టిన రోజును జరిపే బదులు, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం జరపండి", అని ఆయన వారిని కోరారట. బోధనా వృత్తిపై ఆయనకు గల అనురాగాన్ని, మక్కువను ఇది తెలియచేస్తుంది. అప్పటినుంచి సెప్టెంబర్ 5వ తేదీని మన దేశంలో ఉపాధ్యాయుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

అనాదిగా మన సమాజంలో గురువుల పాత్ర చాలా కీలకమైనదే. గురు శిష్యుల మధ్య సంబంధ బాంధవ్యాలకు కూడా ఎంతో పవిత్రత ఉంది. గురువుల రుణం ఏమిచ్చినా తీరనిది. దాన్ని ధనంతో వెలకట్టలేము. అదే విధంగా, శిష్యులు కనబరిచే భక్తిభావం, ఆదరాభిమానాలు గురువులకు అపురూపమైనవే.

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా, అద్వితీయమైన గురు శిష్య బంధాన్ని మరింత పెంపొందించే దిశగా ఆలోచనలు చేయాలి. అటు ఉపాధ్యాయులు కూడా తమ బాధ్యతను సరిగా నిర్వహిస్తున్నామా లేదా అని సమీక్షించుకోవాలి. ఒక మామూలు ఉపాధ్యాయుడు విద్యార్థులకు కేవలం చెప్తాడు. మంచి ఉపాధ్యాయుడు వివరిస్తాడు. ఇంకా అధికుడైన ఉపాధ్యాయుడు ప్రదర్శిస్తాడు. అయితే, ఒక గొప్ప ఉపాధ్యాయుడు మాత్రం స్ఫూర్తి కలిగిస్తాడు. ఈ స్ఫూర్తి విద్యార్థులకు జీవితకాలమంతటా తోడై నిలబడుతుంది. తాము విద్యార్థుల్లో స్ఫూర్తి రగిలించగలుగుతున్నామా అని ఉపాధ్యాయులు ఆలోచించుకోవాలి. పవిత్రమైన బోధనా వృత్తిని ఎంచుకున్న ఉపాధ్యాయుల పట్ల భక్తి భావంతో, వినయ విధేయతలతో ఉంటున్నామా అని విద్యార్థులు యోచించాలి. అందుకు ఈ ఉపాధ్యాయ దినోత్సవం వేదిక కావాలి.

# ఆదర్శవంతమైన గ్రామం అంటే - జేగురుపాడు




అభివృద్ధిలో క్రొత్త పోకడలతో గ్రామీణ ప్రజలకు సేవలందిస్తున్న గంగదేవి పల్లి, పాండురంగాపురం, కొండాపురం, మేడేపల్లి పంచాయితీల విజయగాథలను గత సంచికలలో 'స్థానిక పాలన' పాఠకులకు అందిచాము. ఈ సంచికలో మరొక గూగుల్ ఉత్తమ గ్రామ పంచాయితీ 'జేగురుపాడు' విజయగాథను పాఠకుల కోసం అందిస్తున్నాము.

గూగుల్ అంతర్జాతీయ సంస్థ నుంచి ఉత్తమ గ్రామపంచాయితీగా అవార్డు అందుకున్న జేగురుపాడు గ్రామపంచాయితీ పేరు దేశ విదేశాలలో మారుమోగుతోంది. గత 4 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వ నిర్మల్ గ్రామ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ శుభ్రం అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ గ్రామ పంచాయితీ పురస్కారం ఇలా ఎన్నో అవార్డులను ఈ గ్రామ పంచాయితీ స్వంతం చేసుకొని, తూర్పు గోదావరి జిల్లాలోనే కాక యావత్ రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన గ్రామం అంటే జేగురుపాడులా ఉండాలి అనే నిర్వచనాన్ని ఇచ్చే స్థాయికి వచ్చింది. ఇదంతా ఒక మహిళా సర్పంచ్ నాయకత్వంలో జరిగిందంటే నమ్మశక్యంగా లేదు కదా? ఇది ఎలా సాధ్యమయ్యిందో తెలుసు కుందాం రండి.

**మార్పు పరిణామం**

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో సుమారు 5000పై చిలుకు జనాభా కలిగిన గ్రామపంచాయితీ జేగురుపాడు. గ్రామంలో 1740 కుటుంబాలలో సుమారు 1453 కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన నివశిస్తున్న కుటుంబాలే. గ్రామ సామాజిక నిర్మాణాన్ని పరిశీలిస్తే, అది ఏ ఒక్క వర్గానికి చెందిన ప్రజలకో పరిమితం కాకుండా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర వర్గాల ప్రజలందరితో గ్రామం ఐకమత్యంగా ఉన్నట్లు సుస్పష్టమవుతుంది. 1952 సం. నుండే జేగురుపాడు ఒక గ్రామ పంచాయితీగా కొనసాగుతున్నప్పటికీ, గ్రామంలో మానవ వనరుల అభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధి అంతంత మాత్రమే. దేశంలోని సాధారణ గ్రామం ఏ విధంగా ఉంటుందో 2007 సం. వరకూ అలాగే జేగురుపాడు గ్రామం కూడా అరకొర వసతులతో సతమతమవుతుండేది. సరైన రహదారి సౌకర్యం లేకపోవటం, ఊరికి రావాలంటే బల్లకట్టుపై గోదావరి కాలువ దాటి రావటం, వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ పంచాయితీకి తలకుమించిన భారంగా పరిణమించటం, బహిరంగ మల విసర్జన, తద్వారా గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలటం చాలా మామూలు. విషయాలు, ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందని ద్రాక్షే. ఐతే 2006లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రామంలో గణనీయమైన రీతిలో అభివృద్ధిని సాధించటానికి బీజాలు వేశాయని చెప్పవచ్చు. గ్రామ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేయటానికి అంకురార్పణ ఈ సమయంలోనే జరిగింది.

గ్రామ పంచాయితీ ఎన్నికలలో సర్పంచ్ పదవి మహిళకు రిజర్వుకావటం, సర్పంచ్‌గా ఎన్నికైన శ్రీమతి యాదల దేవదీవెనకుమారి విద్యావంతురాలు, సామాజిక స్పృహకలిగిన మహిళ కావటంతో పాటు, గ్రామ పంచాయితీకి ఎన్నికైన వార్డు సభ్యులందరూ కూడా గ్రామంలో నెలకొని ఉన్న పరిస్థితులను తమ పదవీ కాలంలో మెరుగుపర్చాలని తొలి పంచాయితీ సమావేశంలోనే తీసుకొన్న నిర్ణయం, గ్రామంలో రూపురేఖల్నే సమూలంగా మార్చి వేశాయి. అభివృద్ధి సాధనలో ప్రజల సహకారం లేనిదే లక్ష్యాలను సాధించలేమని అర్థం చేసుకొన్న సర్పంచ్, పంచాయితీ వార్డు సభ్యులు గ్రామ సభను ఉత్తేజపరిచి ప్రజల సహకారాన్ని పొందటంలో కృతకృత్యులయ్యారు. ఫలితం ఈ రోజు జేగురుపాడుకు ఇన్ని ప్రశంసలు.

**సామాజిక సమీకరణ**

గ్రామాభివృద్ధికి గ్రామపంచాయితీ చేస్తున్న కృషికి ప్రజలను సమీకరించటానికి సంపూర్ణ పారిశుద్ధ్య ప్రచార కార్యక్రమం ఒక చక్కని సాధనంగా ఉపయోగపడింది. సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమంలో

**పంచాయితీ - పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చెందుతున్న జేగురుపాడు**



అందుతున్న నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామంలో బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలని పంచాయితీ తీర్మానం చేసింది. ఈ ఉద్యమంలో ప్రతి కుటుంబం పాలుపంచుకోనేలా గ్రామ పంచాయితీ చేసిన కృషి ప్రశంసనీయం. మరుగుదొడ్ల వినియోగం మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా పేర్కొంటూ ప్రజలలో చైతన్యం కలిగించిన విధానం, ఇంటింటి ప్రచారం, గ్రామంలో పలు ప్రదేశాలలో బహిరంగ మల విసర్జన ఎందుకు మంచి అలవాటు కాదో తెలియచెప్పే గోడ వ్రాతలు, డిస్‌ప్లే బోర్డులు, బహిరంగ మల విసర్జన చేస్తే చట్టప్రకారం గ్రామ పంచాయితీ చేపట్టే చర్యల గూర్చి ప్రజలలో విస్తృత అవగాహన కలిగించారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారు. సుమారు 330 కుటుంబాల వారు కేవలం 20 రోజుల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసేలా పంచాయితీ అమలుపర్చిన ఈ వ్యూహం అభినందనీయం.

సంపూర్ణ పారిశుద్ధ్య సాధన అంటే ఒక బహిరంగ మల విసర్జనను నిర్మూలిచటం మాత్రమే కాదని గ్రహించిన సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు బహుముఖ వ్యూహాన్ని అవలంబించాలని నిర్ణయించుకొని గ్రామంలో పచ్చదనం - పరిశుభ్రం కార్యక్రమంలో చెట్లు నాటడం, ప్రజలందరికీ సురక్షితమైన త్రాగునీరు అందజేయటానికి చర్యలు చేపట్టడం, రహదారులను శుభ్రపర్చడం, మురుగునీటి పారుదల వ్యవస్థలను సక్రమంగా నిర్వహించటం, గ్రామంలో అన్ని ప్రభుత్వ సంస్థలలో మరుగుదొడ్లు నిర్మించేటట్లు చర్యలు చేపట్టడం మొదలగు చర్యలు చేపట్టారు. గ్రామంలోని వీధులలో చెత్తకుండీలను ఏర్పాటుచేసి, గ్రామస్థులు అందరూ చెత్తను నిర్దేశిత ప్రాంతాల్లోనే పారవేసేటట్లు ఏర్పాట్లు చేశారు. పోగయిన చెత్తను గ్రామ శివార్లకు తరలించి సురక్షితంగా వ్యర్థ పదార్థాలను నిర్వహించటం చేపట్టారు. స్మశాన భూములను అభివృద్ధి చేసి ఫలసాయాన్ని అందచేసే మొక్కలు నాటటంతో పాటు, ఖాళీ స్థలంలో ఒక అందమైన పార్కును ఏర్పర్చారు. తొలిరోజులలో ఈ పార్కులోనికి వెళ్ళటానికి ప్రజలు సంశయించినా ఇప్పుడు సందర్శకులకు కొదవలేదంటారు సర్పంచ్ దీవెన కుమారి.

### సులభ్ కాంప్లెక్స్

సాధారణంగా డెల్టా ప్రాంతంలో ఇప్పటికీ కమ్యూనిటీ డ్రై లెట్రిన్‌లు వినియోగించటం ఒక అలవాటు. ఐతే సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కమ్యూనిటీ డ్రై లెట్రిన్‌ను కొనసాగించటం, పారిశుద్ధ్య పని వారల హక్కుల ఉల్లంఘన క్రింద వస్తుందనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం వీటిని నిర్మూలించాలని గతంలో ఈ గ్రామంలో చేసిన ప్రయత్నాలు అంతగా విజయవంతం కాలేదు. ఐతే సర్పంచ్ దీవెన కుమారి నేతృత్వంలో ఈ అంశంపై ప్రజలలో కలిగించిన అవగాహన ఫలితంగా అసాధ్యమనుకొన్న విషయం సుసాధ్యమయ్యింది. దీనికి కారణం వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోలేని, స్థలం లేని 62 మంది వ్యక్తుల కోసం గ్రామంలో 5 చోట్ల కమ్యూనిటీ సెప్టిక్ లెట్రిన్స్‌ను జేగురుపాడు పంచాయితీ చేపట్టింది. అదే విధంగా బస్ కాంప్లెక్సులో సులభ్ కాంప్లెక్సు నిర్మాణాన్ని కూడా చేపట్టింది. ఇప్పుడు స్వంత మరుగుదొడ్లు లేని గ్రామస్థులు ఇదొక మంచి సౌకర్యంగా భావిస్తున్నారు.

పారిశుద్ధ్య రంగంలో పంచాయితీ చేసిన విశేషమైన కృషికి, 2006-2007 సంవత్సరంలో నిర్మల్ గ్రామ పురస్కారాన్ని పొందింది. గ్రామ పంచాయితీకి ఎన్నికైన మొదటి సంవత్సరంలో సర్పంచ్, పంచాయితీ సభ్యులు కలిసి సాధించిన ఈ విజయం ఒక బృందంగా పనిచేస్తే దశాబ్దాలుగా జటిలమైన సమస్యలుగా భావించబడుతున్న సమస్యలను కూడా ఏవిధంగా సులభంగా పరిష్కరించవచ్చో నిరూపిస్తోంది. అవార్డు సాధించిన తరువాత కూడా నిర్మల గ్రామ స్థాయి నుండి దిగజారకుండా ప్రజలు 100 శాతం మరుగుదొడ్లు వినియోగించుకొనేలా పారిశుద్ధ్య కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు చర్యలు కొనసాగిస్తోంది ఈ పంచాయితీ.

### అభివృద్ధి కార్యక్రమాల పరంపర

నిర్మల్ గ్రామ పురస్కారం సాధించటంతోనే గ్రామ సర్పంచ్, సభ్యులు సంతృప్తి చెందలేదు. గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలంటే పౌష్టికాహారం విద్య, వైద్య - ఆరోగ్య రంగం, త్రాగునీరు వంటి మానవ అభివృద్ధికి కీలకమైన రంగాలలో కూడా ప్రగతిని సాధించాలని తమకు తామే లక్ష్యాలను నిర్దేశించుకొన్నారు. విద్యా కమిటీ, ఆరోగ్య కమిటీ, నీటి సరఫరా కమిటీ, పారిశుద్ధ్య కమిటీ, గృహ నిర్మాణ కమిటీ తదితర కమిటీలతో ఆయా రంగాలలో ప్రగతిని సాధించటానికి జేగురుపాడు పంచాయితీ కృషి చేస్తోంది. అధికారాలన్నీ బదలాయిస్తేనే పంచాయితీలు సమర్థవంతంగా ప్రజలకు సేవలందించగలవనే సిద్ధాంత వాదనకు భిన్నంగా సమిష్టి కృషితో, ప్రజా భాగస్వామ్యంతో తన అధికార పరిధికి మించి విద్యా, వైద్య ఆరోగ్యం, అక్షరాస్యత, వ్యవసాయం, సాంఘిక భద్రత, పౌష్టికాహారం, విద్యుత్ రంగం తదితర గ్రామీణాభివృద్ధికి దోహదపడే అన్ని రంగాలలో పంచాయితీ సర్పంచ్, ఇతర వార్డు సభ్యులు ఒక చక్కని దృక్పథంతో అందరినీ సమన్వయపరిచి నేడు గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు.

## పబ్లిక్ - ప్రైవేట్ - పంచాయితీ భాగస్వామ్యం



అభివృద్ధి సాధనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు పంచాయితీ ద్వారా అమలు చేసే కార్యక్రమాల వల్ల ప్రజలకు సంతృప్తికరంగా సేవలందించటం సాధ్యం కాదని గ్రహించిన సర్పంచ్ యాదల దీవెన కుమారి గ్రామ పరిసరాలలో నెలకొని ఉన్న జి.వి.కె. పవర్‌ప్లాంట్ యాజమాన్యాన్ని కలిసి గ్రామాభివృద్ధికి సహకరించేలా వారిని ఒప్పించటం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే దిశలో మరొక సోపానంగా చెప్పవచ్చు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీగా గ్రామ అభివృద్ధికి జి.వి.కె. సంస్థ ముందుకి వచ్చి, గ్రామంలో చేపట్టిన పచ్చదనం - పరిశుభ్రం కార్యక్రమంలో ట్రీగార్డులు, గ్రామంలో పాఠశాలలకు లేబొరేటరీ, ఆడిటోరియం లాంటి సౌకర్యాలను కలగచేసింది. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన సామాగ్రిని కూడా జి.వి.కె. సంస్థ నుండి పొందారు. గ్రామంలో సామాజిక / భవనాల నిర్మాణానికి కూడా జి.వి.కె. నుంచి సేకరించి భవనం పూర్తి చేసారు. ఇంకా గ్రామంలో ఉన్న పేపర్‌మిల్స్ వారి నుండి కూడా సందర్భానుసారం గ్రామ అభివృద్ధికి విరాళాలు సేకరించి, గ్రామ అభివృద్ధిలో వారిని మమేకం చేసారు. ప్రభుత్వం చేసే పనులకు / సేవలకు ప్రైవేటు భాగస్వామ్యం తోడయితే ఏ విధంగా అభివృద్ధి సాధ్యమో జేగురుపాడును చూసి అర్థం చేసుకోవచ్చు.

మనసుంటే మార్గం ఉంటుంది అన్న సామెతకు ఉదాహరణగా మనసున్న ప్రజాప్రతినిధులుగా శ్రీమతి దీవెనకుమారి ఇతర వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధికి తమ ముందున్న అనేక అవకాశాలను దొరకపుచ్చుకొని ప్రగతి సాధిస్తున్న తీరు శ్లాఘనీయం, అనుసరణీయం.

## అభివృద్ధికి నిధులెక్కడివి ?

నిధులు ఇవ్వండి, మాగ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామనే వారికి చెంపపెట్టు ఈ గ్రామం. అభివృద్ధి సాధన అన్నది కేవలం నిధులతోనే సాధ్యం కాదు అని, నిజమైన అభివృద్ధి అంటే గ్రామంలో ఉండే ప్రజలందరి జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే ఈ భావనకు అర్థం ఉంటుందని గ్రహించిన సర్పంచ్ ఒక ప్రక్క అభివృద్ధికి నిధులు సమీకరిస్తూనే ఈ నిధులను ప్రజలకు కనీస వసతులు కల్పించడానికి వెచ్చించటం మొదలుపెట్టారు. నిధులకోసం ప్రభుత్వ కార్యలయాల చుట్టూ, రాజకీయనాయకుల చుట్టూ ప్రదక్షిణం చేయకుండా గ్రామ పంచాయితీకి చట్ట ప్రకారం రావల్సిన ఆదాయాన్ని సక్రమంగా వసూలు చేయటం, పంచాయితీ స్వంతవనరులను పెంపొందించటానికి మార్గాలను అన్వేషించటం సర్పంచ్ చేపట్టారు. పన్నుల కోసం ప్రజలను పదే పదే అడిగితే రాజకీయ భవిష్యత్తు ఉండదనే భయాన్ని వదిలి పన్నులు సక్రమంగా చెల్లిస్తే ప్రజలకు ఏ విధంగా మెరుగైన సేవలు అందించవచ్చో అన్న విషయం పట్ల ప్రజలలో చైతన్యం కలుగచేసి నూటికి నూరు శాతం పన్నులు వసూలు అయ్యేట్లు చూసిన ఘనత సర్పంచ్‌దే. గ్రామ ప్రధాన వ్యాపార కూడలిలో 8 షాపుల నిర్మాణం చేపట్టి వాటి అద్దె ద్వారా అదనపు ఆదాయం సమకూర్చటం, ఖాళీ ప్రదేశాలలో ఫలసాయాన్ని ఇచ్చే మామిడి, కొబ్బరి, ఇతర పండ్ల మొక్కలను నాటడం, గ్రామంలో ఉన్న చెరువులను లోతు చేసి చేపలు పెంచుకోవడానికి అనుమతి మంజూరు చేయటం, డ్రైనేజ్‌సెస్ వంటి యూజర్ ఛార్జీలు విధించి పంచాయితీకి అధనంగా ఆదాయం సమకూర్చుటంలో ఆమెకు ఆమే సాటి. ఈ చర్యల వల్ల నేడు పంచాయితీ ఆదాయం 15 లక్షలకు పైనే ఉన్నది. గ్రామం త్వరితగతిన అభివృద్ధి చెందటం చూసిన ఎం.పి.లు, ఎం.ఎల్.ఏలు, మంత్రులు, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థల వారు, కార్పోరేట్ కంపెనీల వారు గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు తమంతట తామే ముందుకు వచ్చి నిధులను అందచేయటంతో నేడు జేగురుపాడులో లేని మౌలిక వసతి ఏదీ లేదనే ఇంచుమించు చెప్పవచ్చు.

దాతలు లేదా బయటివారు ఇచ్చే వితరణకు నూటికి నూరు శాతం ప్రజోపయోగ పనులకే పూర్తి పారదర్శకతతో పంచాయితీ ఖర్చు చేస్తుందన్న నమ్మకాన్ని కల్గించటంతో ఈ అభివృద్ధి సాధ్యమయిందని అంటారు. శ్రీమతి దీవెనకుమారి.

## మహిళలకు రాజ్యాధికారమా ?

మహిళలకు రాజకీయాధికారం ఎందుకు అన్ని ప్రశ్నించే వారు, మహిళలకు రాజకీయాధికారం ఇచ్చినందువల్ల గ్రామ అభివృద్ధి తిరోగమన దిశలోకి పోతుంది అనే హేళన చేసినవారు జేగురుపాడు తప్పకుండా సందర్శించాలి. గృహిణిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించగలిగిన మహిళామూర్తులు కాస్తంత అవకాశం, ఆసరా ఇస్తే పురుషులకి ధీటుగా, అసాధ్యాలనుకొన్న ఫలితాలను సుసాధ్యం చేసి చూపగలరని చెప్పటానికి జేగురుపాడు ఒక ఉదాహరణ. అందుకే పలువురు గ్రామ సర్పంచ్‌లు ఇతర ప్రజా ప్రతినిధులు జేగురుపాడు పంచాయితీ నుంచి ఈ ప్రేరణ పొందటానికి గాను ఈ గ్రామాన్ని సందర్శిస్తున్నారు. జేగురుపాడు అభివృద్ధి కళ్ళారా చూసిన తరువాత అన్ని అవకాశాలు ఉండి తమ గ్రామాలను ఎందుకు అభివృద్ధి చేయలేకపోయామా అన్న ఆలోచనలో పడుతున్నారు. తమ గ్రామాలలో మార్పు తీసుకొనిరావటం కోసం నడుంబిగిస్తున్నారు.

**- డా. వి. యస్.యస్. ప్రసాద్**

సెంటర్ హెడ్ (యం. & పి),

సత్యనారాయణ మూర్తి, డి.ఆర్.పి. జిల్లా పరిషత్తు, శిక్షణా విభాగం, తూ.గో.జిల్లా.




వెనుకబడిన తరగతుల వారికి రిజర్వు చేసిన స్థానాలలో అట్టి కులానికి చెందని వ్యక్తులు, తప్పుడు సర్టిఫికెట్లు పొంది ప్రభుత్వ, ప్రైవేటు సెక్టారులలో ఉద్యోగాలు పొందటం లేదా విద్యా సంస్థలలో ప్రవేశం పొందటం, ప్రభుత్వాధీన సంస్థలు కల్పించే ఆర్థిక సహాయం, సౌకర్యం పొందటం వలన, అట్టి దుశ్చర్యలు ఆరికట్టి, అట్టి వారిపై కఠినంగా చర్య తీసుకోవటానికి వాస్తవమైన షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతుల వారికి అన్యాయం జరగకుండా రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో ఈ చట్టం రూపొందించబడింది.

- ★ రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలననుసరించి గ్రామ పంచాయితీ స్థాయి నుండి పార్లమెంటు వరకు, ప్రజా ప్రతినిధులను ఎన్నుకోటానికి జనాభా ప్రాతిపదికన షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారి స్థాయి గుర్తించటం, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందటం మొదలైన వాటికి వర్తిస్తుంది.

# శాశ్వత కుల, నివాస, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను తెలుసుకుందాం

## చట్టం రూపకల్పన లక్ష్యం

రాజ్యాంగంలో పొందు పరిచిన వివిధ అధికరణల ద్వారా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు మరియు వెనుకబడిన తరగతుల వారికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించిన దృష్ట్యా, వాటి ఫలాల ను ప్రక్కదోవ పట్టకుండా సక్రమంగా ఆయా వర్గాలకు చెందాలన్న సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సమగ్ర చట్టాన్ని రూపొందించింది.

## చట్టం రూపకల్పన

- ★ ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతుల కులం, నివాసం, జనన తేది ధృవ పత్రాల జారీ ప్రక్రియ చట్టం 16/1993ను ప్రభుత్వం రూపొందించింది. అలాగే సంబంధిత నిబంధనలను జి.ఓ.ఎమ్.నెం: 58 సాంఘిక సంక్షేమ శాఖ తేది 12-05-1997 నందు పొందు పరిచారు.. ఈ చట్టం ది 16-5-1997వ తేదీ నుండి అమలులోనికి వచ్చింది
- ★ షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు,


परिशिष्ट 'ड'
Form of Caste Certificate to be Produced by Other Backward Classes/
Special Backward Classes

CASTE CERTIFICATE

Documents Verified :-
1 School Leaving /Bonafied Certificate of APPLICANT
2 School Leaving Certificate of Father/Brother/Sister/ Grandfather/Uncle/Husband/Others
3 Ration Card
4 Kamgar Talathi Certificate
5 Affidavit
6 Caste Certificate of Father/Brother/Sister/Grandfather Uncle/Husband /others

OBC Reservation.com

This is certify Kimar/Kumari/Shri./Smt.
Son / Daughter of of Village / Town Tal. in District of State of Maharastra belongs to the which is recognized **Other Backward Class** as Under the Government Resolution Edn. & S.W. Dept. CBC 1467/M Dated 13/10/1967 and as amended from time to time.

Kimari/Kumar/Shri./Smt.
and his family ordinarily resides in the Village/Town Tal in District of the Maharashtra State.

Place :
No.MVL/Caste/OBC/SBC/SR 280
Date: 19/7/2005

Signature –
Sub-Divisional officer

[Office Seal]

Case No. 227637

Citizen Facility Center

## దరఖాస్తు చేసుకొనే విధి -విధానం

షెడ్యూలు తెగల వారు నమూనా ఫారం ఒకటిలోను, షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతుల వారు నమూనా ఫారం రెండులో దరఖాస్తు చేస్తూ కులం, నివాసం, జనన తేదీలను బుజువు పర్చే సాక్ష్య పత్రాలను అనగా స్కూలు సర్టిఫికెట్లు, జనన రిజిష్టర్ల నకళ్ళు, జనాభా లెక్కలు, ఓటర్ల జాబితాలో తల్లి తండ్రుల పేర్లు, భూమి పట్టాదారు పాసు పుస్తకాలు మొదలైన ఆధారాలలో ఏదైన ఒక ఆధారం జతపరుస్తూ ముందస్తుగా సంబంధిత అధికారులకు దాఖలు చేయాలి. అభ్యర్థులు మైనర్లయినచో, తండ్రి లేక సంరక్షకులు దరఖాస్తు చేసుకోవాలి. నమూనా ఫారం ఒకటి రెండు (అనుబంధం - 2 (I), (II) ) జతపరచడమైనది.

## శాశ్వత కుల ధృవీకరణ పత్రం జారీ చేసే ప్రక్రియ



- శాశ్వత కుల ధృవీకరణ పత్రం మంజూరు కోసం దరఖాస్తు నమూనా ఫారం ఒకటి రెండు లేక రెండులో సంబంధిత అధికారికి దరఖాస్తు అందిన వెంటనే, దరఖాస్తుతో పాటు జత పరిచిన సాక్ష్యాధారాలు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి చెందితే వెంటనే విచారణ చేపడతారు. విచారణానంతరం శాశ్వత కుల ధృవీకరణ పత్రం నమూనా ఫారం మూడు (అనుబంధం -2 (III) ) లో దరఖాస్తు అందిన 30 రోజుల లోపల జారీ చేస్తారు.
- ఒక వేళ ఈ విషయంలో తదుపరి విచారణ అవసరమని సంబంధిత అధికారి భావిస్తే, యావత్తు సాక్ష్యాధారాలతో కూడిన సమాచారంతో విచారణాధికారి ఎదుట హాజరు కావాలని 15 రోజుల గడువు ఇస్తూ, నమూనా ఫారం నాలుగులో దరఖాస్తు దారునికి నోటీసు జారీ చేస్తారు. సదరు వ్యవధి సరిపోని యెడల మరొక 15 రోజులు అనుమతించవచ్చును. ఈ విషయంలో 30 రోజులకు మించి అనుమతించరు.
- ఒక వేళ షెడ్యూలు తెగల వారికి సంబంధించిన దరఖాస్తు పరిష్కార విషయంలో సంపూర్ణ విచారణ అవసరమైనచో, జిల్లా షెడ్యూలు తెగల సంక్షేమ అధికారికి లేదా హైదరాబాదులో నున్న ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారిని సంప్రదించి వారి వద్ద లభించే సమాచారంతో యావత్తు విచారణ ప్రక్రియ, దరఖాస్తు అందిన 60 రోజులలో పూర్తి చేసి ధృవీకరణ పత్రం జారీ చేయటం లేదా తిరస్కరించటం చేస్తారు.

### తాత్కాలిక అడ్మిషన్లు, నియామకాల గురించి...

విద్యా సంస్థలలో అడ్మిషన్ల కోసం, అలాగే వివిధ కార్యాలయాలలో నియామకాల కోసం సదరు వ్యక్తులకు ధృవీకరణ పత్రం అవసరమైనపుడు దరఖాస్తుదారు శాశ్వత కుల ధృవీకరణ పత్రం జారీ కొరకు సంబంధిత కాంపిటెంటు అధికారికి దాఖలు చేసిన, యెడల అట్టి విషయం వారి విచారణలో వుండి విచారణ మరి కొంత కాలం పట్టే సందర్భాలలో విద్యార్థి/ ఉద్యోగి తన అవకాశాన్ని నష్టపోకుండా వుండేందుకు కుల ధృవీకరణ పత్రం జారీ చేసే కాంపిటెంటు అధికారికి, ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాళ్ళకు అలాగే కార్యాలయాలలో నియామక అధికారులకు తన వద్ద కుల ధృవీకరణ పత్రానికి సంబంధించిన దరఖాస్తు విచారణలో నున్నదన్న విషయం తెలియపరుస్తూ ఆయా విద్యార్థుల అడ్మిషన్లు/ ఉద్యోగానికి అప్లై చేసిన వారి నుండి సెల్ఫ్ డిక్లరేషన్ నమూనా ఫారం ఒకటిలో షెడ్యూలు తెగల వారికి, అలాగే నమూనా ఫారం రెండులో షెడ్యూలు కులాలు వెనుక బడిన తరగతుల వారికి తీసుకుని అడ్మిషన్లు/ నియామకం చేపట్టవచ్చునని, ఇది కేవలం ప్రొవిజనల్ మాత్రమేనని, ఈ డిక్లరేషన్‌పై చేపట్టిన అడ్మిషన్లు / నియామకాలు మూడు నెలల వరకు మాత్రమే చలామణిలో వుంటాయని, ఆ తదుపరి అవి చెల్లవని తెలియపరుస్తారు.



### జిల్లా స్థాయి కమిటీ విధులు (అనుమానిత క్లెయిమ్)

కులం, జన్మస్థలం, పుట్టిన తేదీకి సంబంధించిన క్లెయిమ్‌ల పై ఏవైనా అనుమానాలు (Doubt) కలిగినప్పుడు ప్రభుత్వంచే నియమింపబడిన, జిల్లా జాయింటు కలెక్టరు అధ్యక్షతనలగల స్క్రూటిని కమిటికి అట్టి క్లెయిమ్‌లను విచారణ నిమిత్తం కాంపిటెంటు అథారిటీ, ఈ కమిటీకి పంపుతారు. ఆ క్లెయిమ్ అందిన 45 రోజులలోపు ఈ కమిటి తన విచారణను పూర్తి చేసి సదరు క్లెయిమ్ వాస్తవమైనదా? లేక అనుమానితమైనదా? అన్న విషయంపై నిర్ధారణకు వచ్చిన పిదప కారణాలు వివరిస్తూ, వారి నివేదికను సంబంధిత కాంపిటెంట్ అథారిటికి పంపుతారు. దర్మిలా సదరు కాంపిటెంట్ అథారిటీ, క్లెయిమ్‌పై నిర్ణయం తీసుకుని సదరు నిర్ణయాన్ని దరఖాస్తు దారునికి తెలియపరుస్తారు.

## మోసపూరిత క్లెయిమ్ (Fraudulent claim) గురించి

★ మోసపూరితంగా తప్పుడు కుల ధృవీకరణ పత్రం తీసుకొని ఆయా రిజర్వేషన్ల ద్వారా లబ్ధిపొందుతున్నట్లు జిల్లా కలెక్టరు వారి దృష్టికి లిఖిత పూర్వకంగా అభియోగం ధాఖలు అయినా లేదా ఇతర ఆదారాల ద్వారా నోటీసునకు వచ్చినచో సదరు క్లెయిమ్‌ను జాయింటు కలెక్టరు అధ్యక్షతన గల జిల్లా స్క్రూటినీ కమిటీకి సుదీర్ఘ విచారణ నిమిత్తం పంపుతారు. సదరు స్క్రూటినీ కమిటీ విచారణ జరిపి తమ పూర్తి నివేదికను క్లెయిమ్ అందిన 60 రోజులలోపు జిల్లా కలెక్టరు వారికి పంపుతారు.

★ పై కమిటీ నుండి నివేదిక అందిన వెంటనే జిల్లా కలెక్టరు నివేదికను కూలంకషంగా పరిశీలించి మంజూరు చేసిన కుల ధృవీకరణ పత్రం వాస్తవమైనదా? లేక మోసపూరితంగా తప్పుడు కుల ధృవీకరణ పత్రం పొందినారా? అనే విషయం పరిశీలించి ఒక వేళ మోసపూరితంగా పొందినట్లు ఋజువయితే అట్టి పత్రాన్ని రద్దు పరుస్తారు. అట్టి విషయాన్ని జిల్లా గెజిట్‌లో ప్రచురిస్తారు. రద్దు పరచిన ఉత్తర్వులను సంబంధిత శాఖలకు, ఇన్‌స్టిట్యూట్‌లకు పంపుతారు. స్క్రూటిని కమిటి నుండి నివేదిక అందిన  ఒక నెల లోపు ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తారు.

## అప్పీలు చేసుకొనటానికి విధి -విధానం

చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం కాంపిటెంట్ అధారిటి జారీ చేసిన ఉత్తర్వులపై సంతృప్తి చెందని వ్యక్తి 30 రోజులలోగా జిల్లా కలెక్టరు వారికి అప్పీలు చేసుకొనవచ్చును కలెక్టరు వారు అప్పీలు దారు వాదనను పరిశీలించిన పిదప కాంపిటెంట్ ఆథారిటి జారి చేసిన ఉత్తర్వులను తిరస్కరించవచ్చును లేదా ఖాయ పరచవచ్చును.

## సమీక్ష

జిల్లా కలెక్టరు వారి ఉత్తర్వులు జిల్లా గెజిట్‌లో ప్రచురించిన 30 రోజులలోగా ప్రభుత్వానికి అప్పీలు చేసుకోవచ్చును. ప్రభుత్వం వారు అప్పీలు దారు వాదనను పరిశీలించిన పిదప కలెక్టరు వారి ఉత్తర్వులను తిరస్కరించవచ్చును. లేదా ఖాయ పరచవచ్చును. అదే విధంగా ఈ విషయంలో సమీక్షించు అధికారం, అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది.

## డూప్లికేటు కుల ధృవీకరణ పత్రం పొందే ప్రక్రియ

మంజూరు చేసిన శాశ్వత కుల ధృవీకరణ పత్రం పొగొట్టుకున్నా, లేదా చెదలు పట్టినా, తడిచి పోయినా, కాలిపోయిన సందర్భాలలో అట్టి వైనం వివరిస్తూ రూ. 10 విలువ కలిగిన స్టాంపు పేపరుపై వివరణ ఇస్తూ, సంబంధిత అధికారులకు దరఖాస్తు దాఖలు పరచినచో, దరఖాస్తు అందిన 15 రోజుల లోపు డూప్లికేటు సర్టిఫికేటు మంజూరు చేస్తారు.

## శాశ్వత కుల ధృవీకరణ పత్రం జారీ చేసే అధికారులు

రాష్ట్రంలో నున్న వివిధ కులాలు అనగా షె.కు, షె.తె., వెనుకబడిన తరగతుల వారికి శాశ్వత కుల ధృవీకరణ పత్రం మంజూరు చేసేందుకు ఆయా మండలాల పరిపాలనా పరిధిలోని తహశీల్దార్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సబ్ కలెక్టర్లు / అసిస్టెంటు కలెక్టర్లు, అదే విధంగా జిల్లా పరిపాలనా పరిధిలో జిల్లా కలెక్టరు వారికి అనుబంధంలో పేర్కొన్న ప్రకారం అధికారాలు ఉన్నాయి. ఆయా కులాలకు శాశ్వత కుల ధృవీకరణ పత్రం మంజూరు చేసే అధికారాలు, వారి పరిధి అనుబంధంలో పొందుపరచడమైనది.

## తప్పుడు కుల ధృవీకరణ పత్రం పొందిన సందర్భంలో పర్యవసానం

తప్పుడు కుల ధృవీకరణ పత్రం ఆధారంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తి, ఆయా కులాలకు నిర్దేశించిన (రిజర్వు చేసిన) ఉద్యోగం పొందినా, విద్యా సంస్థలలో ప్రవేశం పొందినా లేదా ఆర్థిక సహాయం లేదా ఇతర సౌకర్యం పొందినా, అట్టి వారి తప్పుడు సర్టిఫికెటు రద్దు పరచి వెంటనే ఉద్యోగం నుండి తప్పించడం, విద్యా సంస్థల నుండి (డిబారు) తొలగించడమే గాక, ఆర్థిక సహాయం లేదా సౌకర్యాలను నిలుపుదల చేయడం, పొందిన ఆర్థిక సహాయాన్ని సౌకర్యాలను వెనకకు తీసుకోవడం జరుగుతాయి. డిగ్రీ, డిప్లొమా పట్టాలు రద్దు కాబడతాయి.



అట్టి తప్పుడు కుల ధృవీకరణ పత్రాలలో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విద్యా సంస్థలలో లబ్ధిపొందే వారికి తప్పుడు కుల ధృవీకరణ పత్రం రద్దు చేసిన పిదప 6 మాసాలకు తక్కువ కాకుండా 2 సంవత్సరాల కాలం వరకు కారాగార శిక్ష, రూ 1000 తక్కువ కాకుండా రూ 5000 వరకు జరిమానా విధించవచ్చును. అదే విధంగా  ఉద్దేశపూర్వకంగా దొంగ సర్టిఫికేట్ ఇచ్చిన సంబంధిత అధికారులు కూడా శిక్షార్హులు.

*- వి. గణేశ్వరరావు,*
*సీనియర్ రిసోర్స్ పర్సన్,*
*ల్యాండ్ సెల్ సెంటర్,ఎ.ఎమ్.ఆర్. -అపార్డ్*

# ‘అపార్డ్’ వ్యూహాలు ప్రశంసనీయం

- గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ వట్టి వసంతకుమార్

**వార్తల్లో ‘అపార్డ్’**

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై పంచాయితీ రాజ్ ప్రజా ప్రతినిధులు, సిబ్బందిని చైతన్య వంతులను చేయటానికి ‘అపార్డు’ అనుసరిస్తున్న వ్యూహాలు ప్రశంశనీయమని గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ వట్టి వసంత కుమార్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అందచేసేందుకు ఉద్దేశించిన సోషల్ ఆడిట్ ప్రక్రియపై పంచాయితీ రాజ్ ప్రజా ప్రతినిధులకు, గ్రామీణాభివృద్ధి సిబ్బందికి అవగాహన కలుగచేయటానికై అపార్డు రూపొందించిన “సామాజిక తనిఖీ - మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం” పుస్తక తొలిప్రతిని మంత్రి శ్రీ వసంతకుమార్ ఇటీవల విడుదల చేసారు. పుస్తక తొలి ప్రతిని గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్, శ్రీ రావూత్‌కు అందచేసారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ వసంత కుమార్ మాట్లాడుతూ, అపార్డు రూపొందించిన ఈ పుస్తకంలో సోషల్ ఆడిట్ ప్రక్రియలోని వివిధ దశలను కార్టూన్‌ల రూపంలో సంక్షిప్తపరిచి ఆసక్తి దాయకంగా వివరించారని, విషయాన్ని సులభంగా అర్థంచేసుకొనే విధంగా రూపొందించిన ఈ పుస్తకం క్షేత్ర స్థాయిలోని సిబ్బందికి, ఇతర భాగస్వాములకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

పంచాయితీ రాజ్ ప్రజా ప్రతినిధులకు శిక్షణ అందచేయటానికి వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలపై ప్రజలలో అవగాహన కలుగచేయటానికి ‘అపార్డు’ అనుసరిస్తున్న వ్యూహాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గుర్తించి ‘అపార్డు’ కమీషనర్‌కు జూలై 22,23న ఢిల్లీలో జరిగిన వర్కుషాపునందు అవార్డు బహూకరించిందని



గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రివర్యులు శ్రీ వట్టి వసంతకుమార్ గారిచే అపార్డు వార్షికోత్సవ నివేదిక విడుదల

ఆయన అన్నారు.

ఇదే సందర్భంగా అపార్డు రూపొందించిన 2009-10 వార్షిక నివేదికను మంత్రి శ్రీ వట్టి వసంత కుమార్ విడుదల చేశారు. అపార్డు స్థాపించి 55 సం. అయినప్పటికీ, ఇదే తొలి వార్షిక నివేదిక అనీ 2009-10 సంవత్సరంలో అపార్డు నిర్వహించిన కార్యక్రమాల వివరాలతో పాటు, అపార్డు సంక్షిప్త చరిత్ర, ప్రస్తుతం ‘అపార్డు’ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై వివరాలన్నీ ఈ పుస్తకంలో పొందుపర్చారని అన్నారు. ఐ.యస్.ఓ. సర్టిఫికెట్ పొందిన అపార్డు పనితీరుని, శిక్షణా వ్యూహాలను ప్రపంచ బ్యాంకు బృందం, భారత ప్రభుత్వం పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలు ఒక ఆదర్శవంతమైన విధానంగా పేర్కొన్నాయని ఆయన అన్నారు. ‘అపార్డు’ అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవటానికి ఈ రోజు వివిధ రాష్ట్రాల నుంచి అపార్డును సందర్శించేందుకు అధికార, ప్రజా ప్రతినిధులు సందర్శిస్తున్నారని, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీని వినియోగించుకొని శిక్షణను ఏ విధంగా అందచేయవచ్చన్న విషయంలో అపార్డు అనుసరిస్తున్న పద్ధతులు ప్రశంసనీయమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ సొసైటీ డైరెక్టర్ కిడాంబి సౌమ్య, అపార్డు జాయింట్ డైరెక్టరు మొహమ్మద్ తఖీయుద్దీన్, డిప్యూటీ డైరెక్టర్లు కృష్ణమోహన్, కుమార రాజా, వివిధ సెంటరు హెడ్‌లు బ్రిగేడియర్ డి.వి. రావు, ప్రొ.సూర్యనారాయణ రెడ్డి, ప్రొ. రఘునాథ్ రెడ్డి, సెబాస్టియన్ రాజ్, డా. వి.ఎస్.ఎస్. ప్రసాద్, సీనియర్ ఫ్యాకల్టీ, పుస్తక రచయిత్రి సుమమాలిని, మంత్రి వర్యుల ఓ.ఎస్.డి.లు కన్నబాబు, అమరేందర్ పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శితో అపార్డు ప్రచురణలు విడుదల

ప్రజా ప్రతినిధులు అధికార సిబ్బందికి శిక్షణ అందచేయటానికి ‘అపార్డు’ రూపొందిస్తున్న పుస్తకాలు, డాక్యుమెంటరీ ఫిల్మ్‌లు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయనీ, దేశంలోని యస్.ఐ.ఆర్.డి. లన్నింటికీ అపార్డు మార్గదర్శిగా ఉన్నదని శ్రీ బి.కె. సిన్హా అన్నారు. జూలై 22, 23 రెండు రోజుల పాటు కొత్త ఢిల్లీలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన వర్కుషాపులో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ బి.కె. సిన్హా అపార్డు రూపొందించిన సోషల్ ఆడిట్ ప్రైమర్ ఇంగ్లీషు ప్రతిని విడుదలచేశారు. ఇదే సందర్భంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో శ్రామికుల హాజరును ఉపాధి నమోదు చేయటానికి, మస్టరు రోల్సు నిర్వహణకు, పనుల కొలతలు నమోదు చేయటానికి, చెక్ మెజర్ మెంట్ చేయటానికి విశాఖ పట్నం జిల్లాలో క్రొత్తగా ప్రవేశ పెట్టి ఈ మస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టంపై రూపొందించిన డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను జాతీయ గ్రామీయ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ శ్రీ మాత్యూ సి. కున్నాంకల్ విడుదల చేశారు.

## ‘అపార్డ్’ను సందర్శించిన కేంద్ర గ్రామీణాభివృద్ధిమంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి

ప్రయోగశాలల్లో జరిగే పరిశోధనా ఫలితాలు క్షేత్ర స్థాయికి చేరితేనే ఆ పరిశోధనలకు సార్థకత చేకూరుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ నితేన్ చంద్ర అన్నారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో శిక్షణా విభాగ నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న



**తెలుగు సోషల్ ఆడిట్ ప్రైమర్‌ను విడుదల చేస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖామంత్రివర్యులు శ్రీ వట్టి వసంత్‌కుమార్**

శ్రీ నితేన్ చంద్ర ఐ.ఏ.ఎస్. ది. 5-8-2010న అపార్డును సందర్శించారు. ఈ సందర్భంగా అపార్డు ఫ్యాకల్టీ సభ్యులతోను, ఎంపిక చేయబడిన గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతోను, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రయోగాత్మకంగా అమలు చేయతలపెట్టిన 'ల్యాబ్ టు ల్యాండ్' (ప్రయోగశాల నుండి క్షేత్ర స్థాయికి) అనే ప్రయత్నం గురించి చర్చించారు. ఈ ల్యాబ్ టు ల్యాండ్ ప్రయోగం తొలి దశలో ప్రతీ



**ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం గూర్చి వివరిస్తున్న శ్రీనితేన్‌చంద్ర, జాయింట్ సెక్రటరీ**

రాష్ట్రంలో ఒక జిల్లాలోని ఒక మండలంలో అమలు చేయటం జరుగుతుందని, ఈ అనుభవాన్ని, ఫలితాలను దృష్టిలో ఉంచుకొని అదే జిల్లాలోని మిగిలిన మండలాలన్నింటిలోను అమలు చేయటం జరుగుతుందన్నారు. 'ల్యాబ్ టు ల్యాండ్' ప్రయోగం ముఖ్యంగా :

1. ప్రస్తుతం అమలు అవుతున్న పథకాల సమాచారాన్ని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు చేరేలా చూడటం.
2. పథకాల యొక్క ఉద్దేశ్యాలు వాస్తవంగా అమలు జరిగేలా చూడటం.
3. సుస్థిరమైన, సమ్మిళితమైన గ్రామీణాభివృద్ధిని సాధించటం.



**ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమంలో పాల్గొన్న అపార్డ్ గ్రామీణాభివృద్ధి శాఖల సిబ్బంది**

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ గ్రామీణ నీటి సరఫరా పథకం, పురా పథకం, యస్.జి.యస్.వై/ఎన్.ఆర్.ఎల్.యం., సమీకృత బంజరు భూముల అభివృద్ధి పథకం, ఇందిరా ఆవాస యోజన, జాతీయ సాంఘిక సహాయ పథకం, ప్రధాన మంత్రి సడక్ యోజన వంటి పలు పథకాలు అమలు అవుతున్నప్పటికీ, ఈ పథకాలను అమలు చేసే సంస్థలకు ఈ పథకాల ఉద్దేశ్యాలు సరిగా అర్థంకాకపోతే, పథక ఉద్దేశ్యాలు నెరవేరవని, అందుకే



**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం - సాంకేతిక శిక్షణా మార్గదర్శిని విడుదల చేస్తున్న శ్రీనితేన్ చంద్ర**

వివిధ పథకాలను అమలు చేసే పంచాయితీ రాజ్ సంస్థలు, ఇతర అమలు యంత్రాంగానికి సామర్థ్యాల పెంపుదల చేయాలని అన్నారు. పథకాల సమాచారం ప్రజలకు తెలియనందువల్ల చాలా మంది అర్హులైన లబ్దిదారులు పథకాలను వినియోగించుకోలేకపోతున్నారని అన్నారు. కమ్యూనిటీ రిసోర్సు పర్సన్‌లను ప్రతి గ్రామంలో తయారు చేసి, ప్రజలను చైతన్యపర్చటానికి ఈ 'ల్యాబ్ టు ల్యాండ్' ప్రయత్నిస్తుందని అన్నారు.

'ల్యాబ్ టు ల్యాండ్' అనేది క్రొత్త పథకం కాదని దీనికి అదనంగా నిధులను కేటాయించటం జరగదని అయితే ప్రస్తుతం అమలులో



**ఢిల్లీలో సోషల్ ఆడిట్ ప్రైమర్ (ఇంగ్లీషు) ను విడుదల చేస్తున్న కేంద్ర గ్రామీణశాఖ కార్యదర్శి శ్రీ బి.కె. సిన్హా**
చిత్రంలో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరక్టర్ జనరల్ **శ్రీ మాత్యుసికున్నంకల్, గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ సెక్రటరీలు టి విజయ్‌కుమార్, నితేన్‌చంద్ర** తదితరులు

ఉన్న పథకాలను సమీకృత పరిచి, ఒక ప్రణాళిక ప్రకారం అమలు పరచటానికి ఒక ఆధారంగా ఉపయోగపడుతుందని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో సాంకేతిక సిబ్బందికి ఉపయోగపడే విధంగా 'అపార్డు' రూపొందించిన సాంకేతిక శిక్షణా మార్గదర్శినిని శ్రీ నితేన్ చంద్ర ఈ సందర్భంగా విడుదల చేశారు.

# పేదల ఆశాజ్యోతి 'ఇందిర ప్రభ'

గ్రామీణాభివృద్ధిలో భాగంగా సమగ్ర అభివృద్ధి పథకం ద్వారా దళితుల నిరుపయోగ వ్యవసాయ భూములను బాగుచేసి, అభివృద్ధి పరచి సాగుకు ఉపయోగపడేలా చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం "ఇందిర ప్రభ" అనే కార్యక్రమాన్ని దివంగత ప్రధాని ఇందిరా గాంధి జన్మదినమైన 19.11.2004న ఆమె ప్రాతినిధ్యం వహించిన మెదక్ నియోజక వర్గం ఆంధ్రప్రదేశ్‌లో ఉండడం వలన ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లాలోని నరిగొండయ్య పాలెం గ్రామంలో నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించారు.

ఇందిర ప్రభను పేదల ఆశాజ్యోతి అనే చెప్పవచ్చు.

ఈ కార్యక్రమం వలన లబ్ధిపొందిన విజయ గాథ తెలుసుకుందాం.

మెదక్ జిల్లా సంగారెడ్డి మండలంలోని "చేర్యాల" గ్రామంలో నివసిస్తూ, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్న 100 దళిత కుటుంబాలవారు (40 ఉమ్మడి కుటుంబాలు) 'ఇందిర ప్రభ' గురించి తెలుసుకొని ఆకర్షితులయ్యారు.

ఈ 40 ఉమ్మడి కుటుంబాల ఆధీనంలో 70 ఎకరాల పట్టాలు గల అసైన్డ్ భూమి వుంది.

ఈ నలభై కుటుంబాలలో శ్రీ జుత్తు బాలయ్య కుటుంబం ఒకటి. ఇతని వయస్సు 70 సంవత్సరాలు. తన నలుగురు కొడుకులు, నలుగురు కోడళ్ళు, మనుమలు, మనమరాళ్లతో ఒకే కుటుంబంగా ఒకే ఇంట్లో జీవిస్తున్నారు. ఇతని భార్య గతించింది. ఈ కుటుంబ సభ్యులంతా నిరక్షరాస్యులైనప్పటికినీ, సంతకాలు మాత్రం చేయగలరు.

సర్వే నెంబరు 741 లో ఒక ఎకరా భూమిని (అసైన్డ్‌లాండ్) ప్రభుత్వం ఈ కుటుంబానికి 1965వ సంవత్సరంలో కేటాయించింది. వీరి భూమికి ప్రక్కనే నిరుపయోగంగా పడివున్న దాని యాజమానులెవరో తెలియని మరి ఒక ఎకరా పట్టా భూమిని కూడా ఈ జుత్తు బాలయ్య కుటుంబం సాగుచేసుకుంటుంది. అనగా నలుగురు అన్నదమ్ములు ఈ 2 ఎకరాల భూమిని సమంగా పంచుకుని సాగుచేస్తూ, దాని ఫలితాన్ని అనుభవిస్తున్నారన్న మాట.

ఈ గ్రామంలోని అసైన్డ్ భూములలో యస్.సి. కార్పొరేషన్ వారు 1983లో బావులను త్రవ్విస్తుండగా, ఒక బావి ఈ బాలయ్య భూమిలో కూడ త్రవ్వడం జరిగింది. ఈ భూములలో యూకలిప్టస్ మొక్కల పెంపకానికి యస్.సి కార్పొరేషన్ వారుఏర్పాట్లు చేశారు. పనికి ఆహార పథకం క్రింద బావుల త్రవ్వకం, మొక్కల నాట్ల పనులలో పని చేసిన కూలీలకు కూలి చెల్లింపబడింది. ప్రస్తుతం వర్షాలు పడకపోవడంతో లెక్కలేనన్ని బోర్ వెల్సు ఎండిపోయాయి. బాలయ్య భూమికి 100 గజాల దూరంలో నీటితో నిండుగా ఉన్న ఒక చెరువు వుంది. బాలయ్య కుటుంబ సభ్యులు, తమ భూమిలో పెంచుతున్న మామిడి మొక్కలను తడపడానికి ఈ దగ్గరి చెరువు నుంచి కుండలతో నీటిని మోసుకుని వచ్చేవారు.

బాలయ్య కుటుంబ సభ్యులు తమ భూమిలో 150 మీటర్ల పొడవు, 2 అడుగుల వెడల్పు, అరఅడుగు ఎత్తు గల కట్టలను నిర్మించుకున్నారు. కరవు నివారణ చర్యల క్రింద 1200/- రూపాయలు, సమగ్ర భూ అభివృద్ధి పథకం క్రింద 1000/- రూపాయలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారు బాలయ్య కుటుంబానికి చెల్లించారు.



చేర్యాల గ్రామస్థులను అడిగి వారి పొలాలలో నర్సరీల నుంచి ఎంపిక చేసుకున్న మామిడి మొక్కలను తెచ్చుకుని పెంచామని, ఆ మొక్కల ఖరీదు, రవాణా ఖర్చు జిల్లా నీటి యాజమాన్య సంస్థ భరిస్తుందని చెప్పారు.

ఇతర గ్రామస్తులతో కలిసి బాలయ్య కుటుంబం తమ పొలాల కోసం 299 మామిడి మొక్కలను తెచ్చుకుంది. వాటి ఖరీదు, రవాణా ఖర్చు మొత్తం 4500/- రూపాయలైంది. ఈ ఖర్చైన సొమ్మును

(కామన్ ఇంటరెస్ట్ గ్రూపు) సి.ఐ.జీ లీడరు ద్వారా 'డ్వామా' బాలయ్య కుటుంబానికి చెల్లించింది.

మొక్కల కోసం త్రవ్విన గుంతలను గమాక్సిన్ తో నింపి, మామిడి మొక్కలను నాటారు డ్వామా వారు సూపర్ ఫాస్ఫేటు ఎరువులను ఉచితంగా సరఫరా చేశారు. ప్రస్తుతానికి మొక్కలను కుండలతో తెచ్చిన నీటితో తడుపుతున్నారు.



భూగర్భ జలశాఖ వారు ఈ భూములలో సర్వే చేసి, 7 వాటర్ టేబుల్సు కనుగొని 5 బోర్‌వెల్సు త్రవ్వకానికి సిఫార్సు చేసారు. నిధులు వచ్చిన తర్వాత కుండలతో నీరు సులువుగా తోడుకొవడానికి చేతి పంపులను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతానికి మధ్యంతర పంటగా హార్సు సీడ్సును నాటుతున్నారు.

ప్రభుత్వ సహాయంతో తమ 299 మామిడి మొక్కలను తమ పిల్లలు లాగ చూచుకొని పెంచుకుంటామని బాలయ్య కుటుంబ సభ్యులు సంతోషంతో చెప్పారు. రాబోయే వేసవిలో, తమకు సంబంధించిన ఎర్రనేలల కోసం చెరువు పూడిక తీస్తామని, డ్వామా వారి సలహాలననుసరించి 5×5×2 మీటర్ల పరిమాణంలో ఒక ఫారం పాండ్‌ను త్వరలో త్రవ్వుతామని బాలయ్య కుటుంబ సభ్యులుఅన్నారు.

పై అన్ని రకాల పనులకు పారితోషికాన్ని చెల్లిస్తామని డ్వామా అధికారులు తెలియచేసారు.

ఈ విధంగా బాలయ్య కుటుంబం, డ్వామా సహకారంతో నిరుపయోగంగా పడి వున్న తమ అసైన్డ్ భూమిని సస్యశ్యామలం చేసికొనగా, ప్రక్కనేవున్న భూ యాజమాని రామయ్య, తన నలుగురు అన్నదమ్ముల కొట్లాడలతో తమ భూమిని చెత్త చెదారంతో నిరుపయోగంగా వుంచారు. బాలయ్య కుటుంబం ఐకమత్యంతో వుండి తమ భూమిని బాగుచేసికున్నారు. అనైక్యతతో రామయ్య, అతని నలుగురు అన్న దమ్ములు భూమిని నిరుపయోగం చేసుకున్నారు.

బాలయ్య కుటుంబంలోని బాలయ్య కోడలు కిష్టమ్మను, ఇందిర ప్రభకు ముందు, తరువాత వున్న తేడాను తెలుపమని అడగగా, ఆమె ఇందిర ప్రభ కార్యక్రమం అమలుకు ముందు ఇతర భూములతో తాము కూలీలుగా పనిచేసామని, ఇందిరప్రభ అమలు తరువాత తమ స్వంత భూమిలో యాజమానులుగా పనిచేసుకుంటున్నామని గర్వంగా, సంతోషంగా తెలిపింది.

ఇందిర ప్రభ కార్యక్రమం వలన సంతోషంగా జీవిస్తున్నప్పటికినీ, ఇంకా ప్రభుత్వం నుంచి ఏమి ఆశిస్తున్నారని బాలయ్య కుటుంబ సభ్యులను అడగగా, పాలు అమ్మి జీవించడానికి ఒక గేదె కావాలని, మొక్కలను నీటితో తడపడానికి 20 ప్లాస్టిక్ కుండలు కావాలని కిష్టమ్మ చెప్పింది. పొలంలో అడ్డుకట్టల కోసం టేకు, కొబ్బరి మొక్కలు కావాలని, అవి తమ కుటుంబానికి ఆదాయం పెరగడానికి ఉపయోగపడతాయని ఆమె చెప్పింది. ఈ విషయాన్ని డ్వామా అధికారులకు తెలియజేయగా, వారు అందుకు సానుకూలంగా స్పందించారు.

సంపాదన కోసం తమ లాగ తమ పిల్లలు కూలీలు కాకూడదని, మంచి భవిష్యత్తుఉండాలని వారిని చదివిస్తున్నామని బాలయ్య కుటుంబ సభ్యులు, భవిష్యత్‌పై భరోసాతో తెలియజేశారు.

వ్యూహాత్మకంగా, డ్వామా అధికారులు ఇందిర ప్రభను విజయవంతం జేయడం వలన , చేర్యాల గ్రామంలో 40 దళిత ఉమ్మడి కుటుంబాల వారు తమ శక్తి వంచన లేకుండా శ్రమతో ఉత్పాదకతను పెంచి, సుస్థిరమైన జీవనోపాధికి ఆహార భద్రతను పొందగలిగారు. ఈ విధంగా ఇందిర ప్రభను అమలు జేయడం ద్వారా చేర్యాల దళిత కుటుంబాలు, ఇతర గ్రామస్థులకు ఆదర్శం కావడం వలన జిల్లా నీటి యాజమాన్య సంస్థతో పాటు ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖకు గర్వకారణమైంది!

ఇందిర ప్రభ కార్యక్రమం విజయవంతం కావడానికి 14.12.2004 మరియు 19.03.2005 న ఆంధ్రప్రదేశ్ శాసన సభ 304 నియమ నిబంధనల క్రింద మద్దతును తెలపడం నిజంగా హర్షించదగ్గ విషయం!

ఇందిర ప్రభ అమలు వల్ల, లక్షలాది పేద ప్రజలు, దళితుల జీవితాలు ఆనందంతో పులకరించాయి.

తమ జీవితాలను వెలుగుతో నింపిన ఇందిర ప్రభకు బాలయ్య కుటుంబ సభ్యులు నిండు మనస్సుతో కృతజ్ఞతలు తెలియ జేసారు.

**- ఎ.వి. రాజా**

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ



జ్యోతిని ప్రజ్వలింపచేస్తున్న డా. వి.బి.జె. రావు, చెలికాని

# పట్టణ ప్రజా ప్రతినిధులకు శిక్షణపై 'అపార్డ్' లో సమావేశం

సెంటర్ ఫర్ అర్బన్ స్టడీస్ (పట్టణ అధ్యయన కేంద్రం), అపార్డ్ వారి ఆధ్వర్యంలో 2010, జూలై 30,31వ తేదీల్లో పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు, అధికారులకు రాబోవు మూడు సంవత్సరాలలో ఎటువంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి, అందులో ఏయే అంశాలు పొందుపరచాలి అన్న విషయం మీద "కంటెంట్ డెవలప్‌మెంట్ ఫర్ యు యల్ బి ట్రైనింగ్స్" అనే వర్క్‌షాప్ జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి మున్సిపల్ కమీషనర్‌లు, రీజనల్ డైరెక్టర్లు, మున్సిపల్ ఛైర్ పర్సన్లు, రిటైర్డ్ అధికారులు, పలు శిక్షణ సంస్థల్లో పని చేస్తున్న బోధకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని పలు అంశాలపైన విస్తృతంగా చర్చించారు.

ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డా॥ చెలికాని రావు పాల్గొన్నారు. వీరు సుమారు 38 సంవత్సరాలు ఫ్రాన్స్ దేశంలోని పారిస్ నగరంలో యునెస్కో సంస్థలో పనిచేశారు. ప్రస్తుతం వీరు పలు స్వచ్ఛంద సంస్థలను ఏర్పరచి పట్టణాలలో వున్నటువంటి సమస్యలపై దృష్టి పెడుతూ, ప్రజలలో సమస్యలపై అవగాహన, చైతన్యం కలిగించి, అధికారుల సహాయంతో, సమన్వయంతో పట్టణ సమస్యలను పరిష్కరించడానికి విశేష కృషి సల్పుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ తమ సామర్థ్యాన్ని ప్రత్యేక శిక్షణ ద్వారా పెంపొందించుకోవలసిన అవసరం ఎంతో వుందని ఆయన నొక్కి చెప్పారు. అపార్డ్ కమీషనర్ డా॥ ఫణికుమార్ ఐ.ఎ.ఎస్, తమ తొలి పలుకులలో, అపార్డ్ గురించి, ఏ పరిస్థితులలో పట్టణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశామో వివరించారు. సదస్సులో అందరూ చురుకుగా పాల్గొన్నారు. అపార్డ్ ఇచ్చే శిక్షణకు సంబంధించి మంచి దిశను నిర్దేశించ వలసినదిగా అభ్యర్థించారు. పట్టణ అధ్యయన కేంద్రం, అధిపతి, సదస్సు ముఖ్య వుద్దేశాలను, సదస్సు నుంచి ఆశిస్తున్న ఫలితాలను తెలియ జేశారు.

మొదటి రోజు చర్చలు పూర్తిగా ప్రజా ప్రతినిధులకు ఏర్పాటు చేయ వలసిన శిక్షణ గురించి జరిగాయి. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు అయిన వెంటనే, "ఫౌండేషన్" కోర్సును నిర్వహించాలని అందరూ ఏకీభవించారు. ఇందులో వుండవలసిన అంశాలను, నిశితంగా వివరించారు. కొద్ది రోజుల వ్యవధి తర్వాత, రిఫ్రెషర్ కోర్స్, ఆ తరువాత, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు సంబంధించి శిక్షణ ఇవ్వాలని తెలియచేశారు. శిక్షణ అనేది ఎప్పుడో ఒక రోజు నిర్వహించి వదలివేయకుండా నిరంతరం శిక్షణ ప్రభావం వున్నది అన్న విషయంపై దృష్టి పెట్టాలని, అప్పుడే తదుపరి శిక్షణ కోర్సులలో తీసుకు రావలసిన మార్పులు తెలుస్తాయని వివరించారు.



కార్యశాలలో పాల్గొన్న మున్సిపాలిటీల ప్రతినిధులు

రెండవ రోజు అధికారులకు ఇవ్వవలసిన శిక్షణ గురించి చర్చ జరిగింది. ప్రథమంగా మున్సిపాలిటీలలో, మున్సిపల్ కార్పొరేషన్‌లో నున్న వివిధ పోస్టులను గుర్తించడం జరిగింది. విస్తృత చర్చ అనంతరం మున్సిపాలిటీలలో 54 మున్సిపల్ కార్పొరేషన్‌లలో 92 పోస్టులు వున్నట్లు నిర్ధారించారు. తరువాత డిపార్టుమెంట్ పరంగా చేపట్టవలసిన శిక్షణ కోర్సులను, అందులో వుంచవలసిన అంశాలను తెలియ జేశారు. ఉన్నతాధికారులకు ఏర్పాటు చేయవలసిన శిక్షణా కార్యక్రమాలను ప్రత్యేకంగా రూపొందించడం జరిగింది.

సదస్సులో భాగంగా కేంద్ర ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్స్, వారి మాస్టర్ ట్రైనర్ శ్రీ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ ఏవిధంగా ఇస్తే మంచి ఫలితాలు వస్తాయి అన్న విషయాన్ని చర్చించారు. శిక్షణ ఇచ్చేటప్పుడు అవలంబించవలసిన పద్ధతులు, కొన్ని మెళుకువలను కూడా చర్చించటం జరిగింది.

సదస్సు ముగింపు సభలో, మెప్మా మిషన్ డైరెక్టర్, శ్రీమతి సునీత, ఐఎఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చక్కటి సదస్సు ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను కొనియాడుతూ, శిక్షణ యొక్క అవశ్యకతను ఆమె తెలియ జేశారు. వందన సమర్పణతో రెండు రోజుల సదస్సుకు ముగింపు పలికారు. పట్టణ అధ్యయన కేంద్రంలోని డా॥ దీపానాయర్, శ్రీ బాలాజీ రావు, శ్రీమతి సమత, కుమారి సుకీర్తి ఈ సదస్సులో కీలక భాగస్వామ్యం వహించారు.

**– డా. పి. రఘునాథరెడ్డి**

*ప్రొఫెసర్, సెంటర్‌హెడ్, పట్టణ అధ్యయన కేంద్రం*

# సత్వర గ్రామీణాభివృద్ధి సాధనకు స్థానిక ప్రభుత్వాల బలోపేతం




వర్క్‌షాపులో పాల్గొన్న కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి శ్రీమతి అంబికాసోని, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ సి.పి. జోషి, సహాయ మంత్రులు శ్రీ ప్రదీప్‌కుమార్ జైన్, కుమారి అగాథా సంగ్మా

అభివృద్ధి ఫలాలు దేశంలోని మారుమూల ప్రాంతంలోని చిట్టచివరి వ్యక్తికి చేరాలంటే పంచాయితీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉన్నదని కేంద్ర ప్రభుత్వ పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ పి.సి.జోషి అన్నారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జూలై, 22,23న న్యూ ఢిల్లీలో ఎన్.సి.ఎస్.ఏ. కాన్ఫరెన్సు హాలులో రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యశాలలో పాల్గొన్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల అధిపతులను, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామీణ పేదరిక నిర్మూలనకు, గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభి వృద్ధికి పలు ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, ఈ కార్యక్రమాల సమాచారం నిర్దేశిత లబ్దిదారులకు చేరటం లేదని శ్రీ పి.పి. జోషి అన్నారు. పథకాల మార్గదర్శక నియమాలు, ఉద్దేశిత లక్ష్యాలు మొదలగు సమాచారం ప్రజల చెంతకు తీసుకొని వెళ్ళాలంటే అవలంబించాల్సిన వ్యూహాలను గూర్చి ఈ రెండు రోజుల సమావేశంలో చర్చించి ఒక సమగ్ర వ్యూహాన్ని ఖరారు చేసినట్లయితే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆ వ్యూహాన్ని అవలంబించటం ద్వారా గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయటానికి చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు.

హక్కుల ప్రాతిపదికగా ప్రజలకు సేవలందించటానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. గ్రామ సభను బలోపేతం చేయటానికి ఈ సంవత్సరాన్ని గ్రామ సభల సంవత్సరంగా ప్రకటించి ప్రజలను చైతన్య వంతుల్ని చేస్తున్నామన్నారు. షెడ్యూల్డు ఏరియాలలో గ్రామ సభకు మరిన్ని అధికారాలు ఇస్తూ, పీసా చట్టం చేయటం జరిగిందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సెక్షను 13-17 లో గ్రామ పంచాయితీ / గ్రామ సభ పాత్రలను, బాధ్యతలను పొందుపర్చటం జరిగిందన్నారు. పంచాయితీ రాజ్ సంస్థలకు నేడు రాజ్యాంగ ప్రతిపత్తి ఉన్నప్పటికీ, రాజ్యాంగంలో సూచించిన విధంగా జిల్లా ప్రణాళికా కమిటీలు క్షేత్ర స్థాయిలో పనిచేయటంలేదన్నారు. అందుబాటులో ఉన్న నిధుల వివరాలు పంచాయితీలకు తెలియటంలేదన్నారు. అందుకే రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు ప్రజలలో, ప్రజాప్రతినిధులలో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ప్రసారం కోసం ప్రత్యేకంగా ఒక టెలివిజన్ ఛానెల్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేర్చాలంటే అవుట్ ఆఫ్ బాక్స్ ఆలోచనా విధానం కావాలన్నారు. ఆలోచనా దృక్పథంలో పూర్తి మార్పు రావాలన్నారు. అప్పుడే గ్రామీణాభివృద్ధికి ఒక క్రొత్త దిశా నిర్దేశం జరుగుతుందన్నారు.



రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యశాలకు ముఖ్య అతిధిగా




**వర్కుషాపులో ప్రసంగిస్తున్న కుమారి అగాధా సంగ్మా**
గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి




**ప్రసంగిస్తున్న శ్రీ సి.పి. జోషి**
కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి

విచ్చేసిన కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి శ్రీమతి అంబికా సోని మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలను ప్రజల చెంతకు చేర్చటంలో ప్రచార, ప్రసార మాధ్యమాలు ఎంతో ఉపయోగపడుతాయని, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తున్న సాంగ్ అండ్ డ్రామా డివిజన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆడియో విజువల్ పబ్లికేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫీల్డ్ పబ్లిసిటీ, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలు క్షేత్ర స్థాయిలో పలు కార్యక్రమాలు చేపడుతున్నాయనీ అన్నారు. అయితే ఈ ప్రచార కార్యక్రమాలన్నీ శాఖల వారీగా విడివిడిగా చేపడుతున్నందున విలువైన కాలం, ప్రభుత్వ ధనం వృధా అవుతున్నాయని ఆమె అన్నారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చేస్తున్న ఈ ప్రయత్నం ద్వారా గ్రామీణాభివృద్ధి పథకాలు అమలుచేస్తున్న వివిధ ప్రభుత్వ విభాగాలు ఒక ఏకీకృత ప్రచార - ప్రసార వ్యూహం అవలంబించటం ద్వారా సమాచారాన్ని ప్రజలకు సక్రమంగా అందచేయటానికి అవకాశం ఉన్నదని అన్నారు. అందుకే వివిధ ప్రభుత్వ విభాగాలు అమలు చేసే శిక్షణ, భావ ప్రసార వ్యూహాలలో సమూలమైన మార్పు రావాల్సిన తరుణం ఆసన్నమయిందని, ఈ కార్యశాల ద్వారా వచ్చిన సలహాలను సూచనలను పరిశీలించి, ఆచరించటానికి ప్రయత్నం చేస్తామని ఆమె అన్నారు. ప్రభుత్వం మీద విశ్వసనీయత పెరగాలంటే, ప్రజలకు పథకాల అమలుపై సమాచారం అందాలన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల ఉద్దేశ్యాలను ప్రజల చెంతకు చేర్చాలంటే ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగించుకొని మల్టీమీడియా కమ్యూనికేషన్ వ్యూహాన్ని అవలంబించాలని అంబికా సోనీ అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాచారాన్ని అందుబాటులోకి తీసుకొని రావాలంటే కమ్యూనిటీ రేడియో ఒక చక్కని సాధనంగా ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. 2012 నాటికి 4000 కమ్యూనిటీ రేడియో స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పనిచేస్తోందని ఆమె చెప్పారు.

లబ్దిదారులను కేవలం భాగస్వాములుగానే చూడకుండా హక్కుదారులుగా భావిస్తూ యు.పి.ఏ ప్రభుత్వం ప్రజలకు సమాచార హక్కు, నిర్బంధ ప్రాథమిక విద్యా హక్కు, ఉపాధి హామీ హక్కు వంటివి అందుబాటులోకి తెచ్చిందని, ఈ సమాచారం ప్రజలకు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిధిగా పాల్గొన గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కుమారి అగాధా సంగ్మా మాట్లాడుతూ, అభివృద్ధి ఫలాలు ప్రజల చెంతకు చేరాలంటే పంచాయితీ రాజ్ సంస్థలు పరిపుష్టి కావాలని, నిధులు, విధులు, సిబ్బందిని పంచాయితీలకు రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో బదలాయించాలని అన్నారు. గ్రామీణ పారిశుద్ధ్య సాధనలో సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే క్షేత్ర స్థాయిలో పంచాయితీ రాజ్ సంస్థలు కృషి చేయాలన్నారు. మన దేశంలో ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ ఇంకా శైశవ దశలోనే ఉన్నదని, గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్యాన్ని పెంపొందించటానికి సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం ప్రారంభించామని, ఇప్పటివరకూ సిక్కిం రాష్ట్రం మాత్రమే నూరు శాతం పారిశుద్ధ్యం సాధించిందని, కేరళ కొద్ది రోజుల్లో సాధించనుందనీ చెప్పారు. మిలిగిన రాష్ట్రాలు కూడా తమ వ్యూహాలను రూపొందించు కోవాలన్నారు.

ఏరోజైతే భారత దేశంలో ప్రతీ ఒక్క కుటుంబం మరుగుదొడ్డి సదుపాయాన్ని వినియోగించుకోగల్గుతుందో ఆరోజే దేశంలో అభివృద్ధి సమున్నత స్థాయికి చేరిందని చెప్పవచ్చని అన్న దేశ ప్రథమ ప్రధాని దార్శనికతను ఆమె జ్ఞప్తికి తెచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి సరఫరాకు జాతీయ గ్రామీణ నీటి సరఫరా పథకాన్ని అమలు పరుస్తున్నామని, ఐతే నేటికీ 30% ఆవాస ప్రాంతాలకు సురక్షిత త్రాగు నీటి సదుపాయం లేదని అన్నారు. త్రాగు నీటి సదుపాయం లేని ఆవాసాల సంఖ్య నేడు దేశంలో ఐదు లక్షల ఏడు వేల పైబడి ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందచేయటానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నప్పటికీ, పలు కారణాల రీత్యా వనరుల క్షీణత వల్ల రక్షిత మంచినీటి సదుపాయం లేని గ్రామాల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతోందని కుమారి సంగ్మా అన్నారు. దీనికి పరిష్కారం ప్రజా భాగస్వామ్య పద్ధతిలో మంచినీటి వనరుల యాజమాన్యాన్ని, రక్షిత మంచినీటి పథకాల అమలు, నిర్వహణ పనులను చేపట్టటానికి ప్రభుత్వ కృషి చేస్తోందని ఆమె అన్నారు.

ప్రజలకు సురక్షితమైన త్రాగు నీరు అందచేయటానికి ప్రభుత్వంతో సివిల్ సొసైటీ చేతులు కలపాల్సిన అవసరం ఉన్నదని ఆమె అన్నారు.







**శ్రీ ప్రదీప్‌కుమార్ జైన్**
కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి

**శ్రీమతి అంబికాసోని**
కేంద్ర సమాచార ప్రసార శాఖామంత్రి

మంచి నీటి పథకాల నిర్వహణలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించటానికే స్వజల ధార పథకాన్ని అమలు చేయటం జరిగిందన్నారు. ప్రతీ గ్రామంలో గ్రామ నీటి, పారిశుధ్ధ్య కమిటీలను ఏర్పర్చి పథకాల ప్రణాళికల తయారీ, అమలు, పర్యవేక్షణ, మూల్యాంకన దశలలో ప్రజా భాగస్వామ్యాన్ని సాధించే ఉద్దేశ్యంతో జాతీయ గ్రామీణ నీటి సరఫరా పథకాన్ని ప్రస్తుతం అమలు చేస్తున్నామని ఆమె చెప్పారు. నీటి వనరుల సుస్థిర యాజమాన్యాన్ని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాలు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల యాజమాన్యంలో అమలు చేయబడుతున్న భూగర్భజలాల వినియోగ పద్ధతులు ఆదర్శనీయం అని అన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ప్రదీప్ కుమార్ జైన్ మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద ప్రజలలో కొనుగోలు శక్తిని పెంచిందని, ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని నింపిందని. జీవన ప్రమాణాలలో నాణ్యతను తీసుకొని వచ్చిందని అన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల వివరాలను గ్రామీణ ప్రజలకు విస్తృతంగా తెలియచేయటానికి టి.వి., పత్రికలు, ఇతర మల్టీమీడియా విధానాల ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ గురుతర బాధ్యతను నిర్వర్తించటంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కీలక పాత్ర వహించాలని అభ్యర్థించారు. రాజీవ్ గాంధీ ఆలోచనల ప్రకారం - పంచాయితీ రాజ్ వ్యవస్థ ప్రస్తుత రూపంలో ఉన్నదని, ఈ సంస్థలను ఇంకా బలోపేతం చెయ్యాలని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వల్ల మహిళలలో సాధికారత పెరిగిందని అన్నారు. గృహాలకే పరిమితమైన మహిళల శక్తిని దేశ ప్రగతికి దోహదపడేలా చేసింది పథకం అని ఆయిన అన్నారు. పి.యం.జి.యస్.వై. పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అన్ని కాలాలకు ఉపయోగపడే రహదార్లు నిర్మించటం, ఇందిరా ఆవాస్ యోజన ద్వారా పేదలకు గృహ వసతి కల్పిస్తున్నామని అన్నారు. మాతృభూమి పట్టణాలలో లేదు గ్రామాల్లో ఉన్నదని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ దార్శినికతను అనుసరించి అభివృద్ధి ఫలాలు సమాజంలోని కడపటి వ్యక్తి వరకూ తీసుకొని వెళితే కానీ నిజమైన అభివృద్ధి కాదని శ్రీ ప్రదీప్ జైన్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధి సాధనకు ఒక చక్కని దశ-దిశ ఉండాలని, ప్రస్తుతం దేశంలోని ఆర్థిక స్థితి గతులు బాగా ఉన్నాయని, అయితే ప్రభుత్వ పథకాలను సరైన దిశలో నడపాలంటే మీడియా ప్రధాన పాత్ర వహించాలని అన్నారు. ఆకాశవాణి, దూరదర్శన్ తదితర మాధ్యమాల ద్వారా ప్రజలను చేరాలన్నారు. ♦



## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో అపార్డ్ శకటం

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో 'గ్రామ సభ' విషయాంశంపై అపార్డ్ రూపొందించిన శకటం పలువురిని ఆకర్షించింది. 56 సంవత్సరాల అపార్డ్ చరిత్రలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో శకటాన్ని రూపొందించి ప్రదర్శించటం ఇదే ప్రథమం. 2009-10 సంవత్సరాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ సభల సంవత్సరంగా పాటిస్తున్న సందర్భంలో గ్రామ సభ వైశిష్ట్యాన్ని తెలియపరుస్తూ వివిధ కళారూపాలతో అపార్డ్ రూపొందించిన శకటం చూపరులకు గ్రామ సభను బలోపేతం చేయవలసిన అవసరాన్ని మరొక్కసారి జ్ఞప్తికి తెచ్చింది. ♦

# ఫీచర్ వ్యాస వ్యాసులు అను కాలమిస్టులు

***అణువులో అనంత విశ్వాన్ని దర్శించగలవారు మాత్రమే ఫీచర్ వ్రాసి నెగ్గగలరు. అల్ప విషయంపై అనల్పంగా చర్చించగల చతురత వుండాలి. తెలుగుదేశంలో అలాంటివారు ఎందరో వున్నారు. వారిలో కొందరి ఫీచర్ రచనలను అనుకరిస్తున్నాను యీ పేరడీలో -***

*ప్రముఖులంతా వారి జీవితాల్లో ప్రేమలేఖలు రాశారో లేదో నాకు తెలియదు. వారి మీద నాకున్న యెనలేని అభిమానం కొద్దీ వొకవేళ వారు రాసి వుంటే యెలా వుండేవి అని వూహించి ఈ పేరడీ రాయటం జరిగింది.*

## చలం

**చలం గారు ముక్కు సూటిగా రాస్తారు. వారు ప్రేమలేఖ ఇలా వుండవచ్చు.**

నువ్వు చెప్పకపోయినా నాకు తెలుసు ఇప్పటికే నీ అంద చందాలను అంగాంగ సుందనంగా వర్ణిస్తూ చాలామంది ప్రేమలేఖలు రాసేసి వుంటారని, అందమైన ఆడది కనపడగానే కలాలు స్ఖలిస్తాయి. యీ దేశదౌర్భాగ్యం నాకు బాగా తెలుసు. ప్రేమకూ, కామానికీ మధ్య ఇనుపతెర వుందని వాళ్ళు పైకి చెబుతారు. అదంతా పోజు. వాళ్ళ దృష్టిలో ప్రేమంటే కామమే! ఆడదాన్ని చూడగానే వాళ్ళకు గుర్తొచ్చేది నల్లులు తిరిగే పందిరి మంచం. పిడచలు గట్టిన పాత పరుపూ మాత్రమే గుర్తుంచుకో.



అందని ద్రాక్షపళ్ళు పుల్లన - అందుకే మన దేశంలో శృంగార కవిత్వం కొండతా పుట్టి పెరిగింది. చలం చెబితే బూతూ. గీత గోవిందం కాదు. మలిన శృంగారం, అమలిన శృంగారం అని సబ్బుల్లోలాగా రక రకాలుగా యేం లేవు. వీళ్ళ హిపోక్రసీ లోంచి తయారైనవే యివన్నీ.

ఎలిజా! జీవితంలో సుఖాలు, వాటి అంచులు చూడాలంటే చలంతో, పడకగది బాత్‌రూము తప్ప మరొకటి తెలియని వాళ్ళతో......

*(మరీ యింత సూటిగా రాస్తే ఎలా చలం గారూ!)*

☆

## కరుణశ్రీ లేఖశ్రీ

**కరుణశ్రీ గారి కవితాకన్య అట్టే లోతులకు పోకుండా అలా పూలనావలా, పైపైన తేలుతూ సాగుతుంది. అందరికీ అందుబాటులో వుంటుంది. కరుడుగట్టిన కారుణ్యం, భావనలో లలిత లలితమైన భాష వీరి కవిత్వంలో కనిపిస్తాయి.**




*ప్రియశ్రీ,*

కుంకుమాంజలులు -



నిన్ను చూచిన ఆ మధురక్షణం- నా యౌవన సీమకొక సువర్ణ సుప్రభాతం. వలపు తలపు తీయని పిలుపుగా నా ఎదతలుపు తట్టింది. కల్యాణ కల్పవల్లిగా ముస్తాబై ముంగిట నిలిచింది. నీ మా సన్నాయి పాట. నీ పలుకు సృష్టికే కులుకు. నీ రూపం నేత్రపర్వం. నా జీవితాన అది ఒక మధుర పర్వం.

ఉదయమే లేచి నీ కోసం నిరీక్షిస్తూ పూల తోటలోకి నడిచాను. నీ చెలికత్తెలు- పూలబాలలు నన్ను చెలకట్ట నిస్తేనా!

'ఎవరికోసం?' అని నిగ్గదీసింది జూకామల్లె. 'కుమారి అసలే సుకుమారి. గాఢంగా ఎదురుచూస్తే కందిపోగలరు సుమా!' అని మందలించి కిలకిలా నవ్వింది నందివర్ధనం.

"నీ చెలి చెక్కిలి నొక్కాను నేను" అని వుడికించింది గులాబి. "నేనూ" అన్నది ముక్తసరిగా ముద్ద మందార. ఆమెకు నాసికగా అమరింది నేనంటూ, సన్నాయి నొక్కులు నొక్కింది పున్నాగ. పెదవుల కెంపుదనం తామే అన్నట్టు మౌనముద్రలు దాల్చాయి మంకెనలు. ఎంతకూ రాని నీకై చూచి, చూచి నిట్టూర్చి పచ్చగడ్డి తివాచీపై మేను వాల్చాను. "నీ ప్రేయసి పదములకు పారాణి దిద్దింది నేనే" అని గుసగుసలు చెప్పింది చిన్న గరికెపువ్వు. హిమస్నాత మాధవీలత నీవే తానైనట్టు వొక్కసారి వొళ్ళు విరిచింది.

*(ఇలా సాగే కరుణశ్రీ ప్రేమలేఖలకు జవాబు వచ్చే సంగతి ఎలాగున్నా - ఆ ప్రియశ్రీ పదేపదే పాఠంలాగా చదవుకోవడం మాత్రం ఖాయం.)*

☆

# సంజీవదేవ్

**సంజీవదేవ్ గారి సొంత శైలి, తార్కిక చింతన ప్రేమలేఖలో కూడా ప్రతిఫలిస్తాయనే అనుకుంటూ -**

*సుచరితా! మీ లేఖ అందలేదు.*

[redacted]ర్వ జగత్తులో రాసిన లేఖలు
[redacted]తమే అందుతవి, రాయని లేఖలు
[redacted]తం అందుతవి అవాస్తవిక జగత్తులో!
[redacted]యబడిన లేఖలు అందడం ఎంత
[redacted]హజమో, వ్రాయబడని లేఖలు
[redacted]ందక పోవడం కూడా అంతే సహజం.

మిమ్మల్ని చూడాలన్న ఔత్సుక్యం
[redacted]మ్మల్ని చూచాక అభివ్యక్త పరచలేని
[redacted]భీష్టంగా రూపాంతరం చెందింది.
అందుకే దూర ప్రాచ్య కవి మార్మికుడు యోన్‌నొ గూచీ అంటాడు.

"దూరంగా వుండే ప్రీతి పాత్రమైన వస్తువులు స్పర్శనీయతను కూడా కలిగి వుంటై" అని.

ముక్త గగనం క్రింద మీరు నడిచి వెళ్తున్నప్పుడు నా మానస కాసారంలో ఎన్నో రస రూపాలు కదిలేయి. వృష్ఠ భాగంలోని ప్రాకృతిక దృశ్యం శారదీయ స్వచ్ఛధావళ్యానికి ప్రతీకగా, అమల చిహ్నంగా గోచరించింది. బాహ్యసౌందర్యం రమ్యమైనదే కాని అంతరిక సౌందర్యం రమ్యతరమైనది. అలాగే ప్రేమించడం మధురమైనదే. సందేహం లేదు. ప్రేమించబడడం మధురతరమైంది ప్రేమించడం గొప్పదా, ప్రేమించబడడం గొప్పదా అంటే నిజానికి రెండూ కూడా గొప్పవే. ప్రేమించేవారు ప్రేమించబడినప్పుడు; ప్రేమించబడేవారు ప్రేమించినప్పుడు మాత్రమే ప్రేమ సఫలత చెందుతుంది. ప్రేమించేవారు ప్రేమించబడకపోయినా, ప్రేమించబడే వారు ప్రేమించకపోయినా కూడా సాఫల్యత శూన్యం-ఆదాన ప్రదానాలు హృదయాల మధ్య..."

*(దీనికి జవాబు రావడం మెంత సహజమో రాకపోవడం కూడా అంతే సహజం)*

☆

# ప్రేమ - లేఖై పారిపోయింది

**శేషేంద్ర శర్మ గారిది తెలుగులో కొత్తబాణి. ఆయనదొక ప్రత్యేకవాణి. వారు రాసే లేఖ వచనకవితలాంటి గద్యంలో సాగితే యిలా వుండచ్చు.**

కాదంబరీ!

నాటి ప్రత్యూషంలో క్షణక్షణమ[redacted]
అయి పరిస్పందిస్తున్నప్పుడు. నా హృ[redacted]
కుహరంలో లార్క్ పాడిన పాట[redacted]
మొహమల్ తివాచిగా పరిచాను
నీ కోసం.

నీ రూపం సోకి నా మనస[redacted]
ముక్కలై వడగళ్ళను వర్షిస్తోంది. ఉ[redacted]
రాలిపోతూన్న లిల్లీలు నా గుండెలోకి జారిపడే పిడుగులు! గుప్పెడు గుల్ మొహార్‌లు నీడలు నా తాపాన్ని చల్లార్చలేక ఆవిరులై దిగంతాలకు పారిపోతున్నాయ్.

చిట్లిపోయిన ఊహల్లోంచి స్రవిస్తున్న అశ్రువులు చెంపల్ని జల పాతాలు చేసి, పాదపీఠాన్ని నిర్దాక్షిణ్యంగా కోసేస్తున్నాయి. - కోమల విషాదాన్ని భరిస్తూ, నీ సౌమ్యశాసనం కోసం బానిసనై నిలబడ్డాను...

సాగరగర్భంలోంచి చీల్చుకు వస్తున్న ప్రతి కెరటపులయలోనూ నీ రూపాన్ని దర్శిస్తున్నా- విచ్చుకుంటున్న ప్రతి పువ్వు చేసే రెక్కల సవ్వడిలోనూ ఆ సీమ చైతన్యమూర్తిని వీక్షిసున్నా.

వేకువలో నీ లావణ్యాన్ని పాటలోకి తర్జుమాచేసి నా కళ్లకు విన్పిస్తుంది. చిన్న పక్షి ఘోషించే కోటి జలపాతాలను భరిస్తున్న నన్నాపాట సముచ్ఛకితుణ్ణి చేస్తుంది. నీ పదధ్వనుల్ని దోసిళ్ళలో గ్రోలి, నీ దరహాసాలను చూపుల చెమ్కీదారాలతో దండలల్లి హృదయ గవాక్షానికి తోరణం కట్టాలని వుంది.

కాదంబరీ! నీ రాక ఎప్పుడో? నీకోసం నిరీక్షిస్తూనే వుంటా-మృత్యువుతో కబురంపినా చాలు...

*(లేఖ చదివాక మనసు దూదిపింజలై తేలిపోతుంది - జవాబు మాట యెలా వున్నా)*

☆

# ఆస్థాన కవి ప్రేమలేఖ

**ఉర్దూ పారశీక భాషలు తెలిసిన ఆస్థానకవి దాశరథి. ఆయా భాషల్లోని శృంగార రసాన్ని ఇంకించుకున్న కొద్దిమందిలో దాశరథి ముఖ్యులు. అంగారం, శృంగారం కలిసికట్టుగా కవిత చెప్పగల దాశరథి గారి ప్రేమలేఖ వూహామాత్రంగా.**

మంచెమీద నుంచి పరిగపిట్టల్ని కసిరే చానా!

విసిరే వడిసెలలో రాళ్లు పెట్టావో పూలే తురిమావో తెలియదు కాని దెబ్బతిన్న నా గుండె విలవిల లాడుతోంది. గూపులు వేసే చూపులు అలుపు వచ్చి మంచె మీదె ఆగిపోయాయి. ఏ విసురులో నైనా నీ గుండెను గిరాటు వేస్తావనే ఆశతో మంచె దగ్గరే పొంచి వున్నాను.

నిన్ను చూడగానే అనుకున్నాను. ఏ పారశీక కవో వూహించి రచించని గజల్‌ని నువ్వే అయివుంటావని. ముషాయిరాల్లోంచి తప్పించుకు వచ్చిన కవిత పాదపంక్తివైనా అయివుండాలి. ఒక్కసారి మధుమాసం విలాసంగా
నా గుండె గుమ్మంలో పల్లకీ దిగిన ఆ[redacted]
మానసోద్యానంలో ఫుల్లున వెల్లివిరి[redacted]
ఒంటరిగా మోయలేనంత బరువు.

కవితాగారం గల యీ ష[redacted]
నేడు నీ వ్రోల గోరంత ప్రేమ[redacted]
అర్థిస్తున్న గరీబు. సఖీ! నీవు సాకివి,
నీ కన్నులు మధుపానపు గిన్నెలు,
నా ఎద కారవాన్ సరాయి. అయితే
యిక నేను నవాబునే సుమీ!

నికుంజం వుంది. ఒత్తిల మెత్తని [redacted]
పాన్పు వుంది, గుండె నిండుగ ప్రేమ[redacted]

సుధారసమున్నది. నీవు కూడా వుంటే చెలీ! యిక లేనిదేమున్నది? రూపు రేఖలు పసిగట్టాను గాని నీ విలాసమే తెలియకున్నది రాణీ!

*(ఇంతకీ ఆ విలాసవతి విలాసం తెలియదు యీ కవిగారికి, ఇక జవాబు ప్రసక్తి యేల?)*

☆

## ఫిలిం క్రిటిక్ ప్రేమలేఖ

**వీరికి కూడా వొక ప్రత్యేక బాణీ వుంది. సినిమా ప్రపంచంలో ఏదైనా కమనీయ దృశ్యకావ్యంగానే కనిపిస్తుంది. ఆ విధమైన తాత్విక చింతన వీరికి వృత్తితో పెట్టిన విద్య.**

*కుమారి చిత్రాంగి,*

అభినందనలు. ఇటీవల థియేటర్‌లో మిమ్మల్ని చూసిన సన్నివేశం మర్చిపోలేనిది. మొహంలో చక్కదనం, దుస్తుల్లో చిక్కదనం, అణువణువునా కోమలత్వం కలిగి ప్రతి ఫ్రేములోనూ కమనీయ దృశ్య కావ్యంలా, రంగుల హరివిల్లులా వున్నారనడం అతిశయోక్తి కాదు.

[redacted]

ముఖ్యంగా మీరు రిక్షాబేరం చేసిన సంఘటన నా మనస్సుపై చెరగని ముద్రలు వేసింది. అది ఈ ప్రేక్షకుని హృదయంలో తొలకరి పూలజల్లు. మాటలు సందర్భానికి అనుగుణంగా వున్నాయి. మీరు ధరించిన దుస్తులు మీ రూపానికి తగినట్టు వున్నాయి. మీ అందచందాలు అడుగడునా ద్యోతకమైనాయి. అందం, ఆనందం, హుందాతనం సమపాళ్ళలో మేళవించుకున్న మిమ్మల్ని సకుటుంబంగా ప్రేమిస్తున్నాము. మిమ్మల్ని కన్న మీ తల్లిదండ్రులు నిజంగా అభినందనీయులు.

*(లేఖకు కొత్త సినిమా ఫ్రీపాస్ జత చేస్తే ప్రయోజనం వుండవచ్చు)*

☆

## ప్రేమాయణ రెడ్డి

**డాక్టర్ నారాయణరెడ్డి గారి గద్యం కూడా పద్యంలాగే యతిప్రాసలతో సాగుతుంది. వారు ప్రేమలేఖ వ్రాసినా కవిత రూపే ధరిస్తుంది. మరోలా వూహించడం అసాధ్యం. అందుకే యిలా.**

[redacted]

(ప్రేయసికి ప్రేమ లేఖ రాద్దామని అల వోకగా రచించినది)

*మధుర రసైక ధారావాహినీ!*

నమస్తే! నమస్తే! ప్రియసఖీ! నేనే, నేనే నారాయణరెడ్డిని, కవిని, రవిని - నిను కోరే ప్రియుణ్ణి.

ూపులు వలపు సేతవులు
పులు రామప్ప శిల్పాలు
ంతరాయల్ని నేను
నీలో లకుమను చూచాను
మన ఇరువురి అనుబంధం
కావాలి నవ నవ్య ప్రణయ ప్రబంధం
మరో హరివిల్లు సృజించాను
విపంచిగా సప్తవర్ణాలు పలికించాను
నారిలేని వెలితి వేధించు నను
వెలదీ! హరి వింటి నారి నీవె!
పొదరింటి... ...

*(ఈ లేఖకు జవాబు రాదని రాయడానికి కలం కదలలేదు)*

☆

## రాధ, గోపాలం, బుడుగు, అప్పారావు, గిరీశం ప్రేమలేఖలు వ్రాస్తే . . .

**ముళ్ళపూడి వెంకటరమణ గారు పుట్ల కొద్దీ రచనలు వండి వార్చలేదు. వేళ్ళ మీద లెక్కించాలన్నా వేళ్ళు మిగిలిపోతాయి. ఆ రాసిన కాసినీ వేళ్ళుపాతుకుని తెలుగు మాగాణంలో ఏటేటా ఎడిషన్ల కాపులు కాస్తూనే వున్నాయి.**

ఇంకో తరానికి కూడా వాటి రుచులు అందుతూనే వుంటాయి. ముళ్ళపూడి వారు ఆయురారోగ్యాలు గల పాత్రలను సృజిస్తే, అవి స్రష్టను అనుక్షణం గుర్తుంచుకునేలా నేటికీ ప్రవర్తిల్లుతున్నాయి. అందుకే ముళ్ళపూడి వారు కొత్తగా రాయకపోయినా (సినిమా మాట కాదు) ఆయన ఎప్పటికప్పుడు కొత్తగా రాసినట్టే వుంటుంది. వారి ఏ రచన ఎప్పుడు చదివినా. ఆయన సృష్టించిన భూమికలన్నీ రోజు రోజూ మనకు కనుపించి మనల్ని పలకరించి వెళుతుంటాయి. ఆయన కలం పట్టుకుని జీవం పోసిన వాటిలో అప్పారావు, గిరీశం (మళ్ళీ పుట్టాడు) రాధ, గోపాలం, బుడుగు. ఇవికాక సుబ్బారావు, గుర్నాధం, వీర్రాజు ఇలా ఎందరో...? ఇంకా చక్రవర్తి, జానికమ్మ, నరసమ్మ లాంటి జనతా ఎక్స్‌ప్రెస్ ప్రయాణీకులు కోకొల్లలు.

తెలుగులో వాడుకభాషను మరోసారి వడగట్టి నిగ్గు తేల్చిన ఘనత వెంకటరమణ గారికే దక్కుతుంది. సాధారణంగా చెయ్యి తిరిగిన ప్రతి రచయితకు ఒక స్వంత శైలి అలవడుతుంది. కాని ముళ్ళపూడి వారు పాత్రోచితం శైలిని సాగించారు. గిరీశం ధోరణికి, అప్పారావు మాటతీరుకీ, బుడుగు భాషకూ, గోపాలం మాటకూ, రాధమ్మ పలుకుకీ సంబంధం వుండదు. ఏ నోట పలికించాల్సిన మాటను ఆ తీరులో ఆ నోట పలికించి సాహిత్యంలో సరికొత్త అవధానాన్ని చేశారు. వారు చెప్పదలుచుకున్నవన్నీ సృష్టించిన పాత్రల చేతనే చెప్పించారు. చెప్పవలసిన అంశాన్ని బట్టి పాత్రను సృజించుకున్నారు.

విభిన్న తత్వాలు, మాటతీరుగల కొన్ని ముళ్ళపూడివారి భూమికల ను ఈ పేరడీకి స్వీకరిస్తున్నాను. సరాసరి వెంకటరమణగారి ప్రేమలేఖ ఎలా ఉంటుందో వూహించి రాయడం కష్టసాధ్యం అనిపించింది. అందుకని వారి రచనల్లో తారసపడే కొందరు వ్యక్తుల ప్రేమలేఖలు ఎలా వుంటాయో అనుకరించాలని ప్రయత్నం.

☆

# సంపూర్ణ అక్షరాస్యతను సాధించుకుందాం

ప్రతి సంవత్సరం సెప్టెంబరు 8వ తేదీన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. 1965 సంవత్సరం సెప్టెంబరు నెలలో ఇరాన్ రాజధాని టెహరాన్‌లో జరిగిన ప్రపంచ విద్యా శాఖా మంత్రుల సమావేశంలో సెప్టెంబరు 8వ తేదీన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా నిర్వహించాలని తీర్మానించారు. దానికి అనుగుణంగా 1966 సంవత్సరం నుండి అన్ని దేశాలలోను ఈ కార్యక్రమం జరుగుతోంది. అక్షరాస్యత పట్ల సమాజంలో అవగాహన కల్పించడం, దాని కొరకు ప్రజాభిప్రాయాన్ని సమీకరించడం, ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు అక్షరాస్యతా కార్యక్రమాలు చేపట్టే విధంగా ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం.

యునెస్కో వారి లెక్కల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా 77 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉన్నారు. అంటే ప్రపంచ వయోజన జనాభాలో సుమారు 18 శాతం నిరక్షరాస్యులు. వారిలో 64 శాతం మహిళలు. ప్రపంచ నిరక్షరాస్యులలో అత్యధిక మంది 34.6 శాతం ఒక్క భారత దేశంలోనే ఉన్నారు. సంఖ్యా పరంగా తీసుకొంటే 26.6 కోట్ల మంది నిరక్షరాస్యులు మన దేశంలో ఉన్నారు.

మన దేశంలో అక్షరాస్యత పెరుగుదలకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చెపట్టింది. వాటి ఫలితంగా అక్షరాస్యత శాతం పెరుగుతోంది. 1961లో అక్షరాస్యతా శాతం 16.67 శాతం ఉంటే, 2001 నాటికి ఇది 65.38 శాతానికి పెరిగింది.

**భారతదేశంలో అక్షరాస్యత పెరుగుదల (శాతాలలో)**

| సంవత్సరం | అందరు | పురుషులు | స్త్రీలు |
|---|---|---|---|
| 1951 | 18.33 | 27.16 | 8.86 |
| 1961 | 28.30 | 40.39 | 15.33 |
| 1971 | 34.45 | 45.95 | 21.97 |
| 1981 | 43.57 | 56.38 | 29.76 |
| 1991 | 52.21 | 63.13 | 39.26 |
| 2001 | 65.38 | 75.85 | 54.16 |

మన రాష్ట్రంలో తీసుకుంటే, అక్షరాస్యత వెనుకబడిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. 61.11 శాతం అక్షరాస్యతతో దేశంలోని 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో మనం 28వ స్థానంలో ఉన్నాం. రాష్ట్రంలో జిల్లాల వారీగా తీసుకుంటే 7 జిల్లాల అక్షరాస్యత జాతీయ అక్షరాస్యత శాతం (65.38) కంటే ఎక్కువగా ఉంటే, 14 జిల్లాలలో రాష్ట్ర అక్షరాస్యతా శాతం (61.11) కంటే తక్కువగా ఉన్నాయి.

**జిల్లాల వారీగా అక్షరాస్యతా శాతం**

| విభాగం | జిల్లా పేరు | అక్షరాశ్యత శాతం |
|---|---|---|
| జాతీయ అక్షరాశ్యతా శాతం అయిన 65.38 కన్నా ఎక్కువ ఉన్న జిల్లాలు | 1. హైదరాబాద్ | 78.81 |
| | 2. పశ్చిమ గోదావరి | 73.53 |
| | 3. క్రిష్ణ | 64.85 |
| | 4. చిత్తూరు | 66.77 |
| | 5. రంగారెడ్డి | 66.16 |
| | 6. నెల్లూరు | 65.08 |
| | 7. తూర్పు గోదావరి | 65.48 |
| రాష్ట్ర అక్షరాశ్యత 60.47 జాతీయ అక్షరాశ్యత కన్నా తక్కువ, రాష్ట్ర అక్షరాస్యత కన్న ఎక్కువ | 1. కడప | 62.86 |
| | 2. గుంటూరు | 62.54 |
| రాష్ట్ర అక్షరాస్యత కన్న తక్కువ వున్న జిల్లాలు | 1. విశాఖపట్నం | 59.96 |
| | 2. వరంగల్ | 57.13 |
| | 3. ప్రకాశం | 57.38 |
| | 4. నల్గొండ | 57.15 |
| | 5. ఖమ్మం | 56.89 |
| | 6. అనంతపురం | 56.13 |
| | 7. కరీంనగర్ | 54.89 |
| | 8. శ్రీకాకుళం | 55.13 |
| | 9. కర్నూల్ | 53.32 |
| | 10. ఆదిలాబాద్ | 52.68 |
| | 11. నిజామాబాద్ | 52.02 |
| | 12. మెదక్ | 51.65 |
| | 13. విజయనగరం | 51.07 |
| | 14. మహబూబ్‌నగర్ | 44.41 |

అయితే గతంలో కన్నా రాష్ట్రంలో అక్షరాస్యతా శాతం క్రమేణా పెరుగుతోంది. ముఖ్యంగా మహిళల అక్షరాస్యతలో మంచి పురోగతి సాధిస్తున్నాం. మహిళా అక్షరాస్యత పెరుగుదల పురుష అక్షరాస్యతా పురోగతి కంటే అధికంగా ఉంది.

| సం॥ | అందరు | పురుషులు | స్త్రీలు |
|---|---|---|---|
| 1961 | 21.10 | 30.19 | 12.03 |
| 1971 | 24.57 | 33.18 | 15.75 |
| 1981 | 35.66 | 46.83 | 24.16 |
| 1991 | 44.09 | 55.12 | 32.72 |
| 2001 | 60.47 | 70.32 | 50.43 |

**అక్షరాస్యత ప్రాముఖ్యత**

అక్షరాస్యతకు, ముఖ్యంగా వయోజన అక్షరాస్యతకు ఎందుకు అంత ప్రాముఖ్యత ఇవ్వాలి. అక్షరాస్యత ప్రయోజనాలపై అనేక మందిలో అనేక సందేహాలు ఉన్నాయి.

ఈ నాటికీ కొంతమంది అక్షరాస్యతా కార్యక్రమాల అవసరాన్ని ప్రశ్నిస్తుంటారు. వారు చెప్పేదేమిటంటే

1. రాయడం, చదవడం వచ్చినంతమాత్రాన ఆదాయం పెరుగుతుందా? 2.పెద్దల చదువుకు పెట్టే ఖర్చు పిల్లల చదువు మీద పెడితే మంచి ఫలితాలుంటాయి కదా? 3. ఆర్థికాభివృద్ధి ముందా? అక్షరాస్యత ముందా?

- ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పరిశోధనలు ఈ వాదనలను కొట్టి పారేస్తున్నాయి. అక్షరాస్యత వల్ల తక్షణమే ఆదాయం పెరగకపోవచ్చు. కాని నైపుణ్యాలు పెంచుకొనే అవకాశాలు పెరుగుతాయి. దీనివల్ల దీర్ఘకాలికంగా ఆదాయం పెరుగుతుంది. నిరక్షరాస్యులు శారీరక శ్రమతో కూడిన పనులకు మాత్రమే పరిమితం అవుతారు. అక్షరాస్యులు నైపుణ్యం గల పనులు నేర్చుకోగల్గుతారు.
- పెద్దలు చదవకుండా వారికి చదువు విలువ తెలియకుండా పిల్లల చదువు ద్వారానే సంపూర్ణ అక్షరాస్యత సాధించడం సాధ్యం కాదనేందుకు అనేక ఉదాహరణలున్నాయి. పెద్దలు చదువుకు తక్షణ ప్రయోజనం ఉంటుంది. పిల్లల చదువుకు దోహదపడుతుంది. ఇవి ఒక దానికి ఒకటి పోటీ కాదు. ఒకదానిని ఒకటి బలపరుస్తాయి. నిరంతర విద్య ద్వారా అక్షర విజ్ఞాన సమాజ

**సెప్టెంబరు 8 అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం**

స్థాపనకు దోహదపడతాయి.

- అభివృద్ధి లక్ష్యం జీవన నాణ్యత పెంచడం. జీవన నాణ్యత పెంచడానికి అక్షరాస్యత కీలకం. ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు కూడా జీవన నాణ్యతకు సూచికలయిన స్త్రీ పురుష నిష్పత్తి, మాతా శిశు మరణాలు, సగటు ఆయుర్దాయం వంటి వాటిలో వెనుకబడి ఉన్నాయి. అక్షరాస్యతలో ముందున్న కేరళ వంటి ప్రాంతాలలో జీవన నాణ్యత సూచికలు ఉన్నతంగా ఉన్నాయి.

**అక్షరాస్యత - ప్రయోజనాలు**

అందరికీ విద్య ప్రపంచ నివేదిక 2006 ప్రకారం అక్షరాస్యత ప్రయోజనాలు వివిధ కోణాలలో ఉంటాయి.

**వ్యక్తిగత ఫలితాలు**

అక్షరాస్యతను సాధించిన వ్యక్తులు ఆత్మ విశ్వాసం కలిగి ఉంటారు.. తమ తమ వృత్తి వ్యాపకాల్లో నైపుణ్యతను పెంచుకోగలిగి సాధికారతను సాధించగలుగుతారు. ఆధునిక విజ్ఞాన పరిణామాలను ఆకళింపు చేసుగలుగుతారు. కుటుంబం - ఆరోగ్యం వంటి ప్రధాన అంశాల పట్ల అవగాహన పెరిగి, జాగరూకత వహించగలుగుతారు. స్త్రీ - పురుషులు ఇరువురూ వారి మధ్య నున్న అంతరాలు కుదింపబడి నైతిక సమానత్వం సుసాధ్యమవుతుంది.

**సాంస్కృతిక ప్రయోజనాలు :** 'అక్షరాస్యత' మనుషుల మధ్య నైతిక విలువలను పెంపొందింపజేస్తుంది. మంచి - చెడులను బేరీజు వేసుకోగల ఆత్మవిమర్శకు అక్షరాస్యత అంకురార్పణ చేస్తుంది. ఫలితంగా వ్యక్తుల ప్రవర్తనా తీరులోనే 'మార్పు'కు అవకాశం కలుగుతుంది. వ్యక్తి చైతన్యం పెరిగి భిన్న సమూహాల మధ్యనున్న విభేదాలు, - అపోహలు తగ్గడానికి, 'సామాజిక సమానత్వం' దిశగా సామాజిక మార్పుకు దోహదపడుతుంది.

**సామాజిక ప్రయోజనాలు :** అక్షరాస్యతా ప్రభావంతో వ్యక్తుల జీవన స్థాయి మెరుగుపడి, అంతిమంగా సామాజిక స్థాయి విలువలు పెరగుతాయి. వ్యక్తుల్లో ఆరోగ్యం - పర్యావరణం వంటి సామాజిక అంశాలపట్ల అవగాహన పెరిగి జీవన ప్రమాణాలు పెరిగే వీలుంటుంది. సామాజిక అభివృద్ధికి కొలబద్ధలైన అంశాలలో ప్రగతి సాధ్యమవుతుంది.

**అక్షరాస్యత అంటే ?** అక్షరాస్యత, అక్షరాస్యుడు/రాలు మొదలైన పదాల గురించి భిన్న అవగాహనలు ఉన్నాయి. అక్షరాస్యుడు/రాలు అంటే చదవడం, రాయడం, లెక్కలు చేయగల తన సామర్థ్యాలను రోజు వారీ జీవితంలోని అవసరాలకు అన్వయించుకోగలిగిన వారిగా అర్థం చేసుకోవాలి. సంతకం మాత్రమే చేయగలవారు అక్షరాస్యులైనట్లు కాదు.

జాతీయ సాక్షరతా మిషన్ ప్రకారం ఒక వ్యక్తిని అక్షరాస్యుడైనట్లుగా ప్రకటించాలంటే ఈ కింది కనీస అక్షరాస్యతా స్థాయి సాధించాలి.

కార్యనిర్వాహక అక్షరాస్యత (Functional Literacy) అంటే

1. అక్షర జ్ఞానంలోనూ, సంఖ్యా పరిజ్ఞానంలోనూ స్వశక్తిని పొందడం
2. సమాజంలో తాము అణచివేయబడడానికి గల కారణాలు గ్రహించి, అణిచివేతకు దారితీస్తున్న పరిస్థితులను అధిగమించడానికి సంసిద్ధులుగా తయారు చేయడం. 3. తమ జీవన స్థాయి, ఆర్థిక పరిస్థితులు మెరుగు పరచుకోవడానికి అవసరమయ్యే నైపుణ్యాల్ని అలవరుచుకోవడం.
4. జాతిసమైక్యం, పరిసరాల పరిరక్షణ, స్త్రీ సమానత్వం, చిన్న కుటుంబం సూత్రాలు అనే నాలుగు జాతీయ విలువలను పెంపొందించుకోవడం.

**అక్షర జ్ఞానం, సంఖ్య పరిజ్ఞానంతో స్వశక్తి అంటే**

1. చదవడం
   - ఎ) అభ్యాసకులు తమకు ఆసక్తి గల విషయాలకు సంబంధించిన ఒక పేరాను, నిమిషానికి 30 పదాలు చొప్పున చదవడం
   - బి) సరళమైన భాషలో ఉన్న చిన్న పేరాను నిమిషానికి 35 పదాలు తమలో తాము చదువుకోవడం.
   - సి) రహదారి, ట్రాఫిక్ గుర్తులను, పోస్టర్లను, చిన్న చిన్న సందేశాలను, నూతన అభ్యాసకులకు ఉద్దేశించబడిన వార్తాపత్రికలను చదివి అర్థం చేసుకోగలగడం.
2. రాయడం
   - ఎ) నిమిషానికి 7 పదాల చొప్పున అవగాహన చేసుకొని, చూసి రాయడం
   - బి) డిక్టేషన్ చెబితే నిమిషానికి 5 పదాల వేగంతో రాయగలగడం
   - సి) వరస క్రమంలో పదాల మధ్య ఖాళీ ఇస్తూ రాయగలగడం.
   - డి) చిన్న ఉత్తరాలు, దరఖాస్తులు, ఫారాలు సొంతంగా రాయడం
3. సంఖ్యా పరిజ్ఞానం
   - ఎ) 1 నుండి 100 వరకు గల అంకెలు చదవడంతో పాటు రాయగలగడం.
   - బి) మూడు స్థానాల వరకు గల సంఖ్యలతో చిన్న చిన్న కూడికలు, తీసివేతలు, రెండు అంకెల గుణకార, భాగహారాలు చేయగలగడం.
   - సి) తూనికలు, కొలతలు, ద్రవ్యమానం, దూరవమానం, క్షేత్రమానం, కాలమానం వంటి వాటితో పరిజ్ఞానం
   - డి) తమ వృత్తి, జీవన పరిస్థితులకు అవసరమైనంత వరకు నిష్పత్తులు, అనుపాతం, వడ్డీ మొదలైన వాటిలో పరిజ్ఞానం కలిగి ఉండడం.

**సాక్షర భారత్ - భావన - మౌలికాంశాలు**

దేశంలో అక్షరాస్యతను పెంచేందుకు జాతీయ సాక్షరతామిషన్ 'సాక్షర భారత్' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. సెప్టెంబరు 8, 2009 నాడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని మన ప్రధాన మంత్రి 'సాక్షర భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**సాక్షర భారత్ లక్ష్యాలు**

సాక్షర భారత్ ప్రధాన లక్ష్యాలు నాలుగు అవి:

**1. ప్రాథమిక అక్షరాస్యత:** అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం లేని వయోజనులకు ప్రయోజన అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం అందించడం. **2. ప్రాథమిక విద్య:** ప్రాథమిక అక్షరాస్యతను మించి తమ చదువు కొనసాగించేందుకు, నియత విద్యకు సమతులమైన విద్యను పొందేందుకు వయోజన నూతన అక్షరాస్యులకు అవకాశాలు కల్పించడం. **3. నైపుణ్యాభివృద్ధి:** నూతన అక్షరాస్యులు, ఇతరులు వారి సంపాదన, జీవన పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి తగు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించడం. **4. నిరంతర విద్య:** వయోజన నూతన అక్షరాస్యులకు, ఇతరులకు నిరంతర విద్యకు అవకాశాలు కల్పించడం. అక్షరాస్యత, అక్షరాస్యనంతర, నిరంతర విద్యా కార్యక్రమాలను ఒకదాని తర్వాత మరొకటి వరుస క్రమంలో నడవడం కాకుండా పరస్పర కొనసాగింపుగా కలగలిపి నడవడం 'సాక్షరభారత్' ప్రత్యేకత.

విస్తృత అర్థంలో చూసినప్పుడు 'సాక్షర భారత్' లక్ష్యం అభ్యాసన

సమాజాన్ని, జ్ఞాన సమాజాన్ని ఆవిష్కరించడమే.

**నిర్దిష్ట లక్ష్యం** • 15 సంవత్సరాల వయస్సు పైబడిన 7 కోట్ల వయోజన నిరక్షరాస్యులకు ప్రాథమిక అక్షరాస్యతను అందించడం.

- 15 లక్షల వయోజనులకు ప్రాథమిక విద్యను సమతుల్య కార్యక్రమాల ద్వారా అందించడం.
- 15 లక్షల వయోజనులకు వృత్తి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం.

**ప్రాధాన్యతా మార్గాలు** : • వయోజన నిరక్షరాస్యులందరూ ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు. అయితే అసలు బడికి వెళ్ళే అవకాశం లభించని లేదా తాము నేర్చుకొన్న చదువు మరచిపోయిన నిరక్షరాస్య మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది.

- సాక్షర భారత్ కార్యక్రమం ప్రధానంగా మహిళా కార్యక్రమం. ఈ కార్యక్రమంలో 85 శాతం మంది లబ్ధిదారులు మహిళలుంటారు. దేశంలో అక్షరాస్యతలో స్త్రీ, పురుష అంతరాన్ని తగ్గించేందుకు సాక్షర భారత్ కృషి చేస్తుంది. ప్రస్తుతం ఈ అంతరం 20 శాతానికి పైనే ఉంది.
- అక్షరాస్యతా శాతం తక్కువ ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అల్ప సంఖ్యాక వర్గాలలోని వయోజన నిరక్షరాస్యులపై ప్రత్యేకంగా శ్రద్ధ కనబరుస్తారు. అల్ప సంఖ్యాక వర్గాలలోని ముస్లింలపై ప్రత్యేకంగా కేంద్రీకరించి పని చేస్తారు. అదే విధంగా అక్షరాస్యతలో వెనకబడిన ప్రాంతాలపైన కూడా దృష్టి కేంద్రీకరిస్తారు.
- పంచాయితీరాజ్ సంస్థలలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యతనిస్తారు. వీరు అక్షరాస్యులుగా మారితే అట్టడుగు స్థాయిలో పరిపాలనా వ్యవస్థ ఎన్నో రెట్లు మెరుగవుతుంది.
- మొదట గ్రామీణ ప్రాంతాలపై కేంద్రీకరిస్తారు. తదుపరి దశలో గ్రామీణేతర ప్రాంతాలకు విస్తరిస్తారు.
- రాష్ట్రాల మధ్య, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య అక్షరాస్యతలోని అంతరాలను తగ్గించడం సాక్షర భారత్ ఇంకో లక్ష్యం. వివిధ రాష్ట్రాలలో అక్షరాస్యత శాతం 33 నుండి 88 వరకు ఉంది. ఈ అంతరం తగ్గించడం కోసం కార్యక్రమం మొదటి దశలో, 2001 జనాభా లెక్కల ప్రకారం సగటు మహిళా అక్షరాస్యతా 50 శాతం అంతకన్నా తక్కువ ఉన్న జిల్లాలలో కార్యక్రమం అమలు చేస్తారు.
- దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 18 జిల్లాలను మొదటి దశ కార్యక్రమం క్రింద ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో హైదరాబాదు, ఆదిలాబాదు, కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలో అక్షరాస్యత ఎక్కువ ఉన్నందున ఈ కార్యక్రమం అమలు చేయడం లేదు. ఆదిలాబాదు జిల్లా సగటు మహిళా అక్షరాస్యత తక్కువే. అయితే నిరంతర విద్యా కార్యక్రమం అమలు చేసిన జిల్లాలనే మొదటి దశలో ఎంపిక చేసిన కారణంగా ఈ జిల్లాను ఎంపిక చేయలేదు.

**సాక్షర భారత్ అమలు విధానం / వ్యూహం**: అన్ని స్థాయిలలో పంచాయితీ రాజ్ సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. కార్యక్రమ నిర్వహణ కోసం పంచాయితీరాజ్ సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక కమిటీలైన జిల్లా లోక్ శిక్షా సమితి, మండల లోక్ శిక్షా సమితి, పంచాయితీ లోక్ శిక్షా సమితి, తమ పరిధిలో మొత్తం కార్యక్రమానికి ప్రణాళికలు తయారు చేయడం, అమలు చేయడం, సామాజిక సమీకరణ చేయడం, పర్యవేక్షణ చేయడం, మూల్యాంకనం చేయడం వంటి విధులను నిర్వహిస్తారు. మొత్తం కార్యక్రమానికి బాధ్యత వహించి నడిపిస్తారు. కార్యక్రమం అమలుకు కావలసిన నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో సమకూరుస్తాయి. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమం అమలులో ఎప్పటికప్పుడు మార్గనిర్దేశకత్వం వహిస్తూ సహకరిస్తాయి. మంచి పర్యవేక్షణ, మూల్యాంకనా వ్యవస్థలను ఏర్పాటు చేసి కార్యక్రమ అమలును పర్యవేక్షిస్తాయి.

'సాక్షర భారత్' అమలుకు కార్యస్థానాలు గ్రామాలు. అందువల్ల కార్యక్రమం అమలులో గ్రామ పంచాయితీ, పంచాయితీ లోక్ శిక్షా సమితులకు విశిష్ట స్థానం ఉంది. ప్రతి గ్రామ పంచాయితీలో ఒక లోక్ శిక్షా కేంద్రం ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయితీ జనాభా 5000 కంటే ఎక్కువగా ఉంటే, ఇంకొక లోక్ శిక్షా కేంద్రం మంజూరు చేస్తారు. ప్రతి లోక్ శిక్షా కేంద్రాన్ని నడవడానికి ఇద్దరు అక్షరాస్యతా సమన్వయకర్తలు ఉంటారు. పంచాయితీ లోక్ శిక్షా సమితి కో-ఆర్డినేటర్లను ఎంపిక చేస్తుంది. లోక్ శిక్షా కేంద్రం గ్రామ పంచాయితీ పరిధిలో 'సాక్షర భారత్' కార్యక్రమాల నిర్వహణ, అనుసంధాన కేంద్రంగా పనిచేస్తుంది. ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్య, నైపుణ్యాభివృద్ధి, నిరంతర విద్యా కార్యక్రమాలను, అభ్యాసకులను నమోదు చేస్తుంది. లోక్ శిక్షా కేంద్రాన్ని గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తారు. అక్షరాస్యతా ఉద్యమానికి సంస్థాగతమైన, యాజమాన్య పరమైన, వనరుల పరమైన సహకారం లోక్ శిక్షా కేంద్రం అందజేస్తుంది.

లోక్ శిక్షా కేంద్రం గ్రామ పంచాయితీ పరిధిలో గల సాక్షర భారత్ లబ్ధిదారులను గుర్తిస్తుంది. వారి కోసం ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్య, నైపుణ్యాభివృద్ధి, నిరంతర విద్యా కార్యక్రమాల ప్రణాళికను తయారుచేస్తుంది. గ్రామ పంచాయితీ పరిధిలో గల విద్యావంతులను స్వచ్ఛంద కార్యకర్తలు (వాలంటీర్లు)గా పనిచేసేలా ప్రోత్సహిస్తుంది. పంచాయితీ పరిధిలోని ఆవాసాలలో ఒక్కో కేంద్రంలో 10 మంది వరకు అభ్యాసకులను చేర్చుకొని వాలంటీర్లతో, అభ్యాసకులకు లోక్ శిక్షా కేంద్రం ఆధ్వర్యంలో మ్యాచింగ్ బ్యాచింగ్ చేస్తారు. వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, అక్షర కేంద్రాలకు బోధనాభ్యసన సామాగ్రి సరఫరా, అక్షర కేంద్రాలను పర్యవేక్షించడం, మూల్యాంకన చేయడం వంటి పనుల ద్వారా గ్రామ పంచాయితీ పరిధిలో అక్షరాస్యతా వ్యాప్తిలో లోక్ శిక్షా కేంద్రం కృషి చేస్తుంది. లోక్ శిక్షా కేంద్రంలో గ్రంథాలయం, పఠన మందిరాలను నిర్వహిస్తారు. గ్రామ ప్రజలలో పఠనాసక్తిని పెంపొందింపజేసి "అభ్యసన సమాజ స్థాపన" దిశలో లోక్ శిక్షా కేంద్రం కృషి సల్పుతుంది.

మన రాష్ట్రంలో సాక్షర భారత్ బోధన అభ్యాసన కార్యక్రమాన్ని 2010 సెప్టెంబర్ 8 తేదీ నుండి ప్రారంభిస్తున్నారు. కార్యక్రమ నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామాలలో, మండల, జిల్లా స్థాయిలలో సభలు, సమావేశాలు నిర్వహించి అక్షరాస్యత పట్ల ప్రజాభిప్రాయ సమీకరణకు కృషి చేయాలి. దేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పునరంకితం కావాలి.

**- డా. సి. కృష్ణ మోహన్ రావు**
జాయింట్ డైరెక్టర్&సెంటర్ హెడ్ (ఆర్&డి),ఎం.యం.ఆర్. అపార్డ్

# కుజగ్రహంపై జీవరాశి ఉందా?

**సౌర కుటుంబంలో సూర్యుని చుట్టూ పరిభ్రమించే గ్రహాలలో కుజుడు ఒకటి. కుజుడు భూమికి దగ్గరగా ఉన్న గ్రహం, గ్రహం లేదా ప్లానెట్ అన్న పదం గ్రీకులో ఉన్న 'ప్లానెటస్' నుండి వచ్చింది. ప్లానెటస్ అనగా పరిభ్రమించేవి అని అర్థం. కుజ గ్రహాన్ని అంగారక గ్రహం లేదా అరుణ గ్రహం అని కూడా అంటారు. రోమన్ సంస్కృతిలో యుద్ధ దేవత మార్స్ పేరు దీనికి పెట్టారు. కుజ గ్రహం సరాసరి కక్ష్యా మార్గం భూమికి 78 మిలియన్ కిలో మీటర్ల దూరంలోను, అతిదగ్గరగా 58 మిలియన్ కిలోమీటర్ల దూరంలోను ఉంది.**

కుజగ్రహం గురించి భూమి నుండి చేసిన పరిశోధనల వల్ల, అంతరిక్ష పరిశోధనల వల్ల, కుజగ్రహ ఉల్కల వల్లను చాలా విషయాలు తెలిశాయి.



కుజగ్రహం రాళ్ళతో కూడిన భూమి మాదిరి గ్రహం. కుజ గ్రహ వ్యాసార్థం భూమి వ్యాసార్థంలో సగం. కుజ గ్రహ ద్రవ్య రాశి భూమి ద్రవ్య రాశిలో 10వ వంతు. గురుత్వాకర్షణ శక్తి భూమి యొక్క ఆకర్షణ శక్తిలో 40 శాతం. కుజగ్రహ ఉపరితలం ఎడారి మాదిరి ఉంటూ అనేక రకాల లక్షణాలను కలిగి ఉంది. కుజగ్రహ వాతావరణం చాలా పల్చగా భూమి వాతావరణానికి భిన్నంగా ఉంటుంది. కుజగ్రహ వాతావరణంలో 95 శాతం కార్బన్ డయాక్సైడ్, 27 శాతం నత్రజని ఉంది.

కుజగ్రహం మీద వున్న పల్చని వాతావరణం వల్ల సగటు ఉష్ణోగ్రత- $60^0$ సెంటిగ్రేడ్‌ల వరకు ఉంటుంది. గ్రహ మధ్యరేఖ వద్ద వేసవి కాలంలో ఉష్ణోగ్రత - $30^0$సె. వుండగా, ధృవ ప్రాంతాల వద్ద చలికాలంలో ఉష్ణోగ్రత- $130^0$ వరకు పడిపోతుంది. కుజగ్రహం భూమి మాదిరిగా కాక విపరీత లక్షణాలను చూపిస్తూ ఉంటుంది. ఉదాహరణకు సౌర మండలంలోని అతిపెద్ద అగ్నిపర్వతం కుజగ్రహం మీద ఉంది. దీని పేరు ఓలంపస్ మాన్స్. ఇది మౌంట్ ఎవరెస్ట్ కంటే 3 రెట్లు పెద్దది. దీని ఎత్తు 24 కిలో మీటర్లు. దీని వ్యాసం 500 కిలోమీటర్లు. భూమి మీద షీల్డ్ ప్లేట్ కదలిక వల్ల మాగ్మ ఒక్క చోటే ఏర్పడకుండా ఉంటుంది.

కాని కుజ గ్రహం మీద ప్లేట్ మోషన్స్ లేకపోవడం వల్ల మాగ్మ ఒకే చోట సంభవిస్తూ అగ్నిపర్వతం ఎత్తు పెరుగుతూ ఉంటుంది. 1960 నుండి సుమారు 30 అంతరిక్ష నౌకలు కుజగ్రహ పరిశోధనల నిమిత్తం ప్రయోగించబడ్డాయి. కుజగ్రహానికి మొట్టమొదటి అంతరిక్ష నౌక మరినార్ -4, 1995లో ప్రయోగించారు.

1971-72లో మరినార్-9 తీసిన చాయా చిత్రాల ద్వారా కుజ గ్రహం మీద కాలువలు, అగ్నిపర్వతాలు, బిలాలు, కనియన్స్ ఉన్నాయని తెలిసింది. 1976 లో అనగా మరినార్ -9 తీసిన 5 సంవత్సరాల తర్వాత నాసా పంపిన రెండు వికింగ్ లాండర్స్ కుజ గ్రహ ఛాయా చిత్రాలను పంపాయి. వికింగ్ కుజ గ్రహ వాతావరణంలోని మూలకాలను, ఉపరితల మట్టిని కొలిచింది. మరినార్, వికింగ్ చిత్రాలను బట్టి కుజుడు ఒక రాళ్ళతో కూడిన గ్రహంగా కనుగొనబడింది.

ఉత్తరార్థగోళం చదునుగా తక్కువ బిలాలతో కూడి ఉంటుంది. దక్షిణార్థగోళం ప్రాచీన బిలాలతో కూడిన ఎత్తైన ప్రాంతాలతోను, లోయలతోను, కాలువలతోను నిండి ఉంటుంది. కాని ఇంకా కుజ గ్రహానికి సంబంధించిన అనేక ప్రశ్నలకి సమాధానాలు తెలియాల్సి ఉంది. వాటిలో కుజ గ్రహం మీద నదులు లాంటి స్ట్రక్చర్స్ గురించి, భూకంపాల చరిత్ర గురించి తెలియాల్సి ఉంది. 1977 లో ప్రయోగించిన పాత్ ఫైండర్ రాళ్ళతోకూడిన Chryse Planitia లో వున్న Ares Vallis ముఖ ద్వారం వద్ద దిగింది. ఇది గుండ్రటి రాళ్ళతో కూడిన అనేక చిత్రాలను తీసింది. Sojourn Rover అనబడే ఒక otic Probe రాళ్ళు, మట్టి యొక్క చిత్రాలు, రసాయనిక డాటాను సేకరించింది. ఇది సేకరించిన డాటాను బట్టి కొన్ని రాళ్ళు అవక్షేపంగా (సెడిమెంటరీ) ఉండడాన్ని బట్టి నదులు లాంటి చరిత్ర ఉండేదని తెలుస్తోంది.

Poler, మట్టిలోని క్రీమ్ రంగులోని పాచ్‌లు గట్టి ప్రదేశాలు గాని లేక ఆవిరి అయిపోగా ఉన్న ప్రదేశాలు కాని అయి ఉండవచ్చని తెలుస్తోంది. ఒక క్రమంలో లేని ల్యాండ్‌స్కేప్ లోని గులకరాళ్ళను బట్టి వరదల తర్వాత వున్న ప్రదేశంలా ఉంటూ కుజ గ్రం మీద అంతకు ముందు నీరు ఉండేదని సూచన ప్రాయంగా తెలుస్తోంది. మార్స్ గ్లోబల్ సర్వేయర్ అనే అంతరిక్ష నౌకలో ఉన్న లేజర్ అల్టీమీటర్ డాటాను బట్టి కుజ గ్రహ ఉత్తరార్థ గోళంలో సముద్రం ఉండి ఉండవచ్చని తెలుస్తోంది.

మార్స్ గ్లోబర్ సర్వేయర్ అంతరిక్ష నౌకలోని మార్స్ ఆర్బిటల్ కెమెరా

అనేక ఛాయా చిత్రాలను తీసింది. ఇది మారినర్, వికింగ్ తీసిన చిత్రాలను బట్టి నదులు లాంటి లక్షణాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి వీలయింది. భూమి మీద ఉపగ్రహం తీసిన ఛాయా చిత్రాలను బట్టి ఉపనదులు అన్నీ నదులతో కలుస్తూ వుంటే కుజగ్రహం మీద కొన్ని ఉపనదులు మాత్రమే ముఖ్యమైన దారిలో కలుస్తున్నాయి. దీనిని బట్టి ఈ శాఖలు అన్నీ నీటితో కాకుండా మంచుతో ఉండి ఉంటాయని లేక ప్రవాహం, ఉపరితలం మీద కాకుండా ఉపరితలం లోపలి పొరలలో జరిగి ఉంటుందని శాస్త్రజ్ఞుల అంచనా.



దీనిని బట్టి కుజగ్రహం మీద ఉపరితలం మీద కాని లోపలి పొరలలో కాని నీరు ఒకప్పుడు ఉండేదన్న విషయం గోచరమవుతుంది.

మార్స్ ఆర్బిటల్ కెమెరా పంపిన చిత్రాలను బట్టి కుజ గ్రహం లోపలి పొరలలో నీరు ఈ మధ్యనే ఇంకిపోయి ఉండవచ్చుని, అనగా ఒక మిలియన్ సంవత్సరాల క్రితం ఇంకి పోయి ఉండవచ్చని తెలుస్తోంది.

ప్రస్తుతం కుజ గ్రహం మీద నీరు వుండాలంటే వాతావరణం పల్చగా కాకుండా, దళసరిగాను, ఉష్ణోగ్రతలు మరింత వేడిగాను ఉండాలి. ఇంత వరకు చేసిన పరిశోధనల వలన కుజగ్రహం మీద ఉష్ణోగ్రతలు మరింత వేడిగాను, నీరు ఉంటూ జీవరాశికి కావలసిన పరిస్థితులు వుండేవని తెలుస్తోంది. ఇందుచేతనే కుజగ్రహం మీద జీవరాశి ఉనికి తెలుసుకోవడం కోసం శాస్త్రజ్ఞులు ఉత్సాహపడడంలో ఆశ్చర్యం లేదు.

వికింగ్ అంతరిక్ష నౌకలోని Instrument Paylands Gas Chromotograph - Mass Sportrometer (GC-MS) కుజగ్రహం మీద ఉపరితల మట్టిలోని ఆర్గానిక్ కంపౌండ్స్ ఉనికిని తెలుసుకోవటానికి, ఒకవేళ ఉంటే ఎంత శాతం ఉన్నాయో తెలుసుకోవటానికి పనికి వస్తుంది. కాని ఇంత వరకు కుజ గ్రహం మీద దిగిన రెండు చోట్ల ఉపరితలం మట్టిలో ఎటువంటి ఆర్గానిక్ కంపౌండ్స్ ఉన్నట్లుగా తెలియలేదు. అయినప్పటికీనీ, జీవరాశి ఉనికిని తెలుసుకోవటం కోసం చేపట్టే పరిశోధనలలో కుజ గ్రహం ముఖ్యమైనది అయి ఉంది. కుజగ్రహ ఉపరితలం మీద కాని లోపల పొరలలో కాని Extremophils Mico-Organisms ఉండి ఉండవచ్చని గుర్తించడంతో, కుజగ్రహం గురించి మరిన్ని పరిశోధనలు చేపట్టారు.



వికింగ్ తర్వాత పాత్ ఫైండ్ మరియు గ్లోబల్ సర్వేయర్ అనే రెండు మిషన్స్‌ను చేపట్టడం జరిగింది. ఈ రెండు మిషన్స్ కుజ గ్రహంలోని నమూనాలను భూమికి తీసుకు రావడం కోసం జరిగినవే. యురోపియన్ స్పేస్ ఏజెన్సీ మొట్టమొదటి మార్స్ మిషన్ మార్స్ ఎక్స్‌ప్రెస్. దీనిలో మార్స్ ఎక్స్‌ప్రెస్ ఆర్బిటర్, బీగిల్ –2, ల్యాండర్ ఉన్నాయి. బీగిల్ – 2 ముఖ్య ఉద్దేశ్యం కుజగ్రహ ఉపరితలంను లోపలి పొరలను, వాతావరణాన్ని పరీక్షించి కుజగ్రహం మీద జీవరాశి రసాయనిక గుర్తులను తెలుసుకోవడం. అయితే దురదృష్టవశాత్తూ బీగిల్ –2 బిలం అంచుల మీద దిగడంతో పాడయినట్లుగా భావిస్తున్నారు.

కుజగ్రహం మీద అంటార్కిటికాలోని Dry Valles లో వున్న Crypto Endo Lithic Bacteria లేక Holyphilic or Sulphur living Micro Organisms లాంటివి కూడా ఉండి ఉండవచ్చని భావిస్తున్నారు. French Space Agency Net Landers qT, Italian Space Agency Communicator Orbitor అనే అంతరిక్ష నౌకలను NASA Mobile Scientific Laboratory ను ప్రయోగిస్తున్నారు. NASA వారు చంద్రుడు మీద పంపిన Appolo Mission తర్వాత మనుషులతో కూడిన అంతరిక్ష నౌకని కుజుడు మీదకు 2020 సంవత్సరానికి పంపాలని ఆలోచిస్తోంది.

వ్యోమగాములు కుజగ్రహం మీద సుమారు 500 రోజులు గడపడానికి వారు ఎదుర్కోబోయే అవాంతరాలు, వాటిని అధిగమించడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

European Space Agency yês¡T Exo Mars అంతరిక్ష నౌకని ప్రయోగిస్తున్నారు. దీనిలోని సోఫిష్టికేటెడ్ డిజిటల్ కెమెరాలు కుజ గ్రహం మీద జీవరాశి ఉనికిని తెలుసుకోవడంలో ఎంతో సహాయపడతాయి.

ఈ కుజగ్రహం మీద జీవరాశి ఉనికిని తెలుసుకోవాలంటే భవిష్యత్తులో ప్రయోగించబోయే స్పేస్ మిషన్స్ ఫలితాల కోసం ఎదురు చూడాల్సిందే.

*– యశస్వీ సతీష్*



# తిరుమల వేంకటేశుడి బ్రహ్మోత్సవాలు

వినా వేంకటేశం ననాథో ననాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి
హరే వేంకటేశ ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ

అని యావద్భారతదేశ భక్తులందరూ వేడుకొనే దైవం, కలియుగ వైకుంఠంగా ప్రఖ్యాతి పొందిన తిరుమలలో వెలసిన దైవం శ్రీ వేంకటేశ్వరుడు.

కొండలలో నెలకొన్న కోనేటి రాయడిని దర్శించే భక్తులకు నిత్యమూ కళ్యాణమే. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని అనుసరిస్తూ వేంకటేశ్వరావిర్భావాన్ని పురస్కరించుకొని తొమ్మిది రోజులపాటు జరిపే ఈ బ్రహ్మోత్సవాల్ని తిలకించడానికి అశేష భజన సందోహభం తండోపతండాలుగా తరలివస్తుంది.

## వేంకటేశ్వరుడు

వేంకట శబ్దానికి పాపాలను దహించేదని, దానికి ఈశ్వరుడు కాబట్టి వేంకటేశ్వరుడని అర్థం. 'వేం' అంటే అమృతశక్తి బీజమనీ, 'కట' అంటే ఐశ్వర్యమనీ అర్థాలున్నాయి. మోక్షాన్ని, ఆనందాన్ని కలిపి అందించే దివ్య క్షేత్రమే వేంకటాచలం అందుకే...

వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశసమో దేవోన భూతో నభవిష్యతి

అని అంటారు. వేంకటాద్రితో సమానమయిన స్థానం ఈ బ్రహ్మాండంలో లేదని, వేంకటేశ్వరునితో సమానమైన దైవం నభూతో నభవిష్యతి అని దీని అర్థం.

శ్రీ వేంకటాచటం పరమ పాపన క్షేత్రంగా ప్రసిద్ధి వహించింది. ఇచట స్వామి పుష్కరిణితో పాటు గోగర్భం, ఆకాశ గంగ, పాపవినాశం, కుమారధార, తుంబురతీర్థం వంటి పవిత్ర తీర్థాలున్నాయి. కలియుగం ప్రారంభం కాక మునుపే పరమాత్ముడు జీవకోటిని ఉద్ధరించడానికై కొండమీద నెలకొన్నట్లు పురాణాలు ఘోషిస్తున్నాయి.

పూర్వం కశ్యపాది మహర్షులు యాగం చేస్తుంటే... యాగఫలితం స్వీకరించే యజ్ఞభోక్త ఎవరనే సందేహం వారికి కలిగింది. దేవతలందరిలో ఈ అర్హత కలవారెవరో తెలుసుకోవాలని భృగుమహర్షి బ్రహ్మలోకనికి, కైలాసానికి వెళ్ళాడు. బ్రహ్మ, శివుడు అతడి రాకను పట్టించుకోకుండా ఉండడంతో వారిని అనర్హులని ప్రకటించాడు. తరువాత వైకుంఠానికి వెళ్ళాడు. లక్ష్మీదేవితో వినోదిస్తున్న శ్రీహరి కూడా తనను పట్టించుకోకపోవడంతో ఆగ్రహించి విష్ణు వక్షఃస్థలంలో కాలితో తన్నాడు. అంతట నారాయణుడు దిగ్గువ లేచి మహర్షిని శాంతింపజేయడానికి పాదసేవ చేస్తాడు. దానితో భృగుమహర్షి శాంతిస్తాడు. శ్రీ మహావిష్ణువే మహానుభావుడని భావిస్తాడు. అయితే శ్రీహరి వక్షఃస్థలమే నివాసంగా కల లక్ష్మీదేవి దీనిని తట్టుకోలేకపోయింది. ఆగ్రహించి కొల్హాపురానికి వెళ్ళిపోయింది. ఆ వెనుకే వైకుంఠాన్ని విడిచి విష్ణువు శ్రీనివాసుడిగా వేంకటాద్రికి వస్తాడు. ఆ తరువాత పద్మావతీ శ్రీనివాసుల వివాహం, శ్రీనివాసుడు శిలగా మారడం, మహావిష్ణువు వేంకటాద్రిపై వెలిసేందుకు బీజం వేశాయి.

## బ్రహ్మోత్సవాల ప్రాచీనత

బ్రహ్మ వేంకటేశ్వరుణ్ణి ఆరాధించి ఉత్సవాలు నిర్వహించడం వల్ల బ్రహ్మోత్సవాలు ఏర్పడ్డాయని సంప్రదాయం చెబుతోంది. బ్రహ్మాది దేవతల అభీష్టం అనుసరించి కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరుడు వేంకటాద్రిలో వెలసిన కన్యామాసం (ఆశ్వీయుజ)లో శ్రవణా నక్షత్రం రోజుతో ముగిసే విధంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం పద్ధతి.

## బ్రహ్మోత్సవాలు - రకాలు

బ్రహోత్సవాలలో చాలా రకాలు ఉన్నాయి. వీటిని ఆయా సందర్భాల ను బట్టి నిత్య బ్రహ్మోత్సవం, శాంతి బ్రహ్మోత్సవం, శ్రద్ధా బ్రహ్మోత్సవం అని రకరకాలుగా పిలుస్తారు. ప్రతి సంవత్సరం ఆశ్వీయుజ మాసంలో జరిగే ఉత్సవాలను నిత్య బ్రహ్మోత్సవాలు అని పిలుస్తారు. ఈ బ్రహ్మోత్సవాలు మొత్తం తొమ్మిది రోజులు జరుగుతాయి. ఇవి తొలి రోజు అంకురార్పణతో ప్రారంభమవుతాయి. అంకురార్పణ జరిగాక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించడానికి విష్ణుమూర్తి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనుడు విచ్చేస్తాడు. ఈ అంకురార్పణను బ్రహ్మోత్సవాల ముందు ఒకటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిది రోజులలో నిర్వహిస్తారు.

మొదటి రోజు ధ్వజారోహణం, ఆలయస్తంభంపై పతాకావిష్కరణ చేస్తారు. స్వామి వాహనమైన గరుడి చిత్రాన్ని పతాకంపై ముద్రిస్తారు. ఈ గరుడధ్వజమే బ్రహ్మోత్సవాలకు సకల దేవతలని ఆహ్వానించే స్వాగతపత్రం. ఆ స్వాగతాన్ని అందుకొని అష్ఠదిక్పాలకులు, భూత, ప్రేత, యక్ష, రాక్షస, గంధర్వగణాలు విచ్చేస్తాయి. వారందరికీ స్థలాల ను కేటాయించి నియమంతో బలిదానం చేస్తారు.

## స్వామివారి వాహనాలు

బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు ఉత్సవ మూర్తుల్ని పెద్ద శేషవాహనంపై ఊరేగిస్తున్నారు. రెండోరోజు ఉదయం చిన్న శేషవాహనం, సాయంత్రం హంసవాహనం, మూడోరోజు ఉదయం సింహ వాహనం, సాయంత్రం ముత్యాల పందిరి వాహనం, నాలుగోరోజు ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం సర్వభూపాల వాహనాలపై తిరుమల వీధులలో ఊరేగిస్తారు. అయిదోరోజు హనుమద్వాహనసేవ, రాత్రి గరుడ వాహన సేవ జరుగుతాయి.

ప్రజలకు భాగస్వామ్యం గల ఈ వాహన సేవలు ఎంతో విశేషమైనవి. ప్రజల తరుపున ప్రతినిధిగా ముఖ్యమంత్రి స్వామివారికి నూతన వస్త్రాల ను సమర్పిస్తారు. ఆరో రోజు గజవాహనం, ఏడో రోజు ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై స్వామిని ఊరేగిస్తారు.

స్వామి వారి కృప సూర్యచంద్రుల రూపంలో లోకంపై ప్రసరిస్తుందని ప్రజల నమ్మకం.

## రథోత్సవం

**'రథస్థం కేశం దృష్ట్వా పునర్జన్మన విద్యతే'**

రథారూఢుడైన కేశవుని చూస్తే పునర్జన్మ ఉండదని పురాణాలు పేర్కొంటున్నాయి. అటువంటి రథోత్సవం ఎనిమిదో రోజున జరుగుతుంది. ఈ ఉత్సవానికి హాజరయ్యే భక్తుల సంఖ్య అమితంగా ఉంటుంది. సైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వాహాలకం అనే పేర్లు కల సుందరమయిన గుర్రాలతో అలకరించిన రథాన్ని అధిరోహించి మలయప్పస్వామి తిరువీధులలో ఊరేగి భక్తులను పరవశింపచేస్తారు. ఎనిమిదో రోజున రాత్రి అశ్వవాహనంపై కనువిందు చేస్తారు.

## చక్రస్నానం

బ్రహ్మోత్సవాలలో చివరి రోజు (తొమ్మిదో రోజు) సుదర్శన రూపంలో ఉన్న స్వామి వారికి పుష్కరిణిలో స్నానం చేయిస్తారు. ఇదే చక్రస్నాన ఉత్సవం. ఈ సమయంలో పుష్కరిణిలో స్నానం చేస్తే సర్వపాపాలు నశిస్తాయని విశ్వాసం. చక్రస్నానం ముగిసిన పిమ్మట ధ్వజస్తంభంపై ఆరోహన చేసిన గరుడ ధ్వజాన్ని అవరోహణచేసి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతారు. దీనితో బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన సకల దేవతల నూ సాగనంపినట్లవుతుంది...




## పరమార్థం

పరబ్రహ్మను ఆరాధించి, సాధన ద్వారా సిద్ధిని పొందడానికి భారతీయ సంప్రదాయంలో ఎన్నో మార్గాలున్నాయి. మానవుని ఆలోచన దుర్మార్గం పట్టకుండా సాధ్యమయినంతవరకూ సాత్వికంగా ఉంచేందుకు ఏర్పరచిన ఆస్తిక విధులు అటు సంస్కృతీ సంప్రదాయాలను నిలబెట్టేందుకూ ఇటు భక్తుల చిత్తశాంతి కలిగిస్తూ లోకకళ్యాణాన్ని ప్రసాదిస్తున్నాయి. నిశ్చలమైన భక్తితో ఆరాధిస్తూ తన్మయులయ్యే విధంగా అందరినీ అలరించే శ్రీ వేంకటేశ్వరుని దివ్యశక్తి బ్రహోత్సవాల మహిమ ప్రజలను సమ్మోహన పరుస్తుంది. మానసిక శాంతిని చేకూర్చి, తద్వారా విశ్వశాంతికి దోహదం చేస్తుంది.

*- డా. అద్దంకి శ్రీనివాస్*

'విఘ్నాలకి అధిపతి అయిన వినాయకుణ్ణి ధ్యానించని పక్షంలో సర్వవిఘ్నాలు కలగుతా'యంటూ ఎప్పుడూ చెప్పుకునే విషయమే కాబట్టి మరో కొత్తదనంతో వినాయకుణ్ణి ఆరాధించడం, ఆంజనేయుణ్ణి ఆరాధించడం ఒక్కటేననే విషయాన్ని గమనిద్దాం!

# కలా విఘ్నేశ మారుతీ



## వినాయక భేదాల్ని తెలుసుకుందాం!

### వినాయకుడు

1. మనుష్య జాతి శరీరమున్నా ముఖం మాత్రం ఏనుగు జాతిది.
2. ముఖం చూడగానే కన్పించేది ముందు వైపుకి వాలిన తుండమే.
3. ముందుగా కన్పించే ముఖానికి పైభాగంలో ప్రారంభమై - ముఖానికి మధ్యలో ఉండి - కిందికి వాలి ఉంటుంది తుండం.
4. తుండం ఎంత బలంగా ఉన్నా సూది గుచ్చితే చాలు దిగిపోయేంత మృదువుగా అల్పంగా ఉంటుంది.
5. చెప్పలేనంత నిదానం ఈయనిది.
6. భూలోకంలో ఈయన తాను స్నానమంటూ చేయని ఘట్టమే లేదు.
7. లంకా ప్రభువైన రావణుని పూజల్ని స్వీకరించాడు.
8. చెట్ల ఆకులతో చేసే 'పత్రపూజ' తనకి బాగా ఇష్టమంటాడు.

### ఆంజనేయుడు

1. మనుష్య జాతి శరీరమున్నా ముఖం మాత్రం వానర జాతిది.
2. ముఖం చూడగానే కన్పించేది వెనుక వైపున తోక.
3. వెనుకవైపుగా కన్పించే వీపు భాగానికి కింది భాగంలో ప్రారంభమై - వీపుకి మధ్యగా పైకి ఎత్తబడి కన్పిస్తుంది తోక.
4. తోక ఎంతోమంది రాక్షసుల్ని చుట్టి విసిరివేయగలిగేంత బలిష్ఠమైనదైనా, నిప్పుని అలా ముట్టిస్తే చాలు అల్పంగానూ ఉంటుంది.
5. ఊహించలేనంత శీఘ్రగమనం ఈయనది.
6. ఆకాశంలో ఈయన తిరగని ప్రదేశమంటూ లేదు.
7. లంకా ప్రభువైన రావణునితో విరోధాన్ని ఎంచుకున్నాడు.
8. ఆకులే ఓ చెట్టుగా ఉండే తమలపాకు పూజ ఈయనకి ప్రియం.

9. పత్రి పూజతో పాటు గరిక (దూర్వా) పూజ కూడా ఈయనకిష్టమే.

10. ఈయన బ్రహ్మచారి.

11. దేవాంతక నరాంతక సింధు సిందూరాది రాక్షసుల్ని వధించాడు.

12. సింహం-నెమలి-అశ్వం మొదలైన వాటిని వాహనంగా చేసుకుని మూషిక వాహనునిగా ప్రసిద్ధుడయ్యాడు.

13. పుట్టుకతోనే ఏనుగు ముఖం రాలేదు. శివుడు తలని నరికాక వచ్చింది.

14. దక్షిణాయనం వర్షర్తువు భాద్రపదమాసం శుద్ధపక్షం చతుర్థి తిథి హస్తా నక్షత్రంలో పుట్టాడు.

15. ఎప్పుడూ కూర్చునే కన్పిస్తాడు.

16. తల్లిదండ్రులే తనకి పూజనీయులు.

17. ఎప్పుడో ఓమారు నృత్యాన్ని చేస్తూ కన్పిస్తాడు.

18. తన పుత్రుడైన వినాయకుణ్ణి చూసి నవ్విన చంద్రునికి దారుణ శాపం ఇచ్చింది పార్వతి. ఆ కారణంగా ఈయన అమ్మకి (పార్వతికి) ముద్దుల కొడుకు. అందుకే ఈయన్ని సంగీత శాస్త్రం అంబాసుత (అమ్మకొడుకు) అంది.

19. బుద్ధికి అధిష్ఠాత అయిన కారణంగా ఎవరు ఏ విద్యని (వేదం - సంగీతం - శాస్త్రం - కళలు....) ప్రారంభించబోయినా శ్రీ మహాగణాధి పతయే నమః - గణానాం త్వా... అంటూ ఈయన్ని స్తుతించే మొదలుపెడతారు.

20. శివుడు ఈయనకి సొంతం.

21. ఎఱ్ఱని కుంకుమ రంగు శరీరచ్ఛాయలో ఉంటాడు.

22. అతల - వితల - సుతల - తలాతల - రసాతల - మహాతల - పాతాలమనే ఏడు లోకాలకీ పైనున్న భూమికి అధిపతి ఈయన.

23. భూమి పుత్రుడైన కారణంగా (నలుగు మట్టితో చేయబడి) ఈయన పృధ్వీపుత్రుడు.

24. రుద్ర వీర్య సంభవుడు.

25. మనుష్య గజరూపాల సమ్మేళనం ఈయన.

26. దంతం విరువబడడం ఈయనకి జరిగిన అవమానం.

27. ఆలయంలో ధ్వజస్తంభం కింద ఉండే మూర్తి ఈయనది.

9. తమలపాకు పూజతో పాటు సింధూర పూజ కూడ ఈయనకిష్టమే.

10. ఈయన కూడా బ్రహ్మచారే.

11. ఎందరెందరో రాక్షసుల్ని, విశేషించి రావణపుత్రుడైన అక్షుణ్ణి వధించాడు.

12. తనకి ఏ వాహనమూ లేదు. సరికదా తానే రామచంద్రునికి వాహనంగా అయి రాముణ్ణి భుజం మీద మోస్తూ యుద్ధాన్ని చేసాడు.

13. పుట్టుకతోనే వానరముఖం రాలేదు. ఇంద్రుడు వజ్రాయుధంతో విసిరి కొట్టాక వచ్చింది.

14. శ్రావణమాసం కృష్ణపక్షం అక్షమ తిథి రోహిణి నక్షత్రంలో పుట్టాడు.

15. ఎప్పుడూ నిలబడే దర్శనమిస్తాడు.

16. తనకి రామచంద్రుడే ఆరాధ్యుడు.

17. ఎప్పుడో ఓ మారు మాత్రం కూచుని ధ్యానిస్తూ కన్పిస్తాడు.

18. తన పుత్రుడైన ఆంజనేయుణ్ణి వజ్రాయుధంతో ఇంద్రుడు కొట్టిన సందర్భంగా కోపించాడు వాయువు. లోకంలో వాయు సంచారం లేకుండా చేసాడు కూడ. అందుకని ఈయన నాన్నకి ముద్దుల పుత్రుడు. అందుకే ఈయన్ని సుందరకాండ మారుతి (మరుత్తు - వాయుదేవుని కొడుకు) అంటారు.

19. ఈయన ఆలోచనలకి అధిష్ఠాతగా గుర్తింపబడ్డాడు కాబట్టే రామచంద్రుడంతటి వాడు ఈయన్నే దూతగా నిర్ణయించుకోవడం కాక, విభీషణునికి శరణునీయవచ్చా?. . . వంటి సమస్యా సందర్భాల్లో ఈయన ఏ నిర్ణయాన్ని చేస్తే అదే తన నిర్ణయం కూడ అని ప్రకటించాడు.

20. కేశవుడే ఈయనకి సర్వస్వం.

21. ఎఱుపుకి దగ్గరైన సిందూరపు రంగులో కన్పిస్తాడు.

22. భూలోక - భువర్లోక - సువర్లోక్ - మహాలొక - జనాలోక - తపోలోక సత్యలోకాలనే ఏడిటికీ కిందనున్న భూలోకానికి అధినేత ఈయన కూడా.

23. వాయు అంశతో జన్మించిన కారణంగా ఈయన వాయుసుతుడు.

24. రుద్రవీర్య సంభవుడు.

25. మనుష్య వానర రూపాల సమన్వయం ఈయన.

26. ఈయన తోకకి నిప్పుని అంటించడం ఈయనకి జరిగిన అగౌరవం.

27. ఆలయంలో శివదృష్టిని భరిస్తూ ధ్వజస్తంభం కింద ఉండే మూర్తి ఈయనది కూడా.

దీని ద్వారా ఈ ఇద్దరూ ఒకరేనని అర్థమైంది కాబట్టి వినాయకుణ్ణి మాని ఆంజనేయుణ్ణి సేవిస్తే చాలనేది అర్థం కాదు. దైవాలందరూ ఒకరేననే అభిప్రాయంతో ఉండాలనే భావాన్ని కలిగి ఉండాలని చెప్పడం దీని తాత్పర్యం. విశేషించి ఆంజనేయుడూ, వినాయకుడూ ఒకరేననే అభిప్రాయాన్ని శివ కేశవ ఆలయాల్లో ఉన్న ధ్వజస్తంభం క్రింద ఉండే మూర్తి తెలియజేస్తుందని గమనించాలనేది కూడా దీని అభిప్రాయం.

### వినాయక స్వరూపాలు ఎన్ని?

*నిజానికి వినాయకులు ముప్పై ఇద్దరు. ద్వాత్రింశత్ (2 + 30) గణపతులనే మాటకి అర్థం ఇదే. ఒక పట్టిక ద్వారా చూడదలిస్తే. . .*

గణపతి

1) శ్రీ - వీర - శక్తి (3)

శ్రీ: భక్త, బాల, తరుణ; వీర: ఉచ్ఛిష్ట, ఉన్మత్త; శక్తి: విద్యా, దుర్గ, విజయ (8)

2) వృత్త - విఘ్న - లక్ష్మీ - నృత్త -నృత్య - మహా - బీజ - ఢుంఢి (8)

3) పింగళ - హరిద్రా - ప్రసన్న - వాతాపి - హేరంబ (5)

పింగళ: త్ర్యక్షర, త్రిముఖ, ఏకాక్షర



4) వక్రతుండ - వరసిద్ధి - చింతామణి - సంకష్టహర - త్రైలోక్యమోహన (5)

అవాంతర భేద గణపతులు 11 + 21 . . . . . . . . . . . . . . . . . . . 32

వీరిలో ప్రధానులు 16 మంది

వీరినే షోడశ గణపతులంటారు.

సికింద్రాబాదు రైల్వేస్టేషను పక్కనున్న వినాయక దేవాలయంలో ఈ 16 మంది గణపతులూ ఒక గోడ మీద చెక్కబడి కన్పిస్తారు. వీరి వివరాలని కూడా తెలుసుకోవడం మనకి అవసరం.

## షోడశ గణపతులు

| వినాయకుని పేరు | చేతులు | శరీరచ్ఛాయ | ఈయన్నికొలిస్తే కలిగే ప్రయోజనం |
|---|---|---|---|
| 1. బాలగణపతి | 4 | ఉదయ సూర్యుని ఛాయ | ప్రతి విషయాన్నీ లోదృష్టితో గమనించే శక్తి |
| 2. క్షిప్ర - భువనేశ (విజయ) గణపతి | 4 | మధ్యాహ్న సూర్యుని ఛాయ | ఎదురుచూపు అవసరం ఉండదు. శాశ్వత జయం |
| 3. తరుణ | 8 | మధ్యాహ్న సూర్యుని ఛాయ | కార్యసాధనలో పట్టుదల |
| 4. మహావిఘ్న | 10 | మధ్యాహ్న సూర్యుని ఛాయ | ఏలినాటి శనిదోషం ఉండదు. |

| | | | | |
|---|---|---|---|---|
| 5. | వీర | 16 | మధ్యాహ్న సూర్యుని ఛాయ | ధైర్యం |
| 6. | శక్తి | 4 | సాయం సూర్యుని ఛాయ | ఆత్మ స్థైర్యం |
| 7. | పింగల (సిద్ధి) వృత్త | 4 | బంగారు ఛాయ | పరాజయం లేకపోవడం, సంతృప్తి, మనశ్శాంతి |
| 8. | ఊర్ధ్వ | 8 | బంగారు ఛాయ | తెలిసి చేసిన పాపాల నుండి విముక్తి |
| 9. | ఉచ్ఛిష్ట | 4 | నలుపు | కోరికలు నెరవేరుతాయి. నిష్ఠ సరిగాలేని పక్షంలో నాశనం అవుతారు. |
| 10. | భక్త-ద్విజ (ధ్వజ) | 4 | చంద్రునిలా తెలుపు | భక్తి భావం |
| 11. | విఘ్న | 4 | గౌరం | విఘ్న నాశనం |
| 12 | హేరంబ | 10 | ముదురు గౌరం | వాహన ప్రమాదాలుండవు |
| 13. | లక్ష్మీ | 10 | గౌరం | ధనవంతులు (శీఘ్రంగా) |

క్రమసంఖ్యలో '13' మంది గణపతులుగా కన్పించినా ఒక్కొక్క చోట ఇద్దరిద్దరు గణపతులు ఉన్న కారణంగా మొత్తం 16 మంది గణపతులుగా భావించుకోవాలి.

ఇందరిని స్తుతించడం సాధ్యమా?

మంచిదే! ముప్పై ఇద్దరు వినాయకులుంటే వాళ్లలో కూడా 16 మంది ప్రధానులైతే వాళ్లు కూడ అందరూ తలొక్క విధానంలో ఉంటూ చిత్రవిచిత్రమైన రంగు శరీరచ్ఛాయ కలవాళ్లై తలొక్క ప్రయోజనాన్నీ అందిస్తూ ఉంటే, లోకంలో ఇన్ని ప్రయోజనాలూ సాధించాలనే



ఆలోచనే ఎవరికైనా ఉంటుంది తప్ప, ఏ ఒక్క ప్రయోజనమో సాధించి ఊరుకుందామనే ఊహ ఏ ఒక్కరికీ ఉండనే ఉండదు కదా!

అందుకే అతి ప్రధానులైన ఈ 16 మందినీ స్తుతించుకునేందుకు వీలుగా మహర్షులు ఒక శ్లోకాన్ని మనకి అందించారు. ఎక్కడికి మనం బయల్దేరినా ఈ 16 మందినీ ఒక్కమారు స్మరించుకున్నట్లైతే తనని స్మరించాడనే ఆనందంతో ఆ విభాగానికి చెందిన ఆ వినాయకుడు ఆ ప్రయోజనాన్ని సాధించి పెడతాడు. ఆ శ్లోకం ఇదుగో!

*ప్రథమం బాల విఘ్నేశం ద్వితీయం తరుణం భవేత*
*తృతీయం భక్త విఘ్నేశం చతుర్థం వీర విఘ్నకమ్*
*పంచమం శక్తి విఘ్నేశంషష్ఠం ద్విజ గణాధిపమ్*
*సప్తమం పింగలం దేవ మష్టమోచ్ఛిష్టనాయకమ్*
*నవమం విఘ్నరాజంచ దశమం క్షిప్రదాయకమ్*
*ఏకాదశం తు హేరంబం ద్వాదశం లక్ష్మినాయకమ్*
*త్రయోదశం మహావిఘ్నం భువనేశం చతుర్దశమ్*
*నృత్తాఖ్యం పంచదశకం షోడశోర్ధ్వ గణాధిపమ్ ॥*

ఏ వినాయక ప్రార్థన చేసినా అది ఫలించడానికంటూ చేయవలసిన ప్రార్థన శ్లోకాలు రెండే రెండట. అవి మనకి తెలిసినవే. శుక్లాంబరధరమ్మనేది ఒకటే - అగజానన పద్మార్కమనేది రెండవదీను.

మహర్షులైన వాళ్లు మనకి విఘ్నాలు రాకుండా ఉండేందుకూ - వచ్చిన విఘ్నాలని తొలగించుకునేందుకూ కూడ ఒట్టిగా స్తోత్రరూపంగా శ్లోకాలని చదువుకుంటే చాలని చెప్పారంటే ఎంతెంత గొప్పవాళ్లు - నిస్స్వార్థపరులు ఆ మహర్షులు!

అలాంటి వాళ్ల మీద విశ్వాసాన్నుంచుకుని నమస్కరిస్తూ ఉంటే బుద్ధికి మంచి ఆలోచనలనిస్తారు - కష్టాలని గట్టెక్కించే తెలివితేటలని అనుగ్రహిస్తారు. అయితే వాళ్లని ఆరాధించని సందర్భంలో మంచిని చేయలేదు గాని, ఏనాడూ చెడుని మాత్రం చేయని ఉత్తమత్వం ఋషులది! విఘ్న నివారణమస్తు - అవిఘ్నమస్తు.

*- డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు*

**"మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ" పథకం ద్వారా వివిధ రకాల పనులను చేపట్టటం జరుగుతోంది. గ్రామాభ్యుదయం, ఉపాధి హామీ లక్ష్యంతో జరుగుతున్న పనులలో మరి కొన్ని పనులు చేపట్టడం జరిగింది.**



# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పైలట్ ప్రాజెక్ట్‌గా సంపూర్ణ పారిశుద్ధ్య పనులు

*పైలట్ ప్రాజెక్ట్ :* గ్రామాలలో పారిశుద్ధ్యం చేసుకోవటానికి నిధుల కొరత, పనివార్లకు వేతనాలు ఇచ్చుకోలేని పరిస్థితులలో గ్రామాలు ఉన్నాయి. ఈ పరిస్థితులలో పైలట్ ప్రాజెక్ట్‌గా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో సంపూర్ణ పారిశుద్ధ్య పనులు చేపట్టి అక్టోబర్ 2, 2009 నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో ద్వారకా తిరుమల మండలం, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు గణపవరం మండలాలల్లో, వరంగల్ జిల్లా ఏటూరు మండలం, రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ళ మండలం, అనంతపురం జిల్లాలో వీధిపానకాల మండలాలలో ఈ ప్రాజెక్ట్ ప్రారంభించారు.

గ్రామాలలో పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు.

ఈ పైలట్ ప్రాజెక్ట్ నందు ఎంపిక కాబడిన మండలంలోని గ్రామాలలో జనాభా ప్రాతిపదికన పనివారిచే ఈ కింది పని నిర్వహించబడుచున్నది.

**కేటగిరి 1 2500 లోపు జనాభా గల గ్రామాలలో నెలకు 60 మందిచే**

**కేటగిరి 2 2500 నుంచి 5000 వరకు జనాభా గల గ్రామంలో నెలకు 90**

**కేటగిరి 3 5000 పై జనాభా గల గ్రామాలలో 120 మంది**

చేపట్టబడిన పనులు: పారిశుద్ధ్యానికి సంబంధించి అన్ని పనులు, సిసి డ్రెయిన్‌లను శుభ్రపరచటం, రహదారుల పక్కన ముళ్ళకంచెలు తొలగించటం, రహదారులు శుభ్రపరచటం అవసరమైన పరిశుభ్రపనులు.





## స్పందనలు

*శ్రీమతి బోడ దేవరయ్య, అధ్యక్షురాలు, భీమడోలు మండలం:* "జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలో గ్రామాల పారిశుద్ధ్య పనులు చేపట్టడం మా మండలం చేసుకున్న అదృష్టం. మా మండలం డెల్టా, కొల్లేరు లంకలు గల గ్రామాలు. గ్రామాలలో నిధులు లేమి ఎక్కువగా ఉంది. ఈ సమయంలో గ్రామంలో పారిశుద్ధ్యపు పనులు చేపట్టడం వలన గ్రామాలకు ఆసరా ఇవ్వడమైంది. ఈ నియోజక వర్గమే కాకుండా పశ్చిమ గోదావరి జిల్లా అంతా ప్రవేశపెడితే చాలా బాగుంటుందని నా అభిప్రాయం. ప్రవేశపెట్టిన శ్రీ మంత్రివర్యులు శ్రీ వట్టి వసంతకుమార్ గార్కి నా కృతజ్ఞతలు."

*శ్రీ చాత్రాతి సత్యనారాయణ, సర్పంచ్, కురెళ్ళగూడెం :* "ఈ పథకం చాలా బాగుంది. కాని గ్రామంలో ఆవాస ప్రాంతాలు ఎక్కువ. కాలనీలలో శుభ్రత కొనసాగించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. పనివారలను పెంచి నట్లైతే, వారి ద్వారా ఇంకా పటిష్టవంతంగా ఈ పారిశుద్ధ్యం పనులు చేపట్టగలమని ఆశిస్తున్నాం. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు శ్రీవట్టి వసంత్‌కుమార్ గారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను."

*- కె. కోటేశ్వరరావు, MA, B.Ed, PGDT*
*ఎమ్.పి.డి.ఓ, భీమడోలు మండలం పశ్చిమ గోదావరి జిల్లా*

DELHI 2010
XIX COMMONWEALTH GAMES
COME OUT AND PLAY





సుమారు ఒక నెలరోజుల్లో ప్రపంచంలోని అతిపెద్ద
క్రీడా వేడుకల్లో ఒకటైన కామన్‌వెల్త్ క్రీడలు - 2010
దేశ రాజధాని న్యూఢిల్లీలో పెద్ద సంరంభానికి నాంది పలకనున్నాయి.
రాసి, వాసిలలో ఏ లెక్కన చూసినా, ఒలింపిక్స్ క్రీడలు,
ఆసియా క్రీడల తరువాత కామన్‌వెల్త్ క్రీడలు ముఖ్యమైనవని చెప్పాలి.

# భారతదేశపు అతి పెద్ద





# క్రీడా సంరంభం

**కామన్‌వెల్త్ లోగల 54 సభ్యత్వ దేశాలలోని 70 జట్లపైగా ఈ క్రీడా వేడుకల్లో పాల్గొంటున్నాయి. అక్టోబర్ 3 నుంచి 14వ తేదీ వరకు ఈ క్రీడలు జరుగుతున్నాయి.**

వివిధ రకాల పోటీలు జరిగే ఈ వైభవోపేత క్రీడల కోసం అన్నీ సిద్ధం చేయడానికి క్రీడల నిర్వహణకు నియమించిన నిర్వాహక కమిటీ, భారత ప్రభుత్వం కాలానికి ఎదురీదుతున్నాయి. ఇవి 19వ కామన్‌వెల్త్ క్రీడలు. ఇవి భారతదేశంలో జరగటం మొట్టమొదటి సారి కాగా, ఆసియాలో జరగటం రెండవసారి. 1998లో మలేసియా మొదటిసారి ఆసియా నుంచి ఈ కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చి, కౌలాలంపూర్‌లో నిర్వహించింది.

భారతదేశం రిపబ్లిక్‌గా అవతరించిన తరువాత 1951లో ఒకసారి ఆసియా క్రీడలకు ఆతిథ్యం ఇచ్చింది. తిరిగి 1982లో మరొకసారి ఆసియా క్రీడలను న్యూఢిల్లీలో నిర్వహించింది.

2003లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడా సమాఖ్య సమావేశంలోనే కామన్‌వెల్త్ క్రీడలకు తాను ఆతిథ్యం ఇస్తానని న్యూఢిల్లీ ప్రకటించింది. (నిజానికి ఒలింపిక్స్ క్రీడాలను నిర్వహించేదీ, ఆసియా క్రీడలను నిర్వహించేదీ నగరాలే కానీ, దేశాలు కాదు). కెనడాలోని అంటారియో రాష్ట్రంలోని హామిల్టన్ కూడా ఇందుకు ముందుకొచ్చింది. చివరిగా జరిగిన బిడ్డింగ్‌లో హామిల్టన్ కంటే, న్యూఢిల్లీకే ఎక్కువ ఓట్లు వచ్చి, న్యూఢిల్లీ ప్రతిపాదన నెగ్గింది.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే 1930లో మొదటిసారిగా జరిగిన ఆరంభోత్సవ బ్రిటీష్ ఎంపైర్ క్రీడలు హామిల్టన్‌లోనే జరిగాయి. క్రితంసారి (అంటే 18వ కామన్‌వెల్త్ క్రీడలు) కామన్‌వెల్త్ క్రీడలు 2006లో మెల్‌బోర్న్‌లో జరిగాయి. తదుపరి, అంటే 2014లో జరిగే క్రీడలు స్కాట్లాండ్‌లోని గ్లాస్‌గోలో జరగనున్నాయి. 2018లో జరిగే కామన్‌వెల్త్ క్రీడలు ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్‌లో కానీ, శ్రీలంకలోని హన్‌బమ్‌టోటాలో కాని జరగవచ్చు.

కామన్‌వెల్త్ క్రీడల వంటి పెద్ద వేడుకలను నిర్వహించాలంటే సుదీర్ఘమైన ప్రణాళికల తయారీ, అమలు అవసరం. పెద్ద మొత్తంలో ఆర్థిక వనరులు, మానవవనరులు, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, సాంకేతిక నైపుణ్యం అవసరం.

మనవద్ద ఈ వనరులన్నీ ఉన్నాయా? మనం వాటిని నిర్వహించగలమా? న్యూఢిల్లీ రెండుసార్లు ఆసియా క్రీడలను నిర్వహించడం, హైదరాబాద్ ఒకసారి ఆఫ్రో - ఆసియా క్రీడలను విజయవంతంగా నిర్వహిచటంతో మన సామర్థ్యం గురించిన శంకలన్నీ మటుమాయమైపోయాయి, 2008 ఒలింపిక్స్‌లో చైనా తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించినట్లుగా, ప్రపంచంలో ఒక ప్రధాన ఆర్థిక, వాణిజ్య శక్తిగా తనను స్థిరపరచుకోవడానికి ఈ క్రీడలను విజయవంతంగా నిర్వహించటం ద్వారా మన దేశానికి అవకాశం లభిస్తుంది.

ఈ కింద వివరించిన విషయాలు కామన్‌వెల్త్ నిర్వహణలోని సంక్లిష్టతను, సవాళ్లను స్పష్టం చేస్తాయి.

అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్, సైక్లింగ్, హాకీ, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, స్విమ్మింగ్ మొదలైన 17 క్రీడా విభాగాల్లో 260 ఈవెంట్లు జరగనున్నాయి. వీటిల్లో మొత్తం 8000 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొంటారని అంచనా.

భారతదేశపు సాంప్రదాయిక క్రీడ అయిన కబడ్డీని ఒక ప్రదర్శనా పూర్వక క్రీడగా వీటిల్లో ప్రదర్శించనున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలను వేదిక కానున్నది.

ఈ క్రీడల కోసం ఇప్పటికే ఉన్న వేదికలను, స్టేడియంలను పునరుద్ధరిస్తున్నారు. అవసరమైన చోట్ల వాటి సామర్థ్యాన్ని






పెంచుతున్నారు. 26 నూతన స్టేడియంలను నిర్మించారు.

కామన్‌వెల్త్ క్రీడల బిడ్డింగ్ నియమాల ప్రకారం ఆతిథ్య దేశం ఈ క్రీడల్లో పాల్గొనే ప్రతి దేశానికి ఒక లక్ష అమెరికన్ డాలర్లను ఇవ్వవలసి ఉంటుంది. క్రీడాకారులకు ఉచితి వసతి, ఉచిత భోజన సదుపాయాలను, రానూపోనూ విమాన ఛార్జీలను, ఆగ్రాలోని తాజ్ మహల్‌కు విహారయాత్ర సదుపాయాన్ని కూడా ఆతిథ్యదేశం కల్పించవలసి ఉంటుంది.



కేవలం క్రీడల నిర్వహణకే 750 కోట్ల రూపాయలను ఖర్చుచేయవలసి ఉంటుంది. ఇక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయటం, ఇతర ఖర్చులను కలుపుకుంటే, పెద్దమొత్తంలోనే వ్యయమవుతుంది.

ఒలింపిక్స్ మాదిరిగానే, కామన్‌వెల్త్ క్రీడలకు కూడా ఒక శతాబ్దపు క్రితం నాటి ఆసక్తికరమైన చరిత్ర, సంప్రదాయాలు ఉన్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా ఉన్న దేశాలను ఒక చోట చేర్చి, వాటి మధ్య సుహృద్భావాన్ని పెంపొందించడానికి క్రీడా వేడుకలను నిర్వహిస్తే బాగుంటుందని 120 సంవత్సరాల క్రితమే యోచించారు.

1911లో 5వ జార్జి చక్రవర్తి పట్టాభిషేకానికి గుర్తుగా బ్రిటిష్ ఎంపైర్ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా బ్రిటీష్ సామ్రాజ్యంలోని దేశాల మధ్య ఒక టోర్నమెంట్‌ను నిర్వహించారు. అథ్లెటిక్స్, బాక్సింగ్, సిమ్మింగ్, రెజ్లింగ్ క్రీడా పోటీల్లో యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనడా, సౌత్ ఆఫ్రికాదేశాల జట్లు పాల్గొన్నాయి. తదుపరి 1930లో ఇప్పటి కామన్‌వెల్త్ క్రీడలకు ప్రారంభ పోటీలనదగిన బ్రిటిష్ ఎంపైర్ క్రీడలు హామిల్టన్‌లో జరిగాయి.

ఈ మధ్యకాలంలో కామన్‌వెల్త్ క్రీడలు రాజకీయ బహిష్కరణలకు కూడా గురయ్యాయి. ముఖ్యంగా శ్వేత జాతీయుల ఆధిపత్య పాలనలో ఉన్న సౌత్ ఆఫ్రికా అనుసరిస్తున్న జాతి వివక్ష విధానాలకు సంబంధించి ఈ బహిష్కరణలు జరిగాయి.

దక్షిణాఫ్రికాతో క్రీడా సంబంధాలు నెరపుతన్న న్యూజిలాండ్‌కు వ్యతిరేకంగా నైజీరియా 1978 కామన్ వెల్త్ క్రీడలకు దూరంగా ఉంది. ఇదే కారణంతో 1986 నాటి కామన్‌వెల్త్ క్రీడలకు ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని పలుదేశాలు, కారిబియన్ దేశాలు దూరంగా ఉన్నాయి. అయితే, కామన్‌వెల్త్ క్రీడల వైభవాన్ని, ప్రాభావాన్ని ఈ బహిష్కరణలు దెబ్బతీయలేకపోయాయి. అందుకు ఈ క్రీడల్లో పాల్గొంటున్న దేశాలు, క్రీడాకారుల సంఖ్య నానాటికీ పెరుగుతుండటమే నిదర్శనం,

కామన్‌వెల్త్ క్రీడల్లో, ముఖ్యమైన సాంప్రదాయం క్వీన్స్ బ్యాటన్ రిలే. ఒలింపిక్స్ జ్యోతి ప్రపంచమంతా తిరిగి వేదిక వద్దకు ఎట్లా చేరుకుంటుందో, అదే విధంగా క్వీన్స్‌బ్యాటన్ లండన్ నుంచి వేదిక వద్దకు చేరుకుంటుంది. కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ఈ బ్యాటన్ ద్వారా శుభాకాంక్షలు అందజేస్తారు.

2009, అక్టోబర్ 29న ఇది బకింగ్ హామ్ ప్యాలస్ నుంచి బయలుదేరింది. అక్టోబర్ 3న న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ








స్టేడియంలో జరిగే ఆరంభోత్సవ వేడుకలకు అందుకునేలా దీని ప్రయాణాన్ని సిద్ధం చేశారు. ఇది దారిలో కామన్‌వెల్త్ దేశాలగుండా ప్రయాణం చేస్తుంది. భారతదేశపు నలుమూలలకూ వెళ్తుంది. జూన్ 25వ తేదీన ఇది ఇండియా, పాకిస్తాన్ సరిహద్దు అయినా వాఘా వద్దకు చేరుకుంది.

రెండు కిలోల బరువు, 66 సెంటీమీటర్ల ఎత్తు ఉన్న ఈ బ్యాటన్‌కు భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో సేకరించిన రంగురంగుల మట్టిని పూశారు. రెండవ ఎలిజిబెత్ రాణి సందేశాన్ని ఒక బంగారు ఆకుపై చెక్కి, దాన్ని ఒక అలంకృత భరిణిలో ఉంచారు. దీనికి కొన్ని అత్యున్నత సాంకేతిక పరిజ్ఞాన లక్షణాలు కూడా ఉన్నాయి. టెక్స్ట్ సందేశాలను అందుకోవటం, శబ్దాలకు, దృశ్యాలను రికార్డు చేయటం వంటివి ఇది చేయగలదు. దాని కదలికలను పసిగట్టడానికి జిపిఎస్ (గ్లోబల్ పొంజిషనింగ్ సిస్టమ్‌ను కూడా ఇందులో అమర్చారు.)

2010 కామన్‌వెల్త్ క్రీడలకు షేరా (పులి)ను క్రీడల చిహ్నం (మస్కట్)గా నిర్ణయించారు.

న్యూఢిల్లీలో కామన్‌వెల్త్ క్రీడల కోసం చేపట్టిన వివిధ స్టేడియమ్‌ల నిర్మాణ కార్యక్రమాలు బాగా ఊపందుకున్నాయి. అలంకరణలు జోరందుకున్నాయి. యమునా నది ఒడ్డున ఉన్న క్రీడా గ్రామాన్ని జవహర్‌లాల్ స్టేడియమ్‌తో అనుసంధానించడానికి భూగర్భంలో నాలుగులేన్ల మెట్రొరైలును సిద్ధం చేస్తున్నారు. అంతేకాక, రోడ్‌ఓవర్ బ్రిడ్జీలను, అండర్ బ్రిడ్జీలను, ఫైఓవర్లను, వేగవంతమైన రవణా సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

సంవత్సరానికి 3.7కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలను సరిపోయేలా ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లలో ఒక సరికొత్త టెర్మినల్ (టి3)ను ప్రారంభించారు. దీని రన్‌వే ఆసియాలోనే అతిపెద్దది. గంటకు 75 విమానాల రాకపోకలకు ఇది సరిపోతుంది. ఎయిర్‌పోర్టును ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా, మెట్రో ఎక్స్‌ప్రెస్ లైన్ ద్వారా నగరానికి అనుసంధానిస్తున్నారు.

పశ్చిమ దేశాలనుంచి పెద్ద సంఖ్యలో వచ్చే టూరిస్టుల కోసం టాక్సీడ్రైవర్లు, వెయిటర్లు, పోర్టర్లు, సర్వీసు సిబ్బందికి ఢిల్లీ యంత్రాంగం ఇంగ్లీషు భాషలోకాక, ఇతర కమ్యూనికేషన్ నైపుణ్యాల లోను క్లాసులు నిర్వహించి, వారిని తీర్చిదిద్దింది. క్రీడలు జరిగే రోజుల్లో విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. లక్షమందిపైగా ఇళ్లులేని నిరాశ్రయులను అక్కడినుంచి తొలగించి, వారికి పునరావాసం కల్పించింది ఢిల్లీ యంత్రాంగం. నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దింది. వెదురు తెరలను ఏర్పాటు చేసి, విదేశీ యాత్రికులకు మురికి వాడలు కనపడకుండా చేస్తున్నారు. ఇది అనైతికమనే విమర్శలు వచ్చాయి.

'సుస్థిరమైన క్రీడలు' జరపడానికి కామన్‌వెల్త్ క్రీడల నిర్వాహక కమిటీ ఐక్యరాజ్య సమితిలోని పర్యావరణ కార్యక్రమ సంస్థతో ఒక అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. నిర్మాణ కార్యక్రమాల్లో పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా తద్వారా చర్యలు తీసుకుంటారు.

నిర్వాహకులకు పూలబాటేమీ సిద్ధంగా ఉండదు. ఏర్పాట్లు సరిగా జరగటం లేదని, అవినీతి, పక్షపాతం జరుగుతున్నాయని, నియమాలు పాటించటం లేదని విమర్శలు వచ్చాయి. గత ఏడాది చివరిలో ప్రభుత్వం సిద్ధం చేసిన ఒక నివేదిక, అనేక స్టేడియంల నిర్మాణాలు షెడ్యూలుకు ఎంతో వెనుకపడి ఉన్నాయని స్పష్టం చేసింది. ఇది తెలుసుకున్న కామన్‌వెల్త్ క్రీడల సమాఖ్య అధ్యక్షులు మైక్ ఫెన్నెల్ క్రీడల నిర్వహణపై సందేహాలు వ్యక్తం చేశారు. అప్పుడు నిర్వాహక కమిటీని ప్రక్షాళన చేశారు. తరువాత అక్కడ పనిచేసే కార్మికులకు పనిపరిస్థితులు సురక్షితంగా లేవని, వేతనాల సరిగా చెల్లించటం లేదని, బిచ్చగాళ్లను తరలిస్తున్నారనే విమర్శలు వచ్చాయి.

ఏదేమైనప్పటికీ, షెడ్యూలు ప్రకారం పనులన్నీ పూర్తిచేసి, క్రీడలకు విజయవంతంగా నిర్వహించగలమని భారత ప్రభుత్వం, నిర్వాహక కమిటీ ఆశాభావంతో ఉన్నాయి. ఈ కామన్‌వెల్త్ క్రీడలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింప చేస్తాయనటంలో ఎటువంటి సందేహం లేదు. క్రీడలు వైభవోపేతంగా జరిగి, దేశానికి మంచిపేరు తేవాలని మనమూ కోరుకుందాం.

**- దాసు కేశవరావు** (అనువాదం : వై. సరోజ)



# కృష్ణ! కృష్ణ! హరే! హరే!

**రాముడనగానే భక్తిభావంతో చేతులు రెండూ ఒకటై నమస్కరిస్తాయి. అదే కృష్ణుడనే పేరుని వినగానే అదోలా నవ్వు ప్రారంభమై నమస్కరించడం దేనికనే అభిప్రాయంతో విడివడిపోతాయి చేతులు. ఎందుకని? నిజంగా కృష్ణుడు 'అదో తీరు వాడా?' లేక ఆయన గురించి మనం తెలుసుకోవలసిన రీతిలో తెలుసుకోని వాళ్లమా? అని ఆలోచిస్తే రెండవ ఆలోచనయే సరైనది.**

హిందూ ధర్మంలో ఉన్న ముఖ్యమైన లోపాలేమంటే మన దైవాన్ని గురించి మనం సరైన తీరులో తెలుసుకోకపోవడం - ఎవరైనా ఆ లోపాలని ఎత్తి చూపుతూంటే వాటికి సరైన సమాధానాలని చెప్పలేకపోవడం - ఇక ఏ దేవాలయంలోనో భగవంతుణ్ణి గురించిన సరైన ఉపన్యాసం జరుగుతూంటే పూజల వాళ్ల తోవ పూజలదీ - గంటలుకొట్టే వారి తోవ గంటలు కొట్టే వారిదీ - మంగళవాయిద్యాల ధ్వని... మొత్తం మీద ఎన్ని విధాలుగా విననీయకుండా చేయొచ్చో అన్ని తీరులా భగవత్కథ వినబడనీయకుండా సాగిపోతుంది దేవాలయ కార్యక్రమం. దీంతో యడార్థ తత్త్వం తెలియక మనం ఏ దైవాన్ని గురించి ఎవరో అదో తీరులో మాట్లాడినా సమాధానం చెప్పలేని స్థితికి మనం వచ్చేశాం. సరే! మనం ఇప్పుడు కృష్ణునికి ఓ పండుగరోజని ఎందుకు ఏర్పాటు చేయవలసి వచ్చిందో గమనిద్దాం! ముందుగా కృష్ణుణ్ణి క్లుప్తంగా చూసి రామకృష్ణులిద్దరూ ఒక్కరేనని తెలుసుకుందాం!

## బాల కృష్ణుడు

లోకంలో ఏ పిల్లవాడైనా చిలిపి చేష్టల్ని చేస్తూనే ఉంటాడు. వాటిని స్వయంగా గమనించి, లేదా ఎవరో చెప్పగా విని తల్లిదండ్రులు మురిసిపోతూ ఉంటారు. ఇది లోకసహజమైన విషయం. అదే మరి ఆ బాలకుడు లోకసహజమైన పనులని కాకుండా లోకోత్తరమైన (ఎవరూ ఆ వయసులో చేయ వీలుకాని - చెప్పినా నమ్మశక్యం కాని) పనుల్ని చేసినట్లైతే అతణ్ణి సాక్షాత్ దైవస్వరూపంగా భావించాలా? వద్దా?



కృష్ణుడు పుట్టీ పుట్టడంతోటే యమునానది మీదుగా తన తండ్రి తల పై చేటలో పవ్వళించి ప్రయాణిస్తూ యమునానదిని రెండు పాయలుగా చీలి త్రోవనిచ్చేలా చేశాడు. అంతేకాదు, ఆ సమయంలో ఏ ఒక్కరూ కూడా తమని (తననీ తండ్రినీ కూడా) గమనించకుండా ఉండేలా పంచభూతాలనీ అదుపుచేశాడు. ఎక్కడికి తాను చేరవలసి ఉందో ఆ ప్రదేశానికే స్వయంగా చేరి తన తండ్రి ద్వారా ఆ యశోదమ్మ పక్కలో ఉన్న బాలికని తండ్రికి చేరేలా చేసి తాను కాస్తా ఆ అమ్మకి బిడ్డడిగా మారిపోయాడు.

మరో విశేషమేమంటే పుట్టింది స్త్రీ శిశువో? పుంశిశువో తల్లికీ బంధువులకీ తెలియదా? తెల్లవారింతర్వాత 'ఇదేమిటేమి జరిగిందనే ఊహ ఆ నందయశోదలకి రానేలేదా? పోనీ మగపిల్లవాడు గదా అనే ఆనందంతో వాళ్లు పట్టించుకోక పోయినా చుట్టపక్కల వాళ్లైనా శిశువు తారుమారయిందేమిటని వాకబు చేయరా? అదీ కాక తనకి పుట్టిన శిశువు అంగవికలుడైనా ఆనందంగా సాకే లక్షణమున్న తల్లి తన గర్భం నుండి వచ్చిన శిశువు స్త్రీ కాబట్టి విడిచిపెద్దామనే - పోనీ శిశువు మారి పోయినా బాగానే ఉందనీ భావిస్తుందా?

దీన్నే 'మోహ'మంటారు. కృష్ణశిశువు ఆమె పక్కలో చేరిన క్షణం నుండీ ఆమెకే కాదు. ఆమెతో పాటున్న ఈ శిశువుని చూచిన ఎవరికీ అంతకుముందు జరిగిన ఏ విశేషమూ, విషయమూ గుర్తేలేనంతగా మరుపు వచ్చేసింది. దాంతో ఎవరూ ప్రశ్నించనే లేదు. నందయశోదలు కూడా అనుకోనూ లేదు. అదీ కాక వసుదేవుడెక్కడో కంసుని కారాగారంలో ఉంటే ఇక్కడ రోహిణికి గర్భం వచ్చి రౌహిణేయుడనే పేరుతో బలరాముడు పుట్టినప్పుడు కలగని - పుట్టని సందేహం ఇప్పుడు కృష్ణుడు రాగానే కలుగుతుందా? అంటే కృష్ణుడు ఆ యశోదానందులతో పాటు సర్వజనుల్నీ మొత్తం కృష్ణపల్లె వాసులందర్నీ తన పుట్టుకకి పూర్వం కాదు - బలరాముని పుట్టుకకి పూర్వమే మోహంలో ముంచివేశాడన్న మాట.

ఇది చిలిపి చేష్ట ఔతుందా? గడుసు చేష్ట కాదూ? అలాగే ఇంకా పుట్టీ పుట్టకుండా ఉన్న తనకి పాలనియ్యాలనే ఉద్దేశ్యంతో పూతన రాగానే 'కా'దనకుండా ఆమె పాలని తాగుతూన్న వంకతో ఆమె ప్రాణాలని తాగేశాడా? పిల్లలకి తల్లి శరీరస్పర్శ బాగా తెలుస్తుంది. ఎవరు పడితే వాళ్లిచ్చే పాలని మొదట్లో తాగడానికి (తెలియక ఇష్టపడి ఆకలి తీరడం కోసం తాగ ప్రారంభించినా) మధ్యలో పాలు తాగడాన్ని ఆపి ఒక్కసారి అమ్మ ముఖాన్ని చూసి 'మన అమ్మేనా కాదా?' అని గమనిస్తుండే లక్షణం శిశువులది. కనీసం ఆ సందర్భంలోనైనా తన తల్లి కానే కాదని గమనించలేనంతటి వెర్రివాడా దైవమైన కృష్ణుడు.

మరో మాట కూడా ఉంది. భయంకరమైన వ్యాఘ్రం (పులి) తమో గుణంతో నిలువెల్ల నిండిన సింహం కూడా తన పిల్లలకి పాలనిస్తున్న దశలో వాటిని మృదువుగా, ఆప్యాయంగా వాత్యల్యపూరిత దృష్టితో చూస్తూ పాలని ఇస్తాయే, తప్ప ఎప్పుడూ భయంకర దృష్టితో చూడనే చూడవు. తల్లికీ, సంతానానికీ ఉండే అనుబంధం అలాంటిది.

అయితే ఇక్కడ ఏ పూతన అనే రాక్షసి కృష్ణునికి పాలనీయడానికి వచ్చిందో అది కృష్ణ ప్రాణాలని హరించదలిచింది కాబట్టి - ఇంకా కృష్ణుడు చావనే లేదా? ప్రాణాలతోనే ఉన్నాడా? - అన్న తీరులో చూస్తుందే తప్ప, ఆప్యాయతతో మృదుస్పర్శతో కృష్ణుణ్ణి గౌరవిస్తుందా? ఇలా ఉన్న దృష్టిలోని భేదాన్ని గమనించగలిగిన వయసా కృష్ణునిది? అంటే 'ఔను'లోని విశేషాన్ని గమనించడం కాక, దాని అంతఃకరణ ద్వారా పూతన విశేషాన్ని గమనించగలిగాడు కృష్ణుడు. అందుకే - ఏ బాలుడూ ఇంత పిన్నవయసులో చేయవీల్లేని, శక్యం కాని పనిని చేశాడని నిరూపించుకునేందుకు వీలుగా పూతన ప్రాణాలని పూర్తిగా తోడివేశాడు.

ఇక్కడ మరో విశేషాన్ని కూడా గమనించాలి. పూతన పరమ దుర్మార్గురాలనీ, ఆ కారణంగానే ఆమెని చంపవలసి వచ్చిందనీ, ఈ విషయాన్ని తాను బాల్య కారణంగా చెప్పవీలు కాదని తెలియజేస్తూ - సుందర రూపంతో వచ్చిన ఆమెకి యదార్థ రాక్షసరూపాన్ని (మరణించిన కాలంలో రాక్షసులకి యదార్థ రూపం నిలిచి ఉంటుంది) మిగిల్చాడు కృష్ణుడు. ఆమె రాక్షస స్త్రీయే అనే విషయాన్ని ఆమె ద్వారానే ప్రకటింప చేయడమే కాకుండా, తానామెకి మోక్షాన్ని (పరమేశ్వరుని చేతిలో వధింపబడితే) ప్రసాదించాననే విషయాన్ని కూడా లోకానికి తెలియజేస్తూ మృతి చెందిన ఆ కళేబరానికి ఎక్కడా లేని సువాసననీ వచ్చేలా చేశాడు. దీంతో నందయశోదలతో పాటు ఏ మాత్రమూ లౌకిక ప్రవృత్తి లేని వ్రేపల్లెవాసులందరికీ కృష్ణుని మీద భగవద్భావమే తప్ప సామాన్య మానవ భావం కలగనే లేదు.

ఈ విషయాన్ని గమనించిన కృష్ణుడు మళ్లీ తననెక్కడ ఓ అందలంమ్మీద కూర్చోబెట్టి వ్రేపల్లె వాసులందరూ తనని దూరం చేస్తారోనని భయపడి పాలుపెరుగుల అమ్ముకునే వాళ్లలో తాను కూడా ఒకరిగా సంచరిస్తూ అమాయకపు చేష్టలతో వాళ్లని ఆకర్షించుకో గలిగాడు. ఆ గోపబాలకులకి తెలిసింది అటువంటి చేష్టలు మాత్రమే కాబట్టి.

## యౌవన కృష్ణుడు

యౌవనంలో ఉన్న కృష్ణుడు అడుగడుగునా పాండవులకి సహాయపడుతూ ద్రౌపదిని కర్ణునికి భార్యగా చేయకుండా అర్జునునికి భార్యగా అయ్యేటట్లు 'మత్స్యయంత్ర'మనే ఏర్పాటు చేయించాడు. పాండవులకి ఎప్పటికప్పుడు కంటికి రెప్పలా వ్యవహరిస్తూ దుర్వాసుని కోపానికి గురికాకుండా అక్షయపాత్రనీ, యక్షుని బారిన పడకుండా ధర్మరాజుకి 108 సమాధానాలీయగలిగిన బుద్ధినీ అనుగ్రహిస్తూ రక్షించాడు కృష్ణుడు. గోపికా రాసక్రీడలు కృష్ణుడు చేసిన వయసు ఏడు సంవత్సరాల ప్రాయంలో.

చలన చిత్రాలవాళ్లు వయసుకాడైన కృష్ణుణ్ణి ఈ సందర్భంలో చూపించిన కారణంగా కోట్ల ప్రజానీకం దీన్ని ఒక మచ్చగా చేసింది కృష్ణ చరిత్రకి.




## వృద్ధ కృష్ణుడు

కృష్ణుడు తన వయసు మళ్లిన దశలో రాయబారానికి తానై వెళ్లాడు. ధృతరాష్ట్రునితో చెప్పవలసిందంతా చెప్పాడు. దుర్యోధనునితో జరుగబోయే దాన్ని కూడా వివరించి చూశాడు. ఏ ప్రయోజనమూ సిద్ధించని తరుణంలో తానై కురుక్షేత్రానికి ముహూర్తాన్ని పెట్టాడు.

'శిష్ట రక్షణ- దుష్టశిక్షణ' మాత్రమే తన లక్ష్యంగా కలిగినవాడు కాబట్టే కంసాది దుర్మార్గుల్ని సంహరించి తన అవతార సమాప్తి అయిందనే యదార్థాన్ని గమనించి తన అంతః పురకాంతలక్కూడా చెప్పకుండా, ప్రియ మిత్రుడైన అర్జునుని క్కూడా తెలియనీయకుండా చెట్టుచాటున అవతారాన్ని చాలించాడు మహా ధర్మపరుడు కృష్ణుడు. అందుకే రామునికి లేని భగవాన్ అనే మాట కృష్ణునికి చేర్చి "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అంటారు.

ఇంతకీ, రామచంద్రుడనగానే కన్పించే గొప్పదనం కృష్ణుడనగానే ఎవరిలోనూ కన్పించదు సరికదా, కృష్ణుణ్ణి దొంగవానిగా, స్త్రీలోలునిగా, మోసగానిగా. . . . ఇలా ఆలోచిస్తూ 'కృష్ణు'డనగానే ఓ వేళాకోళపు నవ్వుని నవ్వుతారనుకున్నాం కదా! ఎందుకని? కృష్ణుని గురించిన సరైన అవగాహన లేకనే. అలాగని రాముని గురించిన అవగాహన ఉందా? అని అంటే అది కూడా అంతంత మాత్రమే కావడం కూడా దీనిక్కారణమే.

నిజాన్ని ఆలోచిస్తే రామునికీ, కృష్ణునికీ చాల దగ్గర పోలికలు (108) కన్పిస్తాయి. ఈ ఇద్దరి గురించీ మచ్చుకి కొన్నింటిని సరైన రీతిలో తెల ఎసుకున్న పక్షంలో ఇద్దరూ గొప్పవాళ్లేననీ, ఇద్దరూ సజ్జన రక్షణ కోసం దుర్జన శిక్షణ కోసం అవతరించిన శ్రీ మహావిష్ణు అవతారాలేననీ తప్పక అర్థమౌతుంది.

ఇది యదార్థం కాబట్టే రామతాపిన్యుపనిషత్తులో కలియుగాన్ని దాటగల అద్భుత మంత్రంగా -

'హరే! రామ! హరే! రామ!

రామ! రామ! హరే! హరే!

హరే! కృష్ణ! హరే! కృష్ణ!

కృష్ణ! కృష్ణ! హరే! హరే!'

అనే పదాన్ని చెప్పారు. కృష్ణుడే మనం అనుకునే తీరులో దొంగ స్త్రీలోలుడూ, వంచకుడూ అయి ఉండినట్లైతే, లేదా అలా లెక్కించుకోవలసిన వాడే అయ్యుంటే ఆయన్ని దేవుణ్ణిగా గుర్తిస్తూ ఆలయాలు కట్టించడం, ఉత్సవాలని జరిపించటం మాట అటుంచి, అసలాయన పేరుని ఉపనిషత్తులో పై మంత్రంలో ఉంచేందుకు మహర్షులంగీకరించి ఉండేవారా? కాబట్టి కొందరనుకుంటున్నట్లూ లోకంలో ప్రచారంలో ఉన్న తీరుగానూ కృష్ణుడు మరో తీరు వ్యక్తి కానేకాడన్న మాట.

తన ధర్మాన్ని లోకమంతా ప్రవేశపెట్టాలని భావించే దైవం రాముడైతే, లోకమంతా ఆచరిస్తున్న ధర్మాన్ని తన బుద్ధికి అనుగుణంగా మార్చేలా ప్రయత్నించి సఫలుడైనవాడు కృష్ణుడు. ఉదాహరణ పూర్వకంగా ఈ అంశాన్ని పరిశీలిద్దాం! పుట్టుక దగ్గర నుండి రాముడు సూర్యవంశం వాడూ, రఘువంశంలో పుట్టిన కారణంగా రాఘవుడూ అయితే కృష్ణుడు చంద్రవంశంవాడూ, యదువంశంలో పుట్టిన కారణంగా యాదవుడయ్యాడు.



రాముడు విళంబి నామ సంవత్సరంలో ఉత్తరాయణంలో వసంత ఋతువులో చైత్రమాసంలో శుక్లపక్షంలో కర్కాటక లగ్నంలో పునర్వసు నక్షత్రంలో గురువారం మధ్యాహ్నం నవమి తిథిలో పుడితే, కృష్ణుడు శ్రీముఖ నామ సంవత్సరంలో, దక్షిణాయనంలో, వర్షర్తువులో, శ్రావణమాసంలో, బహుళ పక్షంలో, వృషభ లగ్నంలో రోహిణీ నక్షత్రంలో, బుధవారం అర్ధరాత్రి కాలంలో, అష్టమి తిథిలో పుట్టాడు. సంవత్సరానికుండే ఉత్తరాయణం దక్షిణాయనమనే రెంటిలో దక్షిణాయనం అపవిత్రమనే భావన లేకుండా దక్షిణాయనంలో కృష్ణుడు పుట్టాడు.

రాముడు పుట్టింది కౌసల్యకే అయినా కైకమ్మ ఒడిలో పెరిగినవాడైతే, కృష్ణుడు కూడా పుట్టింది దేవకికే అయినా యశోదమ్మ ఒడిలో పెరిగాడు. వ ఇలా అన్ని చోట్లా రాముడూ కృష్ణుడూ సమానంగానే కన్పిస్తారనేది రాబోయే అన్ని పోలికలూ మనకి చెప్తాయి. ప్రతిచోటా ఈ విషయాన్ని గుర్తు చేసుకుంటూ వెడదాం!

సరయునదీ ప్రాంతంలో రాముడు తన ప్రయాణాన్ని కొనసాగిస్తే, యమునానదీ ప్రాంతాన్ని తన విహారానికి అనువైన చోటుగా ఎంచుకున్నాడు కృష్ణుడు.

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులనే నలుగురిలో తన తర్వాతి వారైన ముగ్గురూ తన మాటని (రాముని) వినే వాళ్లౌతూంటే, కృష్ణ బలరాములిద్దర్లో కృష్ణుని మాటకే విలువ ఎక్కువ కృష్ణావతారంలో.

రాముడే కథానాయకుడైన శ్రీమద్రామాయణ కథా ప్రారంభంలో రాముడు మొదటగా స్త్రీ అయిన తాటక (తాటకి కాదు)ని వధిస్తే, కృష్ణుడే కథానాయకుడుగా కన్పించే శ్రీమద్భాగవతంలో కృష్ణుడు మొదటగా చూపింది స్త్రీ అయిన పూతననే. చిత్రమేమంటే తాటకా, పూతనా అనే ఇద్దరూ రామకృష్ణుల వద్దకి వచ్చి తమ జీవితాలని చాలించుకోవడమే. ఈ ఇద్దరికీ పరమేశ్వరుని చేతిలో వధ కారణంగా మోక్షం లభించడం కూడ ఓ విశేషమే.

రాముడు దండకారణ్యానికి వెళ్తే, కృష్ణుడు బృందావనానికి వెళ్లాడు. రాముడు కోతులతో సహవాసం చేస్తే, కృష్ణుడు గోవులతో సహవాసం చేశాడు. రామునికి గుహుడు, సుగ్రీవుడు, జటాయువు మొదలైన వారితో పరిచయం ఏర్పడితే, కృష్ణునికి గోపాలుర,ు గోపికలు, కుచేలుడు మొదలైన వారితో సఖ్యం సాగింది.

రాముడు ధనుర్యుద్ధంలో ప్రవీణుడైతే, కృష్ణుడు మల్లయుద్ధ విశారదుడు. రాముడు దొరతనంతో జీవితాన్ని సాగించినవాడు కాగా, కృష్ణుడు దొంగతనం చేసేవానిగా ప్రసిద్ధుడయ్యాడు. ఏకపత్నీ వ్రతుడు రాముడైతే, బహుపత్నులుండి కూడా బ్రహ్మచర్యంలో ఉన్నవాడు కృష్ణుడు.

రాముడు అగస్త్యమహర్షి నుండి ఆదిత్య హృదయస్తోత్రాన్ని ఉపదేశంగా పొంది యుద్ధం చేసి, రావణుణ్ణి వధించిన వాడైతే, కృష్ణుడు భగవద్గీతా ఉపదేశాన్ని చేసి అర్జునుణ్ణి యుద్ధానికి పురికొల్పి కౌరవ సైన్యాన్ని వధించేలా చేశాడు.

సూర్యుని పుత్రుడైన సుగ్రీవునితో సఖ్యాన్ని 'రాముడు' చేసుకోగా, సూర్యుని పుత్రుడైన కర్ణునితో విరోధించాడు కృష్ణుడు. రాముడు తనకి

స్నేహితుడైన సుగ్రీవునికి పెద్దరికాన్నిచ్చి యుద్ధంలో ప్రముఖునిగా చేస్తే, కృష్ణుడు తనకి విరోధియైన కర్ణుణ్ణి చాలా తక్కువ చేస్తూ యుద్ధంలో అర్జునుని చేత దగ్గరుండి వధింప చేశాడు.

ఇంద్రునికి పుత్రుడైన వాలితో రాముడు విరోధించి వాలిని పట్టుబట్టి వధిస్తే, ఇంద్రునికి పుత్రుడైన అర్జునునితో కృష్ణుడు చుట్టరికంతో కూడిన సఖ్యాన్ని చేసి కావాలని అర్జునుని ప్రాణాలని కష్ట సందర్భంలో నిలిపాడు. కృష్ణుడే అర్జునుణ్ణి ప్రోత్సహించి సూర్యపుత్రుడైన కర్ణుని ప్రాణాల్ని హరింపచేశాడు. రాముడు సూర్యపుత్రుడైన సుగ్రీవునితో మైత్రి చేయడమే కాక, సుగ్రీవుణ్ణి సేనకి నాయకునిగా చేసి నడిపించాడు.

రాముడు వానరుల సహాయంతో రాజ్యాన్ని సాధిస్తే, కృష్ణుడు మానవబలంతో విజయాన్ని చేకూర్చిపెట్టాడు. ఇలా అనేకమైన పోలికలని అలా ఒక్కమారు చూడదలిస్తే -

| రాముడు | కృష్ణుడు |
| --- | --- |
| ❀ బాణంతో మద్ది వృక్షాలని కొట్టాడు. | ❀ ఒక్క తోపుతో 2 మద్ది వృక్షాలని విరిచాడు. |
| ❀ కన్యా బంధువుల చేత ఒప్పించుకుని సీతని పెండ్లాడాడు. | ❀ కన్యా బంధువులకి నొప్పి కలిగేలా చేసి రుక్మిణిని వివాహ మాడాడు. |
| ❀ తన పెళ్లికి ముందు దశరథునికి రాయబారం పంపాడు. | ❀ తన పెళ్లికి ముందు పురోహిత రాయబారాన్ని అందుకున్నాడు. |
| ❀ అన్నలని చంపి తమ్ముళ్లైన సుగ్రీవునికీ, విభీషణునకీ రాజ్యాన్ని పట్టం కట్టాడు. | ❀ తమ్ముళ్లైన కౌరవుల్ని చంపి అన్నలైన పాండవులకి రాజ్యాన్ని ఇప్పించాడు. |
| ❀ శబరి వద్దకి వెళ్లి ఆమె ఇచ్చిన పండ్లని స్వీకరించాడు. | ❀ కుచేలుణ్ణి రప్పించుకుని అతణ్ణి అడిగి మరీ నూకలని (సంస్కృత భాగవత ప్రకారం) స్వీకరించడం కాదు తిన్నాడు. |
| ❀ ఆకాశమార్గంలో ఆంజనేయుణ్ణి దూతగా పంపాడు. | ❀ భూతల మార్గంలో తానే దూతగా వెళ్లాడు. |
| ❀ శివలింగ ప్రతిష్ఠని చేశాడు. | ❀ యుధిష్ఠిర ప్రతిష్ఠ చేశాడు. |
| ❀ విశ్వామిత్రుని యజ్ఞానికి వెళ్లాడు | ❀ కంసుని ధనుర్యాగానికి వెళ్లాడు. |
| ❀ శూర్పణఖని ముక్కు, చెవులు కోయించి కురూపిగా చేశాడు. | ❀ కురూపి అయిన కుబ్జకి సుందర రూపాన్ని ఇచ్చాడు |
| ❀ సముద్రానికి వారధి కట్టి సేనలని తరలించాడు లంకకి. | ❀ యమునానదిని రెంటిగా చీల్చి వసుదేవుణ్ణి దాటేలా చేశాడు వ్రేపల్లెకి. |
| ❀ విష్ణువు యొక్క అంశలో సగం తానౌతూ పుట్టాడు. | ❀ విష్ణువు యొక్క సంపూర్ణ అంశతో తాను జన్మించాడు. |
| ❀ రాజ్యం వద్దేవద్దంటూ దండకారణ్యంలో ఉన్నాడు. | ❀ రాజ్యాన్ని స్వీకరించనంటూ ద్వారకలోనే ఉన్నాడు. |
| ❀ నిత్యం కోదండాన్ని (వింటిని) ధరించే ఉంటాడు. | ❀ అనుక్షణం మురళిని తన చేత పూనే ఉంటాడు. |
| ❀ వశిష్ఠ విశ్వామిత్రులకి శిష్యుడయ్యాడు. | ❀ గర్గ-సాందీపనిల వద్ద విద్యని నేర్చాడు. |
| ❀ పక్షికి అంత్యక్రియలని (జటాయువుకి) చేశాడు. | ❀ తన అంత్యక్రియలని నరునిచే (అర్జునుడు) చేయించుకున్నాడు. |
| ❀ అభయం సర్వభూతేభ్యో దదామ్యేతత్ వ్రతం మమ (ఎవరికైనా మోక్ష మిస్తాను) అన్నాడు. | ❀ అహం త్వా సార్వపాపేభ్యో మోక్షయిష్యా మాశుచః (అందరి పాపాలనీ ప్రార్థించినట్లైతే తొలగిస్తా)నన్నాడు. |

*- డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు*

# శాలివాహన

**1997 అదొక పల్లెటూరు... పక్షులు కువ కువ రావాలు పసిపాపలకు జోలపాటవుతోంది. పైరగాలి రెపరెపలు పచ్చని పంట పైరుకు ఊయల అవుతోంది. మట్టి పరిమళం పల్లె గుండెకు ప్రాణ వాయువవుతోంది. బడికి ముస్తాబైన పిల్లోడిలా.**

**పాల నురగల కాంతిదుస్తులు ధరించి, అరుణ కిరణ టై కట్టేసి, నీలి మేఘాల షూ బిగించేసి, 'హాట్' బాక్స్ సర్దుకున్న బ్యాగేసుకొని తూరుపు వాహనమెక్కి బాలసూరేడు బయల్దేరాడు. అరగంట గడిచింది.**

ఇంటావిడ గోధుమ పిండిని చేత్తో పిసికి పిసికి చపాతికి సిద్ధం చేసినట్టు, మల్లయ్య కుమ్మరి మట్టిని కాళ్ళతో కలియ తొక్కుతూ మెత్తని ముద్దగా మలచడానికీ చమటోడ్చుతున్నాడు. మధ్య మధ్యలో నీళ్ళందిస్తూ తనుకూడా మట్టి కలుపుతూ భర్తకి సహకరిస్తోంది నర్సవ్వ. గత రెండ్రోజులు కుమ్మరి సారె పట్టలేదు మల్లయ్య. వాతావరణం అనుకూలంగా లేదు. ఆకాశం మబ్బు పట్టి ఉంది. చేసిన పాత్రలూ తెగెండక పోతే పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అందుకే పని ముట్టుకోలేదు. పటేన్ల వ్యవసాయానికి కూలీకి వెళ్లాడు.

ఈ రోజే ఎండ తెరవడంతో నర్సవ్వ పెనిమిటిని స్వంత పనికి పురమాయింది. పైగా పెళ్ళిళ్ళ సీజను. మంచి ముహూర్తాలున్నాయి. పెళ్ళిలో ఐరేని కుండల్ని ముందే తయారుచేసే పెట్టుకుంటే మంచిదని మల్లయ్య ఆలోచన.

మూడు గ్రామాలకు కలిపి కుమ్మరి కుటుంబాలు రెండే ఉన్నాయి. మల్లయ్యకి తప్పమిగతా వాళ్ళకి... కొద్దీ గొప్ప వ్యవసాయం ఉంది. అందుకే ఒక్క మల్లయ్యకే కులవృత్తిపై ఆధారపడాల్సి వచ్చింది. "పొలగాడు శాలివాహన ఏడే?" కుమ్మరి సారి ముందు వంగి మట్టిముద్దల్ని సారె మీద అద్దుతూ భార్యనడిగాడు మల్లయ్య,

"గీయేలప్పుడు యాడుంటడు? ఆడుకోను వోయిండు" భర్తకి మట్టినందిస్తూ జవాబిచ్చింది నర్సవ్వ.

"ఆ ముసలి పోచడత్తడు. బర్లతోని తోలాలె."

"అయితారమన్న (ఆదివారం) పొలగాన్ని ఆడుకోనియ్య రాదూ?"

"ఔ ఔ! ఆడుకుంటే ఆకల్దీర్తది గాదే? పిలవాడ్ని..." స్వరం పెంచాడు.

"ఆడికి తెల్వదా? పోచడు అచ్చే లోపల అత్తడ్లే" కొడుకుని వెనకేసు కొచ్చింది.

"సద్ది గడితివా?"

"ఏడ గడితి? లేత్తనే నీ తోనే ఉంటున్ననా?"

మట్టి గలుపుడైంది గదా! కుండల్ని నేం చేసుకుంటగని, జర పొయ్యి కాడికి పో! జల్ది బువ్వండి గింత తొక్కున్న, కారప్పొడన్న పెట్టి సిన్నోడు రాంగనే తోలు."

తలూపింది నర్సవ్వ. చేతులు కడుక్కొని అక్కడి నుండి వెళ్ళిపోయింది. పక్కనున్న కంక కట్టె అందుకొని కుమ్మరి సారెను గిర్రున గుండ్రగ తిప్పి కట్టెను పక్కన పెట్టాడు. రెండు అరచేతుల్ని ఆయుధంగా మలచుకొని, మట్టి ముద్దలతో కళాకృతి తేవడంలో నిమగ్నమై పోయాడా శ్రమ జీవి.

* * * * *

గంపలో అయిదు కుండల్ని సర్ది భర్త తలపైకి అందించింది నర్సవ్వ. రెండు చేతులెత్తి గంపని జాగ్రత్తగా పట్టుకొని "ఔ! పోయత్తా" భార్యకి చెప్తూ నారాయణ పటేలు ఇంటివైపు కదిలాడు మల్లయ్య.

నారాయణ పటేలు చిన్న చెల్లె పెళ్ళి. మొదాలుకు మొదాలు ఐరేని కుండల్ని వాళ్ళకివ్వాలని బయల్దేరాడు మల్లయ్య, లేకపోతే పటేలు శివాలెత్తుతాడు.

పటేలు ఇంటిముందాగి గంపని భద్రంగ కిందికి దింపుకొని "పటేలా!" గొంతెత్తి పిలిచాడు.



"ఎవడ్రా అది?" గంభీరమైన కంఠ స్వరంతో బయటకొచ్చాడు నారాయణ పటేలు.

వినయంగా రెండు చేతులు జోడించి "దండాలు పటేలా!" వంగి వంగి గౌరవం ప్రదర్శించాడు, మల్లయ్యని చూనన్తానే "ఆ... ఆ... ఎటొచ్చినవ్?" అడుగుతూనే వసారాలో ఉన్న పడకుర్చీలో కూర్చుని విలాసంగా వెనక్కి ఒరిగాడు.

గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

"పటేలవ్వ ఐరేని కుండలు తెమ్మంది బాంచను" చేతులు కట్టుకొని ఎదురుగా నిలబడ్డాడు.

"అలాగా!" అంటూ తలూపి ఇంటి పాలేర్ని కేకేసి పిలిచి కుండల్ని తన భార్యకి అప్పచెప్పమని వాడిని పూరమాయించాడు. పరుగు పరుగున వచ్చిన పాలేరు కుండల్ని రెండు విడతల్లో లోనికి తీసుకెళ్ళాడు. ఎంతసేపటికి నారాయణ పటేలు నోరు మెదపకపోయేసరికి "కాల్మొక్త, ఏవన్నిప్పించండ్రి పటేలా!" వంగి వంగి అడిగాడు మల్లయ్య.

"ఏమివ్వమంటావు?"

"తమరి కెర్క లేదా బాంచను."

"సరే... కుండకు అయిదు చొప్పున పాతిక పట్టుకపో"

"వట్టి కుండలల్లెక్క లెక్కవెడ్తున్నరు పటేలా, ఐరేనీ కుండలు... అందరు రెన్నూర్ల పదారిత్తున్నరయ్యా."

"ఏంట్రో బాగా పెంచావ్!" కణ్నెప్పలెగరేశాడు.

"గిప్పుడె గద పటేలా, నాల్గు పైసలు కంట్ల వడేది. ఇంటికో లగ్గం ఎన్నటికోమల్ల."

"మట్టికి... గీ మట్టి కుండలకే గంతయితే... బంగారపు బిందెలకెంతుండాలి?" కసురుకున్నాడు.

ఒక్కోడ్ని, కూలి... బిందె తప్పితే కులం పని సేసుకునేటోడ్ని, గట్లనకుర్రి" అన్నాడు. మౌనం వహించాడు నారాయణరెడ్డి.

"మీ బాంచను, పోరడు కరీంనగర్‌ల సదూతుండయ్యా! పైసల వుసరం బగ్గుంది. కాదనకుండ్రి" బ్రతిమిలాడాడు.

'పటేలు తగ్గించిస్తే మిగతా ఊరి జనం కుండా అంతే వెల కట్టిస్తరు' అదీ మల్లయ్య గుబులు. 'అలాగయితే... జబ్బలు విరిగేటట్టు మట్టి మోసుకొచ్చి, రెక్కలు నొప్పులు పుట్టేట్టు మట్టితొక్కి, అరచేతులు అరిగి కరిగేటట్టు కుండల్ని చేసి, కట్టెలు సేర్చి ఆముల కాల్చి... గీ కట్టమంత సేసుడెందుకు? దండగ? దండగ' అనుకున్నాడు మల్లయ్య.

"తిండికి లేదంటవు. నీ కొడుకుని పెద్దూర్లో చదివించడ మెందుకురా?" దెప్పి పొడిచాడు.

"మల్లయ్యా! నీకొడుకు శాలివాహన తెలివైన వాడు, బాగా చదివిస్తే గొప్పవాడవుతాడు. వాడు మట్టిలో మాణిక్యం. మట్టిలోనే మగ్గి పోనివ్వకు, నా మాట మీద విశ్వాసముంటే ఈ మీ ఊర్లో ఉన్న అయిదుతో చదువాపకు. నువ్వు, నీ భార్య ఓ పూట కడుపు మాడ్చుకొనైనా శాలివాహనని చదివించండి. మీ కులానికే పేరు తీసుకొస్తాడు."

సర్కారు బడి మాష్టారు రాఘవయ్య చెప్పిన మాటలు మల్లయ్యకు గుర్తుకు వచ్చాయి. క్షణంలో ఆలోచనలను చెదరగొడుతూ "కాల్మొక్త బాంచను, నా ఎరుకలో మా వంశమ్ల... వంశమ్ల ఏంది. మా కులం గిప్పుడప్పుడే పొలగాండ్లు బడి మెట్లెక్కుతున్నారు పటేలా గట్లన కుండ్రి.." అన్నాడు పటేలుతో.

"నీ ఏడ్పెందో నువ్వేడువు. ఈ కుండలకి రెండొందల పదహార్లొద్దుగానీ నూట పదార్లు పట్టుకపో. ఎవరైనా అడిగితే పటేలు రెండొందల పదహార్లిచ్చాడని చెప్పుకుపో!" అంటూ లాల్చీ పక్క జేబు నుండి నోట్లు తీసి పదిసార్లు లెక్కబెట్టి, ఒకే ఒక్క వందనోటు చేతికందించాడు. మీసం మెలేస్తూ చూస్తున్న నారాయణ రెడ్డికి మరోసారి దండం పెట్టి, ఆ వంద కాగితాన్నే అపురూపంగా బొడ్లో దోపుకున్నాడు.

ఖాళీగంప చేతపట్టుకొని "పోయుత్త, దండాలు బాంచను" చెప్పేసి ఇంటి ముఖం పట్టాడు మల్లయ్య.

* * * * *

**మం**చి రోజులు వెళ్ళిపోయాయి. రైతులకు పంటలు కూడా చేతికొచ్చాయి. మల్లయ్య ఖాళీగానే ఉన్నాడు. గుడిసె వాకిట పందిరి కిందున్న నులక మంచమ్మీద బాసింపట్టేసి కూర్చున్నాడు. తలకి రుమాలు, చుట్టుకుంటుంటే? బయట కొచ్చిన నర్సవ్వ ఆ మంచం పక్క కింద కూర్చుంది.

పొద్దు వాలుతోంది.

బయట నుండి పరుగు పరుగున వచ్చాడు శాలివాహన. దమ్ము ఎగ దీసుకుంటూ పందిరి గుంజకి చేర గిలబడి తండ్రి కెదురుగా నిలబడ్డాడు. కాసేపట్దాకా ఉలుకు లేదు, పలుకులేదు,

"ఏందిర బిడ్డ? గట్లన్నవ్!" కొడుకుని ఆరా తీశాడు మల్లయ్య, శాలివాహన పెదవి విప్పబోయి విషయం చెప్పకుండానే మళ్ళీ ఆగాడు. చేతుల్తో సైగచేస్తూ "ముందిట్రా అయ్యా!" అంటూ దగ్గరకు రమ్మని ప్రేమగా పిలిచాడు. బుంగ మూతి పెడుతూ తండ్రి చెంతకొచ్చి నిలబడ్డాడా కుర్రాడు. మల్లయ్య రెండు చేతుల్తో దగ్గరకు తీసుకొని ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు.

"సెప్పు బిడ్డ, సిన్నపోయినవెందుకు? మీ అవ్వ తిట్టిందా?" అభిమానం కురిపించాడు. అడ్డంగా తలూపాడా కుర్రాడు.

"ఆడట్లుంటే మధ్యన నన్ను లాగుతవెందుకు" మూతి మూడు వంకర్లు తిప్పింది నర్సవ్వ.

"జెప్పన రేష పడ్తవేందే?" మల్లయ్య ముసి ముసిగ నవ్విండు. సర్రున చూపటు తిప్పుకుందామె.

"ఏవన్నా గావల్నా బిడ్డా.?" కొడుకు మనసెరిగి అడిగాడు మల్లయ్య.

"బాపూ... అవి గా వాల్నే..." తలెత్తకుండానే అడిగాడు శాలివాహన.

"గయ్యంటే... సెప్పంది నాకెట్ల తెల్తదిరా?"

"నడిపి పటేలు కొడుకు కాళ్ళకున్నయే బాపూ. అవి గావాల్నే." అడిగాడు ఆశగా...

"కిర్రు కిర్రు బూట్లార బిడ్డా?"

తలూపుతున్న వాడి చిన్న ముఖంలో సంతోషం తళుకు లేసింది.

"మన కేమన్నా ఎకరాల కొద్దీ భూములున్నయా, కూలి సేసుకొని బతికెటోల్లం. దినాం నువ్వు కరీంనగరం బోయి అచ్చుడుకే కొద్ది పైసలయితన్నయను కుంటున్నవా? గీయన్ని కొనిచ్చు డేడ అయితది, బాంచను. సదువైతే మంచిగ సదూకో బిడ్డ, పెద్దయి నంక గసొంటియి నువ్వే కొంటవుర అయ్య" గదువ పట్టుకొని కొడుక్కి అనునయంగా నచ్చ చెప్పాడు మల్లయ్య,

ఆ సమాధానానికి పిల్లవాడి కంటే తల్లి నర్సవ్వే ఎక్కువ బాధ పడింది. శాలివాహనుడి వయసుకి మించిన జ్ఞానం- అర్థం చేసుకోగలడు. తండ్రి ఒడినుండి కిందికి దిగాడు.

"బాగా చదువుకుంట బాపు, పెద్దయినంక మీ ఇద్దరి క్కూడా మంచి చెప్పులు కొనిస్తా.." ఉత్సాహంగా చెబుతూ ఆడుకోవడానికి తిరిగి ఊర్లోకి పరుగుతీశాడు. కొడుకు మాటలకు తండ్రి మురిసిపోయాడు. తల్లికి ముచ్చటేసింది. కొడుకు బాగా చదవాలని ఊరి పోచమ్మతల్లికి మొక్కుకుందామె.

* * * * *

ఆర్థికంగా మల్లయ్యకు ఇబ్బదవుతోందని రాఘవయ్య మాష్టారు స్వయంగా శాలివాహనను కరీంనగర్‌లోని బి.సి. హాస్టల్‌లో చేర్పించాడు. హాస్టల్ నచ్చిందా కుర్రాడికి. ఆరవ తరగతిలో ఉన్నాడిపుడు, శాలివాహనకు మరో ధ్యాసే లేదు. తనేంటో, తన పనేంటో, తన చదువేటో... అంతే! తన పల్లెలో - బర్లు కాయడం, అపుడపుడు పసుపేర పోవడం, సీజన్‌ను బట్టి బల్లి పీకపోవడం లాంటి పనులన్నీ కష్టంగా ఉంది. కానీ ఇక్కడ - టైముకి మంచి తిండి, కాసేపు చదువు, మరి కాసేపు ఆట. కష్టం లేదు ఇష్టంగా ఉంది. అందుకే చదువు మీద ఆసక్తి పెరిగిందా కుర్రాడికి.

ఊళ్ళో చేసిన కాయకష్టం ముందు ఈ చదువు సులువు అన్పించింది. ఆ అబ్బాయి మేధకు సరస్వతి తోడయ్యింది.

కత్తి... సానదీసిన కత్తయ్యాడు!

* * * * *

ఎవరికైనా మంచి రోజొకటొస్తుంది! మల్లె పూవే కాదు, గడ్డి పూవు కూడా. ఒకనాడు మకరందం మధువొలక బోస్తుంది. పూల మొక్కతో పాటు గడ్డి మొలక సైతం తాజా పరిమళపు పాటై తప్పక పల్లవిస్తుంది.

* * * * *

## 2010

పదమూడు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. మల్లయ్యను పిలిపించిన కోమట్ల మల్లేశు "మల్లయ్యా! నా అప్పు బాపతు పైసలిత్తవా?" అనడిగాడు.

"గిప్పటికి గిప్పుడు పైసలంటే ఏడున్నయ్ సేటు?" కంగారు పడ్డాడు మల్లయ్య. చేతిలో చిల్లి గవ్వలేదు. వయసు కూడా దాటింది. కూలికి వెళ్ళడం లేదు.

"నేనడుగక పోయెటోడ్ని, పైసలవుసరమున్నయ్ మరి... సెట్లే గట్లంటెట్ల?" పరాచాకాలాడాడు మల్లయ్య,

"నిజమే మల్లయ్యా! ఆపతి ఎవలకైన ఒకటే. కరీంనగర్‌లో ప్రైవేట్ హాస్టల్లో నా కొడుకును చదివించిన్నా? వేలకు వేలు ఖర్చయ్యె. అక్షరపు ముక్క అంటుడు అటుంచి పోరడు ఎటూ గాకుండ పాయె. పైసలన్నీ ముంచిండు. పట్నంలో తాగుడట, పేకాడట. పోరడు చెడే పోయిండనుకో" మనసిప్పి చెప్పూనే బాధపడ్డాడు సేటు.

"మరిప్పుడేం జేత్తున్నడు?"

"తిని తిరుగుతున్నడు. పదిహేనయితే పాసయితలేడు. మొద్దు నా కొడుక్కి అక్కడ్నే ఏదన్న దుకాణం పెట్టిస్తనని ఆలోచిత్తన్న, గందుకే అప్పులన్నీ వసూలు సేసుకుంటున్న."

"నేను కుండలు సేసుడు గూడ బంజ్జేత్తి. స్టీలు సామాన్లు, ప్లాస్టిక్ సామాన్లు వాడుకం పెర్గినంక గీ కాగులు, కుండలు ఎవలు కొంటున్నారు? రంగు రంగుల కూజాలు రావట్లె, ఎక్కడెక్కడియో గంజన్లు దాడి జేయవట్టె" వాపోయాడు మల్లయ్య.

"కాలం మారింది మరి, పాత నీళ్ళు పోయి కొత్తయి అచ్చుడేనాయె, ఇవీ గట్లనే!"

"గొంతం సీర్క ఉండె. దాన్నమ్మైనా పైసలిత్త. మా శాలివాహన కూడా ఓ మాట సెప్త సేటు. అడుగూడ పెద్దడయ్యిండు గద."

"నువ్వేమన్న జెయ్! ఈ దీలి (దీపావళి) దాటకుండ జర పైసలైతే మొత్తం గట్టు".

"గట్లనే సేటు" తలూపుతూ మల్లయ్య కదిలాడక్కడి నుండి.

శాలివాహన 'గ్రూప్' ఎగ్జామ్స్‌కి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నాడు, అందుకైన అప్పే అది. ఈ లోగా అతడు రాసిన గ్రూప్ వన్ రిజల్ట్స్ కూడా వచ్చాయి.

* * * * *

కాలం కలకాలం ఒకలా ఉండదు. తనతో పాటు మానవ జీవితాన్నీ అనూహ్యంగా మార్చివేస్తుంది. ప్రపంచీకరణ పుణ్యమాని భారతీయ గ్రామీణ మూలాల్లో మార్పులు వచ్చినట్టే ఈ పల్లె కూడా ఎంతో మార్పు చెందింది.

నాగరికత పెరిగింది. కులాల జబర్దస్తీ తగ్గింది. చదువుకున్న వాడు, చదువురాని వాడు... ఈ రెండు వర్గాలే కనబడుతున్నాయిప్పుడు. మల్లేశం సేటు తన కొడుకు వెంకటేశ్ చేత కరీంనగర్‌లో సెల్ పాయింట్ పెట్టించాడు. వ్యాపారం వాళ్ళకే జన్మతః అబ్బిన విద్య. ఆ షాపు ఊపందుకుంది.

చెడు వ్యసనాలకు లోనైన పటేళ్ల పిల్లలకు చదువు భ్రష్టు పట్టింది. అగ్రవర్ణాల మంటూ ఎగ్ర వీగిన మరేమీ లేదు. ఇంటర్ డిగ్రీలతో ఆపేశారు. ఇంకొందరు డబ్బుని పురంగా పెట్టి రియల్ ఎస్టేట్‌లోకి దిగారు. ఇతర కులాల పిల్లలకు కూడా పెద్దగా చదువు అబ్బలేదు. ఉద్యోగాలు వెలగబెట్టిందేమే, సంస్కారం పెరిగింది. సంప్రదాయాలు అలవడ్డాయి.

ఇక శాలివాహన... ఒక్కడు ఊరికి రత్నమై తేలాడు. మట్టిలో మాణిక్యమై మెరిశాడు!

* * * * *

'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అనే బోర్డ్ తగిలించుకున్న జీపొకటి బాటా షోరూమ్ ముందు ఆగింది. స్టయిల్‌గా వాహనం దిగిన శాలివాహన అటెండర్ వెంటరాగా హుందాగా షాపులోకి అడుగుపెట్టాడు.

ఆ షాపు ఓనర్ శాలివాహనను గుర్తుపట్టాడు.

"ను... ను, మీ... మీరు..." తడబడుతూ మాటలు మింగేశాడు షాప్ ఓనర్ .

"ఔను, శాలివాహన నందీ! కుండలు చేసే కుమ్మరి మల్లయ్య గారి అబ్బాయిని" భేషజం లేకుండా వినయంగా తనని తాను పరిచయం చేసుకున్నాడు.

అతడు... నారాయణ రెడ్డి పటేలు పెద్దకొడుకు... గుర్తుపట్టాడు శాలివాహన.




"జాబ్ వచ్చింది. ఉపాధి కల్పనా ఆఫీసర్‌గా మన జిల్లాలోనే జాయినయ్యాను" మాటల్లో ఎలాంటి బింకం ప్రదర్శించకుండా చాలా కూల్‌గా చెప్పాడు.

నోరు పెగల్లేదు చరణ్‌కి. ఇద్దరూ సమవయస్కులే మరి. ''కుమ్మరోనివి, మట్టి పిసుక్కోక నీకు చదువెందుకురా?'' బాల్యంలో ఓసారి మాటా మాటా పెరిగి పటేళ్లబ్బాయిననే అహంతో శాలివాహనను తీవ్రంగా దూషించాడు చరణ్.

అప్రయత్నంగా అదిపుడు మనసులో మెదిలి సిగ్గుపడ్డాడు చరణ్. శాలివాహనని కూర్చోమన్నాడు. శాలివాహన మాట తీరు, డ్రెస్సింగ్ అన్నీ మారినాయి, చదువు కులాల సరిహద్దుల్ని చెరిపేస్తుందని తొలిసారిగా అర్థమైంది చరణ్‌కి. నారాయణరెడ్డి కుటుంబం భూములన్నీ అమ్మేసి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో సెటిల వ్వడంతో, ఊరి విషయాలంతగా తెలియడం లేదు వాళ్ళకు. ''మీరీ షాపులో...'' సందిగ్ధత వ్యక్త పరిచాడు శాలివాహన.

చరణ్ ముఖం చిన్నబుచ్చుకొని "ఎకరాలకు జాగిర్దారైన పటేళ్ల కొడుకునని అహంకారముండె. మాకు లోటేంటని మస్తు ఫీలింగుండె. వయసు రేపిన అలజడులకి మనసు పక్కదార్లు పట్టి చదువు సాగలేదు. వ్యవసాయం నాన్న తరానికి చెల్లింది. అది నాతో కాలేదు. చివరికీ షోరూమ్ పెట్టుకోవాల్సి వచ్చింది" అంటూ నిట్టూర్చాడు.

చదువు నేర్పిన సంస్కారం శాలివాహనను పెదవి విప్పనీయలేదు.

"షూ కావాలా?" కాకతాళీయంగా అడిగాడు చరణ్.

'సిన్నప్పుడు బూట్లంటే లవు సంబుర ముండె నీకు, మొదాలుకు మొదాలు జీతమచ్చినంక నువ్వయితే మంచి బూట్లు కొనుక్కోర అయ్యా. బూట్లేసుకొని రంగుటద్దాలు కళ్ళకి దిగేసుకొని ఆఫీసుల గూసుంటె సాల్ర బిడ్డ, మా కట్టం గట్టెక్కినట్టె." ఉద్యోగం వచ్చాక తల్లిదండ్రుల పాదాల్ని స్పర్శించినపుడు చెమర్చిన కళ్ళతో వాళ్ళు ముక్త కంఠంతో అన్న మాటలు గుర్తుకొచ్చాయి శాలివాహనకు.

ఏనాడూ మంచి చెప్పులు అటుంచి కనీసం స్లిప్పర్లే ఎరుగని ఆ దంపతుల పాదాలు కళ్ళలో మెదిలాయి.

"ఊహూ! బాటా కంపెనీ చెప్పులే కాస్టిలీవి చూపండి" పేరెంట్స్ కాళ్ళసైజు సుమారుగా ఊహించి చెప్పి ఇద్దరికీ ఇవ్వమని అడిగాడు.

సేల్స్ బాయ్‌ని పురమాయించాడు చరణ్. నచ్చిన రెండు జతలు ప్యాక్ చేయించి బిల్ చెల్లించి బయటకు నడిచాడు శాలివాహన. తన తొలి జీతం పూర్తిగా కన్నవాళ్ళకే ఖర్చు పెట్టాలని అతడి సెంట్‌మెంట్ ఆలోచన. అందుకే జీప్‌ని బట్టల షోరూమ్‌కి పొమ్మన్నాడు. తల్లిదండ్రులకి మంచి బట్టలు కొన్నాడు. తిరిగొస్తుండగా మార్గమధ్యలో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగింది వాహనం.

ఓ వృద్ధ జంట అక్కడ ఆగిన ప్రతి వాహనం దగ్గరకు వెళ్తి సత్తుప్లేటు ముందుకు చాపి చిల్లర వేయమని అర్థిస్తున్నారు. ఆ క్రమంలో శాలివాహన వైపొచ్చారు. వారి రాకతో... తన తొలి జీతంలో కొంత బీదలక్కుడా ఉపయోగపడ్తోందని లోలోన నవ్వుకుంటూ పర్స్ తీసి ఓ వందనోటొకటి ఆ సత్తు పళ్లెంలో వేశాడు.

వణుకుతున్న రెండు చేతులెత్తి మనసారా దండం పెడుతూ "నీ కడుపు సల్లంగుండ"! అనే వెలకట్టలేని దీవెనొకటి శాలివాహనకు అందించారా వృద్ధులు.

అసంకల్పితంగా శాలివాహన చూపులు వాళ్ళ కాళ్ళ వైపు పడ్డాయి. అంతెండలో పాదాలు చురుక్కు చురుక్కు మంటుంటే భరింపలేక కాళ్ళెత్తెత్తి నిలబడుతూ వాళ్ళు ప్రయాస పడ్తుంటే శాలివాహన హృదయం కలుక్కుమంది.

ఆ పేదరికం తాననుభవించిందే!

తన బాల్యపు పొరల్ని తడుముతూ జారిపోయిన ఆ పేదరికపు స్పర్శనెలా మరచిపోగలడు? పచ్చలైటు పడి వాహనం కదులుతుంటే డ్రైవర్‌కి సైగ చేసి ఆపి, "ఇదిగోండి. ఈ చెప్పులు వేసుకోండి" అంటూ ఆ వృద్ధులకు చెప్పుల ప్యాకెట్ అందివ్వబోతే తీసుకోవడానికి వాళ్ళు వెనకాడారు.

"ఫర్వాలేదు, మా అమ్మనాన్నలకు కొన్నాను. తిరిగి కొనగలను. నాకష్టార్జితమే!" అంటూ బలవంతంగా శాలివాహన వాళ్ళ చేతుల్లో పెట్టాడు.

జీప్ కదిలింది.

ఆ సమయంలో ఆ శతవర్ష సమీప వృద్ధులు మొహాలు చూసి తీరాలి, ఎంతలా వెలిగి పోయాయో!

బహుశా మానవీయ కోణాల్ని స్పృశించే ఏ గుండెకయినా ఈ వృద్ధ దంపతుల కళ్ళలోని ఆనందపు తళుకు చాశాక సాక్షాత్ మకరజ్యోతి దర్శనానంతరం కలిగిన అనుభవాలు కూడా దీని ముందు దిగదుడుపే.

ఏదో తెలీని సంతృప్తి తొలిసారిగా శాలివాహన గుండె నిండా పేరుకు పోయింది. సందేహం లేదు... ఉన్నత వ్యక్తిత్వం గల ఒక ఆఫీసరే కాదు, మానవతా విలువలున్న ఒక మహామనిషి సమాజానికి లభించినట్టే! ★

# నిజమైన నాయకుడు

అందరూ అనుకునే విధంగా ప్రపంచంలో మంచివారనీ, చెడ్డవారనీ ఉండరు. మన ఆలోచనల వల్లే మనకి అలా అన్పిస్తుంది (షేక్స్పియరు). అయితే,మనలో అంటే ప్రతి మనిషిలో-నాయకత్వం, పోటీతత్త్వం, ఆర్థికతత్త్వం, ఆస్థిక/ చాంధసవాదం, వక్తృత్వ్వం, పౌరసత్త్వం, పౌరుషం, పోట్లాడేతత్త్వం, ఈర్ష్య, మంచితనం, పిరికితనం, చండశాసనత్వం వంటి అనేక లక్షణాలుంటాయి. అందుకే చాల గొప్ప మేధావులు, మహానుభావుల హితోక్తులు మనందరికీ ప్రత్యేకం!

**నాయకత్వం**

1. ప్రకృతిలో ఎంతో అరుదుగా లభించేది- నిజమైన నాయకత్వం. తాము చేయగలమని ప్రజలు అనుకోని గొప్పగొప్ప పనులెన్నో వారిచేతే చేయించగలిగే వాడే నిజమైన నాయకుడు.

   - కాలిన్ మార్షల్.

2. క్రమశిక్షణని పాటించగలిగే వారే చక్కగ పరిపాలించగలుగుతారు.

   - ఋగ్వేదం.

3. జైలుగోడల మధ్య మగ్గిపోతూ ఉండడమే బందిఖానా కాదు. మనిషి హక్కుల అపహరణ జరిగితే, అది సైతం బందిఖానాయే.

   - రవీంద్రనాథ్ టాగూర్.

4. మంచి సమాజం మనిషి శరీరం లాంటిది. అందుకే శరీరమైనా, సమాజమైనా - అందులో ఏ ఒక్క భాగానికి బాధకలిగినా, నివారణకు అందరూ నడుం బిగించాలి.

   - వినోబాభావే.

5. రాజకీయ స్వతంత్రం ఎంత ఉన్నా, అది ఆకలితో అలమటించే వారిని సంతోష పెట్టలేదు.

   - లెనిన్

6. దేశసేవ అంటే ఉపన్యాసాలు దంచడం కాదు. ఎవరి విధిని వారు సక్రమంగా నిర్వర్తించగలగడం.

   - మహాత్మాగాంధీ.

7. ఓ మంచి పని చేయడం వరకే మన పని. అలా మనకి నచ్చిన మంచిపని చేసేసి మనం ఊరుకోవాలి. ఆ పని తాలూకు బాగోగుల గురించి చర్చించుకోవలసింది మనం కాదు, ఇతరులు.

   - పైథాగరస్.

8. పసిపిల్లలకి మనం ఇవ్వవలసిన ప్రాముఖ్యం ఇవ్వగలిగితే, ఈ భూమ్మీద స్వర్గాన్ని అవతరింప చేసుకోవచ్చు. అసలు నిజమైన స్వర్గం పసిపాపల ఆనందంలోనూ, వారి సంపూర్ణ ఆరోగ్యంలోనూ తొణికిసలాడుతుంది.

   - గిజూబాయి.

**పోటీతత్త్వం**

1. ప్రతిభ అనేది ఒకే ఒక శాతం ప్రేరణ కల్గించడం..తక్కిన తొంభైతొమ్మిది శాతమూ అలా కల్గిన ప్రేరణ పరిశ్రమించడమే.

   - థామస్ ఎడిసన్.

2. వందలాది, వేలాది మైళ్ల ప్రమాణానికైనా ఆరంభం - ఒక్కడుగే.

   - ప్రాచీన చైనా దేశపు సామెత.

3. ఘనవిజయమంటే చిరుచిరు విజయాల సమూహమే.

   - జిగ్ జిగ్లర్.

4. అధములు ఆటంకాల భయం వల్ల ఏపనినీ ఆరంభించరు. మధ్యములు ఆరంభించి, ఆటంకాలు ఎదురవగానే ఆపేస్తారు మధ్యలో.

   ఉత్తములు మాత్రం ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆరంభించిన పనిని నెరవేర్చుకొనే దాక విశ్రమించరు.

   -భర్తృహరి.

5. అణువంత సాహసం మణుగుల కొద్దీ అదృష్టానికంటే ఎంతో గొప్పది.

   - జె.ఎ. గార్ఫీల్డ్

6. ఏ సమస్యకైనా పరిష్కారం ఆ సమస్యలోనే అంతర్గతంగా ఉంటుంది.

   - స్టాన్లీ అర్నాల్ట్.

7. దేవతలు సైతం శ్రద్ధను ఉపాసిస్తుంటారు. నిజానికి శ్రద్ధ వల్లనే అంతులేని ఐశ్వర్యం లభించేది ఎవరికైనా.

   - ఋగ్వేదం.

8. అపజయం అంటే నిజమైన ఓటమికాదు - ఆలశ్యంగానైనా జయంకోసం శ్రమించి, సాధన చేయాలి అని సూచించేదే.

   - సుద్దాల అశోక్‌తేజ.

**ఆర్థిక తత్త్వం**

1. అపారమైన సంపదలకి అధిపతి అయిన కుబేరుడైనా తన ఆదాయానికి మించి ఖర్చు చేస్తే నిరుపేద అవక తప్పదు.

   - చాణిక్యుడు.

2. ఓ వ్యక్తి ఎంత పేదవాడు లేదా ఎంత ధనవంతుడు - అనే విషయాన్ని నిర్ధారించగలిగేది, ఆ వ్యక్తి సంపాదన కాదు. ఆదాయం అసలేకాదు. ఆదాయానికీ, ఖర్చుకీ నడుమ ఉన్న తేడా మాత్రమే,

   - డేనియల్.

## ఆస్థికత్వం/ ఛాందసవాదం

1. ఎంతో ముఖ్యమైన సిద్ధాంతాలకీ పట్టూ విడుపూ ఉంటుంది. . . ఉండాలికూడ.

- అబ్రహాం లింకన్.

2. పొరపాటు పని చేయలేని వాడు జీవితంలో అసలు ఏ పనీ చేయలేడు.

-లింకన్.

3. మనిషి మంచి పని చెయ్యడానికి ఎటువంటి సమయమైనా ఎంతో మంచిసమయమే.

-మార్టిన్ లూథర్ కింగ్.

4. వ్రతాలంటే వేరే ఏమిటోకాదు. మనిషి ఆచరించ వలసిన వ్రతాలు మూడే మూడు, ఎవరికీ ద్రోహం చెయ్యకుండా ఉండడం, పాత్రత కల వారికి దానాలివ్వడం, ఇతరులతో సత్యం పలకడం.

- మహాభారతం.

5. మనిషి సాధారణంగా ప్రపంచంలో ఎంతో మంది తనని ఎన్నో విధాలుగా మోసగిస్తున్నారని ఫిర్యాదులు చేస్తుంటాడు. నిజానికి కాస్త ఆలోచిస్తే అర్థమయ్యే నిజం మాత్రం-మనిషి తనను తాను మోసగించుకున్నంతగా ఇంకెవరూ మోసగించలేరని.

- హెూరేస్ వాల్ పోల్.

## వక్తృత్వం

1. మాటలు మననోటి నుంచి వెలువడేదాక అవి మన అధీనంలో ఉంటాయి. ఒకసారి బయటికి వచ్చాక మనం వాటి అధీనంలో ఉండాల్సిందే.

- సోక్రటిసు

2. తెగ మాట్లాడేవారు ఓటి కుండల్లాంటి వారు. వారి దగ్గర ఏమీ నిలువ ఉండదు.

- జి. సిమన్స్

3. మనిషి మనిషిని పూజించడం మొదలిడితే భగవంతుణ్ణి పూజించడం ఆపేసినట్లే.

- మహాత్మాగాంధీ

4. సత్యం సత్యం అంటూ ఉంటూ, సత్యం అంటే ఏమిటో చెప్పమంటే తెల్లమొహం వేస్తారు. అసలు ప్రతి మనిషికీ తనూ, తను చేసే పనులు బాగా నచ్చడమే-సత్యం.

- మహాత్మాగాంధీ

## పౌరసత్వం/ బాధ్యతాతత్త్వం

1. మనం ఇతరులు మనతో ఎలా నడుచుకోవాలని కోరుకుంటామో, అదే విధంగా వారితో మనం నడుచుకోవాలి.

-బైబిలు.

2. జలమే అమృతం, జలం అన్నిరోగాలకు శత్రువు. అన్ని రోగాలనూ అంతం చేసే శక్తి దానికే ఉంది.

- ఋగ్వేదం.

## పౌరుషం

1. వీరులైనవారు తమవద్ద ఉన్న లెక్కకుమించిన సైనికుల ఆధారంతో యుద్ధం చేయరు. అసలు వాళ్లు యుద్ధం చేసేది తమ పౌరుషం కారణంగా.

- వేదవ్యాసుడు.

## పోట్లాడేతత్త్వం

1. ఏనుగులను అమ్ముకున్నాక, అంకుశాల కోసం పోట్లాడుకోకూడదు.

- మహాభారతం.

2. వివాదం చాల కాలంపాటు కొనసాగితే, ఇరు పక్షాలలోను తప్పులున్నాయని అర్థం.

## ఈర్ష్యాతత్త్వం

1. మనిషి స్వభావం విచిత్రం. ఎలాంటి స్థితిలో ఉన్న మనిషైనా, తనకంటే ఇతరులే ఎక్కువ సమృద్ధిలో ఉన్నారని, సుఖసంతోషాలతో తులతూగుతున్నారని భావిస్తూ ఉంటారు. పైగా తనకు అలాంటి మంచి స్థితి రావడం లేదని మరీమరీ వాపోతూ ఉంటాడు.

- సోక్రటీసు.

## మంచితనం

1. ఓ మనిషి మానసిక ఆరోగ్యం బాగుందనడానికి అసలైన నిదర్శనం అతనికి ప్రతి చోటా, ప్రతి మనిషిలోనూ మంచితనమే కనపడటం.

- ఎమర్సన్.

## పిరికితనం

1. పవిత్రత ఉన్నచోట నిర్భయత్వం నివాసం చేస్తుంది.

- మహాత్మాగాంధీ

## నిరాశావాదత్త్వం

1. అనుకూల వంతమైన ఐశ్వర్యం వరించినపుడు మనిషి తన స్వభావాదుల గురించి ఆత్మ పరిశీలన చేసుకోలేడు. కాని ప్రతికూల జీవన స్రవంతి అందుకు అవకాశం ఇస్తుంది. కనుక మనిషికి అదే నిజంగా లాభదాయకం.

- డాక్టర్ సామ్యూల్ జాన్సన్.

2 ఆరోగ్యం విలువ తెలిసేది అనారోగ్యంలోనే.

- శంకరాచార్యులు.

## కృతజ్ఞతత్త్వం

1. ఏ మనిషికైనా స్వర్గం అతని తల్లి పాదాల క్రిందనే లభిస్తుంది.

- మహమ్మద్ ప్రవక్త.

-సేకరణ, కూర్పు: ***బి. ఆశీర్వాదం,*** ఫ్యాకల్టీ.

విస్తరణ శిక్షణా కేంద్రం, బాపట్ల.

# శాపానుగ్రహ సమర్థుడు

# వేములవాడ భీమకవి

**వేములవాడ భీమకవి గోదావరి మండలంలో నివసించిన కవి. ఈయన నియోగి బ్రాహ్మణుడు. తూర్పు గోదావరి జిల్లాలో దాక్షారామం అనే పుణ్యక్షేత్రముంది. ఇది పంచారామాలలో ఒకటి. అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన మాణిక్యాంబ శక్తిపీఠం ఇక్కడే ఉంది. దాక్షారామానికి సమీపంలోనే వేములవాడ అనే గ్రామం ఉంది. భీమకవి ఆ గ్రామానికి చెందినవాడు. ఈ మహాకవి శాపానుగ్రహ సమర్థుడు. ఈయన ఏదయినా ఒక మాట అంటే అది శాపంగానో, వరంగానో మారుతుంది. అంతటి గొప్పవాడు.**

ఈ మహాకవి నన్నయకు పూర్వుడని, నన్నయకు సమకాలికుడని, తిక్కన కాలానికి సమీపంలోనివాడని విశ్లేషకులు పలు రకాలుగా వివరించారు. మంచి మధుర పదార్థాన్ని తినేటప్పుడు దీన్ని తయారు చెయ్యడానికి వాడిన వస్తువులు ఏ ఊళ్ళో, ఎవరిపొలంలో పండాయి? ఈ మొదలైన ప్రశ్నలనవసరం. పదార్థం యొక్క రుచి ప్రధానం.

పూర్వకాలపు కవులను గురించి కాని, రాజుల పరిపాలనను గురించి కాని తెలియజేసేవి ముఖ్యంగా శాసనాలు, కవుల గ్రంథాలు. సమకాలికుల ప్రశంసలు. ఈ పరంపరలోనే భీమకవి జన్మ వృత్తాంతాన్ని గరించి ఒక ఆసక్తికరమైన కథ ఉంది.

వేములవాడ గ్రామంలో సోమన్న అనే ఒక పేద బ్రాహ్మణుడున్నాడు. ఆయన నియోగిశాఖకు చెందినవాడు. సోమన్న అనారోగ్య కారణాల వల్ల చిన్నతనంలోనే శివసాయుజ్యం పొందాడు. ఆతని భార్య యౌవనవతి. పైగా అమాయకురాలు. పదిమందికి సహాయం చేస్తూ, గుట్టుగా తన జీవనాన్ని గడుపుకొంటోంది. ఆమెకు సంతానం కూడా లేదు. ఒంటరి బ్రతుకు.

ఈ విధంగా కాలం గడచిపోతూ ఉంది. కొన్నాళ్ళకు శివరాత్రి మహాపర్వదినం వచ్చింది. ఆ గ్రామంలోని స్త్రీలు కొందరు దాక్షారామంలోని భీమేశ్వరుని దర్శించుకోవడానికి బయలుదేరారు. వారితోపాటు, సోమన్న భార్య కూడా దాక్షారామం వెళ్ళింది. ఆమెతో వచ్చిన స్నేహితురాండ్రు స్వామి వారికి తమ తమ కోరికలు చెప్పుకొని మ్రొక్కుకున్నారు. అమాయకురాలైన సోమన్న భార్య "భీమేశ్వరా ! ఒంటరిబ్రతుకు బ్రతుకుతున్నాను. వంశాన్ని నిలబెట్టే ఒక కుమారుణ్ణి అనుగ్రహించు. పుట్టెడు నీళ్ళల్లో నీకు దీపం వెలిగిస్తాను" అని మ్రొక్కుకుంది. ఈ మ్రొక్కుబడి విని ఆమెతో వచ్చిన మగువలంతా తెగ విరగబడి నవ్వారు.

"పిచ్చిదానా ! నీకు భర్త లేడు. విధవరాలివి. భర్తతో కాపురం చెయ్యకుండా పిల్లలు ఎలా పుడతారు. నీ వింత కోరిక ఈ జన్మలో నెరవేరదు" అంటూ వేళాకోళం చేశారు.

అపుడామె, "అదేమో నాకు తెలియదు. నాకో కొడుకు కావాలి. ఆ భీమేశ్వరుడే అనుగ్రహిస్తాడు" అంది. ఈ అమాయకత్వానికి వాళ్ళు మళ్ళీ నవ్వుకున్నారు.

కొంతకాలం జరిగింది. ఆమె గర్భవతి అయింది. భర్తలేని స్త్రీ, పైగా విధవరాలు గర్భవతి అయిందంటే లోకం ఊరుకుంటుందా? కాకుల్లా పొడిచింది. ఇదంతా దాక్షారామ భీమేశ్వరుని దయ అని ఒక్కమాటలో కారణం వివరించిందామె. నవమాసాలు నిండాయి. సోమన్న భార్య ఒక మగశిశువునకు జన్మనిచ్చింది. ఆ రోజు ప్రభవ సంవత్సరం, శ్రావణమాసం, శుక్లపక్ష శుక్రవారం నాటి హస్తా నక్షత్రా కన్యాలగ్నం - అని ఒక సీసమాలిక వలన తెలుస్తోంది.

అమ్మలక్కలంతా ఆమెకు వ్యభిచార దోషం అంటగట్టారు. చదువుకొన్న పెద్దలంతా ఆమెను సంఘం నుండి వెలివేశారు. ఎవరూ ఆమెను ఏ పనిలోకి రానివ్వకుండా కట్టడి చేశారు. పాపం ఆమె బ్రతుకు భారంగా గడుపుతోంది. ఆమె తన కుమారునకు భీమన్న అని పేరు పెట్టింది.

కదలిపోతున్న కాలచక్రంలో భీమన్నకు అయిదు సంవత్సరాల వయసు వచ్చింది. కాస్త ఊహ తెలుస్తోంది. తన ఈడు బాలురతో ఆడుకోడానికి వెడితే, "నీవు గోళకుడవు, విధవకు పుట్టినవాడవు. మాతో నిన్ను కలుపుకోము పో" అని గద్దించి పంపించేశారు.

## తెలుగు సాహిత్య చరిత్ర

భీమన్న ఇంటికి వచ్చి "అమ్మా! తోటివారు నన్ను ఆటలలో తమతో కలుపుకోవడం లేదు. నాకు నాన్న లేడని గేలి చేస్తున్నారు. వాళ్ళందరకు నాన్నలున్నారు. నాకే ఎందుకు లేడు. చెప్పమ్మా!" అని కన్నీళ్ళు పెట్టుకొన్నారు.

అపుడామె, "ఎవరేమన్నా నీవు బాధపడకు. ఎవరు నమ్మినా, నమ్మకపోయినా, దాక్షారాంలోని భీమేశ్వరుడే నీ తండ్రి" అని చెప్పింది.

భీమన్న వేములవాడ నుండి హుటాహుటిన దాక్షారామం చేరుకున్నాడు. భీమేశ్వరాలయానికి వెళ్ళాడు. అక్కడున్న భీమశంకరుని చూశాడు. ఆ శివలింగాన్ని గాఢంగా కౌగిలించుకున్నాడు.

"నువ్వే నా తండ్రివని అమ్మ చెప్పింది. కానీ నీ వొక్కసారి కూడా నన్ను చూడ్డానికి రాలేదు. నాకు నీవు కనబడేదాకా ఇక్కడ నుండి కదల ను. నీ ముందే ఈ శివలింగానికి తలబాదుకొని మరణిస్తాను" అని భీమేశ్వర శివలింగానికి తలబాదుకోసాగాడు.

కరుణామూర్తి, దయాళువు అయిన భోళాశంకరుడు భీమన్నకు ప్రత్యక్షమయ్యాడు. తల నిమిరాడు.

"నాయనా ! భీమన్నా!" అని పలుకరించాడు.

"నేనే నీ తండ్రిని. నీవు వరప్రసాదివి. నిన్నవమానించిన వారు నేటి నుండి తప్పు చేశామని బాధపడతారు. నీవు ఆడింది ఆటగా, పాడింది పాటగా నెరవేరుతుంది. వాణి నీ నాలుక మీద నిలిచి ఉంటుంది.

నిన్ను సదా సంరక్షిస్తుంది'' అని ఆశీర్వదించాడు.

ఆ ఆనందంతో భీమన్న దాక్షారామం నుండి వేములవాడకు బయలు దేరాడు. ఆనాడొక బ్రహ్మణుని ఇంట్లో బ్రాహ్మణ సంతర్పణ జరుగుతోంది. భీమన్న కూడా భోజనానికి వెళ్ళాడు. కాని శ్రోత్రి యులైన బ్రాహ్మణులు, ''మీ అమ్మ బ్రాహ్మణాన్ని మంట గలిపింది. నీవు మాతో భోజనానికి తగవు. పో. బయటకు పో'' అంటూ అక్కడి వారు భీమన్నను బయటకు గెంటేశారు.

పాపం భీమన్న నడుస్తూ, కళ్ళునులుముకుంటూ ఆ ఇంటి అరుగు మీద కూర్చున్నాడు. కొంచెం సేపటికి, అసలు లోపల ఏం జరుగుతుందో చూద్దామని తలుపు సందుల నుండి చూశారు. ఓహ్! రకరకాలైన వంటకాలు చూస్తే భీమన్నకు నోరూరిపోతోంది. వారి విస్తళ్ళల్లో తెల్లని అన్నం, పప్పుకూరలు, అప్పాలు కనబడ్డాయి. వెంటనే భీమన్న ''మీ అన్నం సున్నంగాను, అప్పాలు కప్పాలుగాను'' అంటూ ఏడవసాగాడు.

ఇంకేముంది ! విస్తళ్ళల్లోని అన్నం సున్నం ముద్దగా మారిపోయింది. అప్పాలు కప్పలై పోయాయి. బెకబెకమంటూ ఒకరి విస్తరి నుండి మరొకరి విస్తరిలోకి దుముకసాగాయి. అన్నం తినడానికి సిద్ధంగా ఉన్న బ్రహ్మణులు ఈ విపరీత పరిస్థితికి విస్తుపోయారు. ఇలా ఎందుకు జరిగిందా? అని సందిగ్ధంలో పడ్డారు. అంతలో 'మీ అన్నం సున్నంగాను, అప్పాలు కప్పలుగాను' అంటూ ఏడుస్తున్న భీమన్న మాటలు వినబడ్డాయి. బ్రాహ్మణులు తలుపు తీశారు. ఏడుస్తున్న భీమన్నను చూశారు. అతని మాటలు విన్నారు. వెంటనే వారికి విషయం అర్థమయింది. భీమన్నను బుజ్జగిస్తూ ''భీమన్నా ! నీవు కూడా మాతో కలిసి భోజనం చేద్దువుగాని. నీవు అన్నటువంటి మాటల్ని మార్చి చెప్పు'' అని బ్రతిమాలారు. ఆ కుటుంబం మీదున్న నిషేధాన్ని ఎత్తేశారు. అపుడు భీమన్న ''మీ విస్తళ్ళలోని సున్నం అన్నంగాను, ఎగురుతున్న కప్పలు అప్పాలుగాను'' అన్నాడు.

అంతే సున్నం అన్నంగా మారింది. ఎగురుతున్న కప్పలు ఎక్కడివక్కడే అప్పాలై క్రిందపడ్డాయి. బ్రాహ్మణులు సంతోషించారు. భీమన్నను సహ పంక్తిలో కూర్చోబెట్టుకొని భోజనాలు చేశారు.

ఈ వార్త అలా అలా చుట్టుప్రక్కలకు ప్రాకింది. భీమన్న వాక్‌కు గల శక్తి అందరకు తెలిసింది. భీమన్న ప్రతిభావంతుడయ్యాడు. దాక్షారామ భీమేశ్వరుని అనుగ్రహం వలన మంచి కవి అయ్యాడు. మంచికవి అనడం కంటే, మంచి తిట్టుకవి అయ్యాడు. ఆతడన్న దానికెదురు చెప్పేవాళ్ళే లేకపోయారు. భీమకవి మీద భక్తి కన్నా ప్రజలకు భయమే ఎక్కువైంది. అక్కడి నుండి భీమకవి, రాజమహేంద్రవరం బయలుదేరాడు.

రాజమహేంద్రవరాన్ని శ్రీ రాజరాజ నరేంద్రుడు పరిపాలిస్తున్నాడు. రాజరాజనరేంద్రుని కోరిక మేరకు నన్నయభట్టు వ్యాసభారతాన్ని తెలుగులో వ్రాస్తున్నాడు. అప్పటికే భీమకవి 'రాఘవ పాండవీయము' అనే పేరుతో ఒక గ్రంథం రచించాడు. అందులో ఒక పద్యంలోనే రామాయణార్థము, భారతార్థము వస్తాయి. పదాల విరుపు, శ్లేషతో కూడిన కవిత్వం సాగుతుంది. రాజరాజనరేంద్రుని దర్శనం లభిస్తే, తన కావ్యం విస్తృత ప్రచారం పొందుతుందని భీమన్న భావించాడు. రాజదర్శనం చేయించమని, తన కావ్యాన్ని మహారాజునకు అంకితం చేయించమని భీమన్న, నన్నయను కోరాడు. నన్నయభట్టు ఆ గ్రంథాన్ని తాను చూచి, రాజునకు తెలియజేస్తానని, కొన్నాళ్ళ తర్వాత తనను కలుసుకొమ్మని భీమన్నకు చెప్పాడు.

రాజరాజు కోరిక మేరకు తాను వ్రాస్తున్నది భారతం మాత్రమే. ఒకవేళ భీమన్న రచించిన రాఘవ పాండవీయాన్ని రాజరాజనరేంద్రునకు చూపిస్తే, తన భారత గ్రంథాన్ని మహారాజు నిరాదరిస్తాడేమోనని నన్నయ భయపడ్డాడు. ఆ కారణంగానే, భీమన రచించిన గ్రంథాన్ని రాజరాజునకు చూపించలేదు.

కొన్ని రోజులు గడిచాయి. భీమన్న, నన్నయను కలిశాడు. నన్నయ ఏవో సాకులు చెప్పాడు. భీమన్న అనేక పర్యాయాలు, నన్నయ భట్టారకుని కలిశాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఒకసారి, నన్నయగారి ఇంటికి వచ్చిన భీమకవి ''అమ్మా ! నన్నయగారున్నారా?'' అని ఆయన సతీమణిని అడిగాడు.

''ఉన్నారు. అరణ్యపర్వంలో ఉన్నారు. ఎవరూ ప్రస్తుతం ఆయనను కలిసే వీలులేదు'' అని చెప్పింది.

''అలాగా ! అలాగే కానీ, ఇక ఆయన అరణ్యంలోనే ఉంటారు. ఆ మధ్య నుండి మన మనమధ్యకు రారులే'' అని వెళ్ళిపోయాడు.

ఆ మాట శాపమై నన్నయభట్టు రచన అరణ్యపర్వం మధ్యలోనే ఆగిపోయింది. నన్నయ భారతాన్ని సంపూర్ణంగా వ్రాయకపోయినందుకు ఇదొక కారణమని విశ్లేషకులు చెబుతారు.

భీమన్న, రాజులపైన, సంస్థానాధీశులపైన కవిత్వం చెబుతూ జీవనం గడుపుకొన్నాడు. తన గ్రంథ రచనకు సాయపడే రాజులు కాని, కవిపోషకులు గాని లేకపోవడమే దీనికి కారణం. తనను గౌరవించని వారిని, ఆదరించని వారిని శాపాలకు గురి చేసేవాడు. అందుకని భీమన కవిని చాలామంది 'తిట్టు కవి' అని పిలిచేవారు. కొందరైతే 'కవి రాక్షసుడు' అనేవారు. కవి రాక్షసుడు అనే పేరుతో మరొక కవి ఉన్నాడు. ఆయనను గూర్చి ఆ సందర్భం వచ్చినపుడు చెప్పుకుందాం. ఈ కవి తానెక్కడకు వెళ్ళినప్పటికీ దాక్షారామ భీమేశ్వరుని నందనుడననియే చెప్పుకొనెడి వాడు. దానికి ఈ క్రింది పద్యమే సాక్ష్యము.

*'ఘనుడన్ వేములవాడ వంశజుడ దక్షారామ భీమేశనం*
*దనుడన్ దినుడన్ దివ్య విషామృతప్రకట నానాకావ్య ధుర్యుండ భీ*
*మన నాపేరు. వినంగ జెప్పితి. తెలుంగాధీశ! కస్తూరికా*
*ఘన సారాది సుగంధ వస్తువులు వేగందెచ్చి లాలింపురా!'*

కవి, పండితుడు, పైగా బ్రాహ్మణుడు అయిన కారణంగా ఎంత పెద్దవాడైనా తనను కస్తూరి, పచ్చ కర్పూరం మొదలైన సుగంధ ద్రవ్యాలతో కూడిన తాంబూలంతో సత్కరించాలని ఈయన భావనం అలా సత్కరించలేదో వాడి పని అయిపోయినట్లే.

భీమకవి ఒక పర్యాయం రాజకళింగ గంగు అనే రాజు దగ్గరకు వెళ్ళాడు. తాను వచ్చినట్లుగా రాజప్రతినిధి చేత రాజ కళింగ గంగుకి వర్తమానం పంపాడు. ఆ సమయానికి మహారాజేదో కార్యక్రమంలో ఉన్నాడు. భీమకవికి దర్శనమిచ్చి సంభాషించే పరిస్థితిలో లేడు. అందు చేత, ''ఇప్పుడు సందడిగా ఉంది. సందడి తీరిన తర్వాత రమ్ము,'' అని తిరిగి వర్త మానం పంపాడు. ఇంకేముంది. భీమకవి అగ్గిమీద గుగ్గిలమై పోయాడు. కోపంతో కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. వెంటనే,

*''వేములవాడ భీమకవి వేగమె చూచి కళింగ గంగు తా*
*సామము మాని కోపమున సందడి తీరిన రమ్ము పొమ్మనెన్*
*మోమును జూడ దోషమిక ముప్పదిరెండు దినంబులా వలన్*
*జామున కర్థమందతని సంపద శత్రులజేరుగావుతన్''*

అని శపించి వెళ్ళిపోయాడు.

"వేములవాడ భీమకవి అనే నేను వస్తే, రాజకళింగ గంగు ప్రస్తుతం సందడిలో ఉన్నాను. సందడి తీరిన తర్వాత రమ్మన్నాడు. ఇక వాడి ముఖం చూస్తే దోషం వస్తుంది. కనుక ఈనాటికి ముప్పదిరెండు రోజులు దాటిన నాటి అర్ధరాత్రిలాగా రాజ కళింగ గంగు సంపద, అంటే రాజ్యం శత్రువులకు చిక్కుగాక!" అని శపించాడు. అంతే తిట్టు (శాపం) కవిత్వంలో దిట్ట అయిన భీమన పలుకు ఫలించింది. భోగాలనుభవించిన రాజ కళింగ గంగు దిక్కులేని వాడయ్యాడు. తిండికి లేనివాడయ్యాడు. దేశదిమ్మరియై సంచరించ సాగాడు.

ఆ సంచారంలో ఒక నాటి రాత్రి వేళ వేములవాడ భీమకవి యింటి ముందున్న గోతిలో పడిపోయాడు. ఇటువంటి దుస్థితి దాపురించిందని ఎంతగానో చింతించాడు. ఆ సమయంలో రాత్రి భోజనం ముగించుకొని వచ్చిన భీమన్న ఆ గోతి దగ్గరకు వచ్చి చేతులు కడుకున్నాడు. పుక్కిలించి నీళ్లుమిశాడు. అవి రాజకళింగ గంగుమీద పడ్డాయి. ఆ విధంగా ఎంగిలి నీళ్ళు మీద పడినందుకు కళింగ గంగు చిరాకు పడ్డాడు. కేకలు వేశాడు. ఆ అరుపులు విని, "ఎవరది?" అని గద్దించాడు గంగు.

"నేనా! నేను వేములవాడ భీమకవి చేసిన జోగిని" అని సమాధానమిచ్చాడు ఆ సమాధానం విన్న భీమకవికి గోతిలో ఉన్న దెవరో అర్థమైంది. శాపానుగ్రహపాత్రుడు కనుక, రాజకళింగగంగు మీద కాస్త కరుణ కలిగింది.

*"వేయి గజంబులుండ పదివేల తురంగములుండ నాజిలో*
*రాయల గెల్చి సజ్జ నగరంబున పట్టము గట్టుకోవడిన్*
*రాయ కళింగ గంగ ! కవిరాజు భయంకరమూర్తి చూడ దా!*
*బోయిన మీన మాసమున బున్నమ పోయిన షష్ఠి నాటికిన్"*

అని అనుగ్రహించాడు. మీనమాసమంటే ఫాల్గుణ మాసం. ఇంగ్లీషు నెలల ప్రకారం ఇది మార్చి నెల అవుతుంది. కనుక, ఫాల్గుణ మాసంలో కృష్ణపక్షంలో షష్ఠి నాటికి తిరిగి నీవు శత్రురాజును జయించి మహారాజువవుదువుగాక!" అని ఆశీర్వదించాడు.

ఆ సమయంలో రాజకళింగగంగును జయించి మహారాజు, తన విజయోత్సవాలను జరిపిస్తున్నాడు. అదే సమయానికి తానెవరో గుర్తు పట్టకుండా ఉన్న రాజ కళింగ గంగు సజ్జ నగరం చేరుకొన్నాడు. వీధి భాగవతులు నాటకం ప్రదర్శించవలసి ఉంది. భాగవతుల కోరిక మీద రాజకళింగ గంగు, కళింగ గంగు పాత్రనభియించడానికి అంగీకరించాడు. అయితే, కళింగ గంగు యొక్క ఖడ్గం కావాల న్నాడు. శత్రురాజు, నాటకమే కదా ! అని ఖడ్గమిచ్చాడు. చక్కగా అలంకరించుకొని, ఆయన చూపరులకు రాజకళింగ గంగులాగే కనబడ్డాడు. వేషం చాలా బాగా కుదరిందనుకున్నాడు. శత్రురాజు కూడా ప్రేక్షకుల్లో కూర్చున్నాడు. నాటకం జరుగుతోంది. రాజ కళింగ గంగు విజృంభించి, శత్రురాజు తల నరికేశాడు. అనంతరం తన సింహాసనం అధిష్ఠించాడు, ఈ విధంగా వేముల వాడ భీమకవి చేత శపించబడి, రాజ్యం పోగొట్టుకొని తిరిగి ఆయప అనుగ్రహంతోనే రాజ కళింగ గంగు తన రాజ్యాన్ని పొందగలిగాడు. కవులు, బీజాక్షరాలతో కవిత్వం చెప్పగల సమర్థులు. అందులోను భీమకవి, దాక్షారామ భీమేశ్వరుడు అనుగ్రహంతో జన్మించినవాడు.

చాళుక్య వంశంలోని వాడైన చొక్క భూపాలుడు రాజ్యం చేస్తున్నప్పుడు భీమకవి ఒక పర్యాయం ఆయనను దర్శించాడు. అప్పుడు చొక్కరాజు ఉద్యానవనంలో మల్లెసాల స్తంభంమీద కాలు చాచుకొని కూర్చున్నాడు. అప్పుడు తన దగ్గరకు వచ్చిన భీమకవిని చూశాడు. "నీవు ఏదంటే అది అవుతుందట కదా ! నేను ఈ మల్లెసాల మీద స్తంభం మీద కాలు చాపుకున్నాను. ఎండిపోయిన ఈ స్తంభాన్ని తిరిగి వృక్షంగా మార్చగలవా? మార్చు. చూస్తాను" అన్నాడు. ఇదే కావాలని కొరివితో తలగోక్కోవడమంటే. భీమకవి, మీరు కోరినట్లే చేస్తా" అని,

*'ఆ నీతాభ్యుపదాన శృంఖల పదాభ్యాలం బితస్తంభమా*
*నేనే వేములవాడ భీమకవి నేనిన్ జిత్రకూటంబుల్*
*ఘూ నవ్యాపిత పల్లవోద్భవ మహాపుష్పోపగుచ్ఛంబులన్*
*నానాపక్వ ఫలప్రదాయ వగుమా నా కాల్ప వృక్షాకృతిన్'*

అన్నాడు. అంతే ఆ పందిరిగుంజ కొమ్మలతో, రెమ్మలతో, ఆకులతో, చిగుళ్ళతో, పిందెలతో, కాయలతో, పండ్లతో ఆవిర్భవించింది. అంతేనా, చొక్కరాజు కాలు పందిరి గుంజలో చిక్కుకుపోయింది. కవి ప్రతిభకు ఆశ్చర్యపోయాడు. ఆ పైన భయపడ్డాడు. ఇరుక్కుపోయిన కాలు ఎంత కదలించినా కదల్లేదు. ఆ దృశ్యాన్ని చూచిన వారంతా అవాక్కయిపోయారు. మాను చిగురించడమా? ఫలపుష్పాలతో నిండిపోవడమా? మానుపై పెట్టిన కాలు కదలించలేకపోవడమా? భీమకవి గొప్పతనాన్ని తెలుసుకుని చొక్క భూపాలుడు తిరిగి కాలు స్వాధీనమయ్యేటట్లు చెయ్యమని కవిని ప్రార్థించాడు. భీమకవి, చొక్కరాజు దీనావస్థను చూసి,

*"శంభువర ప్రసాద కవి సంఘు వరేణ్యుడనైన నా వచో*
*గుంభన చేయనెంతో యనుకూలత నొంది తనూన భావవన్*
*గుంభిని చొక్క నామ నృపకుంజరు పందిటి మల్లెసాలకున్*
*స్థంభము రీతినీ తనువు దాలిచి యెప్పటియట్లు నుండుమా !"*

అని ఒక పద్యం చెప్పాడు. అంతే, మంత్రం వేసినట్లుగా, చిగురించిన చెట్టు మాయమైంది. పందిరిగుంజ యధాప్రకారంగా ఉంది. వెంటనే చొక్కరాజు తన కాలు బయటకు తీసేసుకున్నాడు. ఈ రెండు అపూర్వ సన్నివేశాలు చూచిన అక్కడి జనం భీమకవి ప్రతిభకు ఆశ్చర్యపడ్డారు.

భీమకవి నృసింహపురాణాన్ని, శతకంఠ రామాయణమను గ్రంథాన్ని, రాఘవపాండవీయమను మరియొక గ్రంథాన్ని రచించినట్లు తెలుస్తోంది - కాని, ఈ గ్రంథాలలోని కొన్ని పద్యాలు మాత్రమే ఉదాహరణలుగా లభిస్తున్నాయి. శ్రీకృష్ణదేవరాయల వారి అష్టదిగ్గజ కవులో ఒకడైన పింగళి సూరన కూడా రాఘవపాండవీయము అను ద్వ్యర్థి కావాన్ని రచించాడు. "తనకన్నా పూర్వుడైన వేములవాడ భీమకవి రాఘవపాండవీయము అను గ్రంథాన్ని రచించాడని పెద్దలు చెబుతారు. కాని ఆ గ్రంథం లభించలేదు" అని పింగళి సూరన తన గ్రంథంలో ఉటంకించాడు.

ఈ కాలంలో ఎన్నో పుస్తక సంరక్షణ కార్యకలాపాలున్నప్పటికీ, ఎన్నో వంతులు చెదలకాహారమై పోయాయి.

ఆకాలంలో తాళ పత్ర గ్రంథాల మీద రచించిన కావ్యాలు భీమకవి కావ్యాల మాదిరిగా, తగిన పోషణ, రక్షణ లేక కాలగర్భంలో కలిసిపోయి ఉంటాయి.

ఏది ఏమయినా తెలుగు సాహిత్య చరిత్రలో వేములవాడ భీమకవి తనదంటూ ఒక ముద్ర వేశాడు. కవిగా, తిట్టు కవిగా, శాశ్వతంగా నిలిచిపోయి, చిరంజీవి అయ్యాడు.

*- వారణాసి వేంకటేశ్వర శాస్త్రి*



# 'ఈదుల్ ఫిత్ర్' పర్వదిన వేడుక

## ఆనంద పతాక - సామరస్య ప్రతీక

**పండుగలు జాతులు, సముదాయాల చరిత్రను, వారి విశ్వాసాలను, వారి ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తాయి. ప్రతి జాతికి, ప్రతి సముదాయానికీ ఇలాంటి కొన్ని ప్రత్యేక పర్వదినాలు ఉంటూనే వచ్చాయి. ఆ రోజుల్లో ఆయా జాతి, సముదాయాల ప్రజలు తమ స్థోమత మేరకు మంచి మంచి వస్త్రాలు ధరించడం, రుచికరమైన వంటలు వండడం చేస్తారు. ఇతర పద్ధతుల ద్వారా కూడా తమ అంతరంగిక ఆనందాన్ని వ్యక్తపరుస్తారు. ఇది మానవ సహజం. అందుకే మానవజాతి చరిత్రలో పండుగలూ, పబ్బాలూ లేని వర్గమంటూ ఏదీ లేదు. ప్రతి సముదాయానికీ ప్రత్యేక పర్వదినాలు లేక సంతోష దినాలు ఉంటూనే వచ్చాయి.**

### ఇస్లాంలో

ఇదే విధంగా ఇస్లాం ధర్మంలో కూడా ఇలాంటి పర్వదినాలు రెండున్నాయి. ఒకటి 'ఈదుల్ ఫిత్ర్', రెండోది 'ఈదుల్ జోహా'. ఇవి రెండు ముస్లిముల సామాజిక, ఆధ్యాత్మిక పర్వదినాలు. మహమ్మద్ ప్రవక్త (స) మక్కా నుండి మదీనా వలస రావడంతో ముస్లిముల సామూహిక జీవితం మొదలైంది. 'ఈదుల్ ఫిత్ర్', 'ఈదుల్ అజ్‌హా' పర్వదినాల పరంపర కూడా అప్పటి నుండే ప్రారంభమైంది. సాధారణంగా ఈదుల్ ఫిత్ర్‌ను 'రమజాన్' పండుగ అని, ఈదుల్ అజ్‌హాను 'బక్రీద్' పండుగ అని వ్యవహరిస్తారు. 'రమజాన్' అనగానే దాదాపుగా అందరికీ సేమియా పాయసమే గుర్తుకొస్తుంది. నగరవాసులకైతే సేమియాతో పాటు 'హలీమ్', 'హరీస్' లాంటి వంటకాలు నోరూరిస్తాయి.

రమజాన్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తి ప్రపత్తులతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఎందుకంటే



ఇది ఒకనాటి ఆనందం కాదు. నెల్లాళ్ళు సంతోషం. ఈ నెల్లాళ్ళూ ముస్లింల ఇళ్ళు, వీధులు సేమ్యా, షీర్‌ఖుర్మా, బగారా, బిరియానీల ఘుమఘుమలతో, ఉల్లాస పరవళ్ళ హడావిడితో కళకళలాడుతుంటాయి. 'సహెరి', 'ఇఫ్తార్'ల సందడితో, నిత్యనూతనంగా, కొత్తశోభతో అలరారుతుంటాయి. మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, ప్రేమామృతాన్ని చిలకరిస్తూ, వింత అనుభూతుల్ని పంచుతుంటాయి. భక్తులు పవిత్ర గ్రంథ పారాయణంలో, 'తరావీ' నమాజుల తన్మయత్వంలో ఓలలాడుతూ ఉంటారు. నిజం చెప్పాలంటే, ఇలాంటి అనుభూతులు, అనుభవాలు, ఆనందాలు, అహ్లాదాల సమ్మేళనాన్నే పండుగ' అనడం సమంజసం, సముచితం. ఇలాంటి ఓ అపూర్వ సందర్భమే 'ఈదుల్ ఫిత్ర్' అంటే రమజాను పండుగ.

## రమజాన్ ఘనత

అసలు 'రమజాన్' అన్నది పండుగ పేరు కాదు. అదొక మాసం పేరు. సంవత్సరంలోని పన్నెండు మాసాల్లో తొమ్మిదవ మాసం పేరు 'రమజాన్'. అయితే దైవం మానవుల కోసం మార్గదర్శక సూత్రాలు అవతరింపజేయడానికి, అత్యుత్తమ ఆరాధనా విధానమైన 'రోజా' (ఉపవాసవ్రతం)ను విధిగా చేయడానికి ఈ మాసాన్ని ఎన్నుకున్నాడు.

అందుకే ఈ మాసానికి ఇంతటి ఔన్నత్యం, ఘనత ప్రాప్తమైంది. మానవుల సన్మార్గ ప్రదాయిని అయిన పవిత్రఖురాన్, ఉపవాస వ్రతంతో ఈ మాసానికి విడదీయరాని అనుబంధం ఉంది. ఈ విషయాన్ని దైవం తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు.




*“విశ్వసించిన ప్రజలారా! పూర్వ ప్రవక్తల అనుయాయులపై ఉపవాసాలు ఎలా విధిగా నిర్ణయించబడ్డాయో, అలాగే మీపై కూడా విధిగా నిర్ణయించబడ్డాయి. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది”.*

*“పవిత్ర ఖురాన్ అవతరించిన మాసం రమజాన్ మాసం. అది సమస్త మానవాళికి సంపూర్ణ మార్గదర్శకం. సన్మార్గం చూపే, సత్యాసత్యాల ను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయ్”*

*(2-183,85)*

## సన్మార్గ దీపిక

వాస్తవానికి పవిత్ర ఖురాన్ అవతరణ మామూలు విషయం కాదు. దేవుని అనంతమైన కరుణా కటాక్షాలకు ఇది నిలువెత్తు నిదర్శనం. ఎందుకంటే, ఈ గ్రంథ రాజం యావత్తు మానవజాతికి సన్మార్గ బోధన చేసి, రుజుమార్గాన నడిపించడానికి అవతరించినటువంటి ప్రబోధనా జ్యోతి. పవిత్ర ఖురాన్ రూపంలో అవతరించిన సృష్టికర్త మహదానుగ్రహం దానవుడి లాంటి మానవుణ్ని దైవదూత గుణసంపన్నుడిగా మలిచింది. అజ్ఞానం, అంధకారాల కారుచీకట్ల నుండి వైజ్ఞానపు వెలుగుబాటకు తీసుకు వచ్చింది. నైచ్యపు అగాధాల్లోంచి పైకిలాగి, పవిత్రతా శిఖరాల పై నిలబెట్టింది. మనుషుల్లోని పశు ప్రవృత్తిని మానవత్వపు పరిమళంతో పారద్రోలింది. వారి ఆటవికతను నాగరికతతో, అజ్ఞాన తిమిరాన్ని జ్ఞాన దీపికతో, అవివేకాన్ని వివేకంతో తరిమికొట్టి సర్వతోముఖంగా, మానవోత్తములుగా తీర్చిదిద్దింది.

## అనంత అనుగ్రహాలు

మనం ఒక్కసారి మనసుపెట్టి ఆలోచిస్తే మానవులపై దేవుని అనుగ్రహం ఎంత గొప్పదో అర్థమవుతుంది. అంతేకాదు, ఆయన తన అపార ప్రేమానురాగాలతో మానవ మనుగడ కోసం లెక్కలేనన్ని ఏర్పాట్లు చేశాడు. అసలు ఒక్కమాటలో చెప్పాలంటే, సమస్త సృష్టీ మానవుడి కోసమేనంటే అతిశయోక్తి కాదు. అనంతమైన ఆయన కారుణ్యాను గ్రహాలను లెక్కించడం గాని, వర్ణించడం గాని ఎవరితరం? సృష్టిలోని వృక్షాలన్నింటినీ కలాలుగా మలచి, సముద్ర జలాలన్నింటినీ సిరాగా మార్చి దైవానుగ్రహాలను గనక రాయడానికి ప్రయత్నిస్తే, వృక్షాలు అంతరించిపోతాయి. సముద్రజలాలు ఇంకి, అడుగంటిపోతాయి గాని దైవానుగ్రహాలు మాత్రం అలానే మిగిలి ఉంటాయి. ఇంతటి అనుగ్రహశీలి కనుకనే దైవం మానవుల ఆధ్యాత్మిక, నైతిక మార్గదర్శకత్వం కోసం రమజాన్ మాసంలో పవిత్ర ఖురాన్ లాంటి మహదానుగ్రహాన్ని ప్రసాదించాడు.

## క్రమశిక్షణా జీవితం

మరో విషయం ఏమిటంటే, రమజాన్‌లోని ప్రధాన ఆరాధన 'రోజా' (ఉపవాసవ్రతం) మానవుల్లో దైవభక్తిని, దైవభీతిని, సదాచారాన్ని, మానవీయ విలువల్ని జనింపజేయాలని దైవం ఈ వ్రతాన్ని విధిగా చేశాడు. దైవాదేశపాలనకు మనిషిని బద్ధునిగా చేయడమే ఈ వ్రతం యొక్క అసలు ఉద్దేశ్యం. ఒక నిర్ణీత సమయానికి మేల్కొనడం, ఉషోదయానికి ముందే వేళకానివేళ భుజించడం, సాయంత్రం సూర్యాస్తమయం వరకు పచ్చి మంచినీళ్ళయినా ముట్టకుండా రోజా ఐదుసార్లు దైవారాధన చేస్తూ, సూర్యాస్తమయం తరువాత రోజా వ్రతాన్ని విరమించడం, మితాహారం తీసుకోవడం, కొద్దిసేపటి విశ్రాంతి అనంతరం మళ్ళీ 'ఇషా' నమాజు, ఆ వెంటనే అదనపు 'తరావీహ్' ప్రార్థనలు చేయడం, మళ్ళీ తెల్లవారు జామున లేవడం. - ఈ విధంగా రమజాన్ ఉపవాసవ్రతం మనిషిని ఒక క్రమశిక్షణాయుత

జీవనవిధానానికి, బాధ్యతాయుత జీవన విధానానికి, నైతిక, మానవీయ విలువలతో కూడిన, దైవభక్తి తొణికిసలాడే జీవన విధానానికి అలవాటు చేస్తుంది.

అందుకని ఉపవాసవ్రతం, నమాజులు, దానధర్మాలు, ఇతర నియమాలు పాటించడంతో పాటు, రమజాన్ చివరి దశంలో 'లైలతుల్ ఖద్ర్' అన్వేషణలో అధికంగా ఆరాధనలు చేస్తారు. లైలతుల్ ఖద్ర్ అంటే అత్యంత విలువైన, శుభప్రదమైన రాత్రి అని అర్థం. ఈ రాత్రిలోనే పవిత్ర ఖురాన్ అవతరణ మొట్టమొదటగా ప్రారంభమైంది. ఈ రాత్రిన దైవదూతలు దివి నుండి భువికి దిగివస్తారు. ఆరాధనలు చేసే వారందరి కోసం వారు మన్నింపు ప్రార్థన చేస్తారు. భక్తులు చేసే అర్థింపులు, వేడుకోళ్ళకు వారు 'తథాస్తు' పలుకుతారు. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ విలువైన రాత్రి కూడా రమజాన్ మాసంలోని చివరి పది రోజుల్లోని ఓ బేసి రాత్రిలోనే ఉంది. అందుకే భక్తులు ఈ మాసంలోని చివరి బేసి రాత్రుల్లో ప్రార్థనల్లో నిమగ్నమైపోతారు.

## జకాత్, ఫిత్రా – పేదల ఆసరా...

ఈ పవిత్ర మాసంలోనే ఆర్థికంగా కలిగిన వాళ్ళు తమ సంపాదనలోని ఒక నిర్ణీత భాగాన్ని పేదసాదలకు దానం చేస్తారు. 'జకాత్' అని పిలువబడే ఈ దానం తమ నిల్వ ఆదాయంలోంచి రెండున్నర శాతాన్ని పేదసాదలకు పంపిణీ చేయాలి.

అలాగే 'ఫిత్రా' దానం. దీనికి ఆర్థిక స్థోమతతో సంబంధం లేదు. కాస్తో కూస్తో కలిగిన వారందరూ ఫిత్రాలు చెల్లిస్తారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పండుగ జరుపుకునే స్థోమత లేని వారికి 'ఫిత్రా'ల వల్ల గొప్ప ఊరట లభిస్తుంది. ఫిత్రా దానంగా పావుతక్కువ రెండు శేర్ల గోధుమలు గాని, లేక నేటి మార్కెట్‌ధర ప్రకారం నగదుగాని చెల్లించవచ్చు. పండుగ నమాజు కంటే ముందు జన్మించిన శిశువుతో సహా కుటుంబంలో ఎంతమంది సభ్యులుంటే అంతమంది తరపునా ఫిత్రాలు చెల్లించాలి. అంతేకాకుండా ఎవరి స్థోమత మేరకు వారు సమాజంలోని పేదసాదలను ఆదుకోడానికి ప్రయత్నించాలి. పండుగ కంటే కొద్దిరోజుల ముందుగానే ఈ పైకం పంపిణీ జరిగినట్లయితే, మన తోటి సోదరులు కూడా కొత్తబట్టలో, పండుగ సామగ్రో కొనుక్కోవడానికి వీలు కలుగుతుంది. ముస్లింలు, ముస్లిమేతరులు అన్న బేధభావం లేకుండా సమాజంలోని పేదసాదల పట్ల సంపన్నులు తమ బాధ్యతను గుర్తెరిగి మసలుకోవాలి. అనవసర భోగవిలాసాలకు తమధనాన్ని వృథా చేయకుండా అభాగ్యులు, ఆగత్యపరులను ఆదుకోవడానికి ప్రయత్నించాలి.

## శాంతి, సంతోషాలు వెల్లివిరియాలి...

ఈ విధంగా రమజాన్ మాసం ఆరంభం నుండి మనసా, వాచా, కర్మణా, బుద్ధిగా, శుద్ధిగా, భక్తిగా ఉపవాసదీక్షలు పాటిస్తూ, రోజూ ఐదుసార్లు ప్రార్థనతో పాటు, ప్రత్యేక ఆరాధనలు కూడా ఆచరిస్తూ, ఉదారంగా పేదసాదల అవసరాలను తీర్చడానికి ప్రయత్నిస్తూ, నియమ నిష్టలతో గడిపినవారు నిజంగానే ధన్యులు. ఇలాంటివారే పండుగ శుభకామనలకు పూర్తిగా అర్హులు. మొత్తానికి రమజాన్ ఆరాధనల వల్ల స్వీయసంస్కరణతో పాటు, సమాజ సంస్కరణా జరుగుతుంది. మానవ సమాజం పేదరికం, దారిద్ర్యాల బారి నుండి సురక్షితంగా, శాంతి, సుఖసంతోషాలతో అలరారాలన్నది ఇస్లాం ఆశయం.

అందుకే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినాన సమాజంలోని నిరుపేదలందరినీ పండుగ సంబరాల్లో భాగస్వాములను చేయడానికి తగిన చర్యలు చేపట్టడం జరిగింది. పండుగ ప్రసంగంలో కూడా ముస్లిం సముదాయానికి ఈ బాధ్యతలను గుర్తు చేస్తూ, 'ఇమాం' వారికి నైతిక, ఆధ్యాత్మిక, మానవీయ విలువల బోధన చేస్తాడు. నమాజ్, ఖుత్బాల అనంతరం అందరూ కలసి దేశం కోసం, దేశవాసుల సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థన చేస్తారు. పరస్పర అభివాదాలు, ఆలింగనాలు చేసుకుంటూ, పండుగ వంటకాలను బంధుమిత్రులతో కలిసి ఆరగిస్తారు.




'ఈద్ ముబారక్' అంటూ కుల మతాల కతీతంగా అందరూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ విధంగా రమజాన్ (ఈదుల్ ఫిత్ర్) పండుగ మానవుల్లో ఉన్నత మానవీయ విలువలను, పరస్పర ప్రేమానురాగాలను, పరోపకార గుణాన్ని జనింపజేసి, సమాజంలో సర్వమానవ సమతా భావాన్ని, సామరస్య వాతావరణాన్ని ఏర్పరుస్తుంది. కనుక పండుగ స్ఫూర్తిని అందిపుచ్చుకుని ఓ సుందర మానవీయ సమాజ నిర్మాణానికి మనవంతు పాత్రను ఖచ్చితంగా పోషిద్దాం.

*- యండి. ఉస్మాన్‌ఖాన్*

# చావు వీలునామా!

ఎం. యాదగిరి రెడ్డి



**తెల తెలవారుతుండగానే బక్కగొడ్లకొనే కాసీం ట్రాలీ ఆటో ఊరి మధ్య చావిడి దగ్గర యాపచెట్ల కింద ఇద్దరు మనుష్యులతో వచ్చి ఆగింది. డొక్కు సైకిలు, చిరిగిన బట్టలతో వూరూరా తిరిగి నెలకు ఒకటో రెండో బక్కగొడ్లు కొని అమ్మే కాసీం కరువు పుణ్యమా అని ఏకంగా ఆటోనే కొనేశాడు. తెల్లటి పైజామా, లాల్చీ, ఎర్ర చారికల కండువా వేసుకున్నాడు. రోజుకో పది, ఇరవయి పశువులు తోలి బాగానే సంపాదిస్తున్నాడు. కాసీం బండి హారన్ వినగానే రైతులు బిలబిలమని తమ పశువులు తోలుకొని వచ్చి ఆటో చుట్టూ నిలబడ్డారు.**

"కాసింబాయి, నావి రెండు బర్లు" చెన్నపాక లక్ష్మమ్మ.

"కాసిం అన్నా, నావి రెండు ఆవులు" చాకలి లింగయ్య.

"కాసిం, నాయి రెండు అరకటెడ్లు" మైనం చంద్రయ్య.

"ఇగో కాసిం నావి రెండు దున్నపోతులు" జాన్‌రెడ్డి.

రైతులంతా కాసింను చుట్టుముట్టారు. నెల రోజుల నుండి ఇదే వరస. కరువుతో అల్లాడుతున్న రైతులు నీళ్ళకు, మేతకు కరువొచ్చి రోజుకు పది, ఇరవయి పశువులను బండెక్కిస్తున్నారు. ఊరిలో సగానికి సగం పశువుల నమ్మివేశారు.

కరువు, భీకరమైన కరువు. బావులు, చెరువులు, కుంటలు, వాగులు అన్నీ ఎండిపోయాయి. ఎక్కడా చుక్క నీరు లేదు. వర్షాకాలం మొదలయి నాలుగు నెలలవుతున్నా చిటాన చినుకు లేదు. ఓ ఎకరం విత్తనం వేసింది లేదు. ఓ మడి నాటు బెట్టింది లేదు. విత్తనాలు, ఎరువులు తెచ్చుకొని ఆకాశం కేసి చూస్తున్నారు రైతులు. బోర్ల కింద నాటు వేసిన ఒకటి, అరా మడులు రోజుకింత వెనక్కు వస్తున్నాయి. ఊరిలోని బత్తాయి తోటలన్నీ వాడ పట్టాయి. ఎండాకాలం మరిపించే ఎండలు. తెచ్చిన పత్తిగింజలు, ఎరువులు అమ్మి తిండిగింజలు తెచ్చుకుంటున్న రైతులు. ఒక్కో రైతుది ఒక్కో దయనీయగాథ.

వూరిలోని మంచి నీటి బోర్లన్నీ ఎండిపోయాయి. వ్యవసాయ బోర్లవద్ద నీళ్ళు తెస్తున్న ఆడవాళ్ళు. వాకిల్లు వూడ్చి చల్లడం బందు చేశారు. రోజూ చేసే స్నానాలు నాలుగు రోజులకోసారి రెండు జగ్గుల నీళ్లతో అయిందనిపిస్తున్నారు. నీటి కోసం, మేత కోసం అల్లాడుతున్న పశువులు.

యాబయి ఏండ్లలో ఇటువంటి కరువు చూడలేదంటున్న పెద్దలు. పశువులకు గడ్డిలేక యాపాకు, గిరిశెనపాకు, సుబాబుల్ మండలు విరుచుకొచ్చి వాటి ముందు వేస్తున్నారు.ఒక్క ట్రాక్టరు గడ్డి పదివేలకు వచ్చింది. కొందామన్న ఎక్కడా గడ్డి దొరికేటట్టులేదు.

సీతారాంరెడ్డి, సీతమ్మ, జాన్‌రెడ్డి, మైనం చంద్రయ్య, చాకలి లింగయ్య, మస్తాన్, తిర్పతయ్య, ఇంకా ఓపది మంది రైతులు బర్లు, ఆవులు, దూడలను, అరకటెడ్లను అమ్మకానికి తోలుకొచ్చారు. ఒక్కొక్క పశువుకు దళారి కాసిం తను చెప్పిన ధర జేబులోనుండి డబ్బులు తీసి రైతుల చేతిలో పెట్టి వాళ్ల పశువులను బండెక్కిస్తున్నాడు.

"ఏం పటేలా పాలిచ్చే బర్లను అమ్ముతున్నారా" తాను తోలుకొచ్చిన బర్లను చెట్లకు కడుతూ సీతారాంరెడ్డిని అడిగాడు చాకలి లింగయ్య.

"ఏం చేద్దాం లింగయ్య! కాలం ఇట్లొచ్చింది. ఇంత కరువు నేను పుట్టినప్పటి నుండి చూడలేదు. విత్తనాలు వేయకుండా వుండటం యాబయి ఏండ్లలో ఇదే మొదటిసారి. ఇప్పటికే ఇరవయి వేల గడ్డికొని మేపా. గడ్డి కొందామన్నా ఎక్కడా దొరికేటట్టు లేదు. గడ్డికి, మేతకు బర్లు అంగలారుస్తుంటే వాటిగోస చూడలేక అమ్ముతున్న" విచారంగా అన్నాడు సీతారాంరెడ్డి.

తోలుకొచ్చిన బర్లను ఆటోవైపు మల్లించాడు సీతారాంరెడ్డి. బర్రెకు

**గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

నాలుగు వేల చొప్పున నాలుగు బర్లకు పదహారు వేలిచ్చి సీతారాంరెడ్డి బర్లను ఆటో ఎక్కించాడు కాసిం.

"కాసీంబాయి పోయినేడు పదివేలకు ఒక్కో బర్రెను కొన్న, అందులో సగం ఐదువేలన్నా చేసుకో" సీతారాంరెడ్డి అన్నాడు.

"చూడు పటేలా కంపెనీకి రోజుకు వందలకొద్దీ పశువులు వస్తున్నాయి. వాళ్లు చెప్పిందే ధర. వాళ్లు అడిగినకాడికి ఇచ్చి వస్తున్న" కాసిం అన్నాడు. సీతారాంరెడ్డి మారు మాట్లాడలేదు.

ఆటో నిండిపోయింది. పశువులన్నీ కంపెనీ దగ్గర దింపి గంటలో వస్తావని అక్కడున్న రైతులకు చెప్పి ఆటో తోలు కుంటూ కాసిం వెళ్ళిపోయాడు.

ఆ పక్కన పాల మల్లయ్య సైకిలుకు క్యాను తగిలించుకొని సీతారాంరెడ్డి దగ్గరికొచ్చాడు.

"పదిలీటర్ల పాలుపోసే మీరే బర్లనమ్మితే మేమెట్ల బతకాలే పటేలా! ఇదివరకయితే ఈ ఊరిలో ఆటోనిండా పదిక్యాన్ల పాలు దొరికేవి. ఇప్పుడు ఈ ఒక్క క్యాను పాలుదొరకటమే కష్టమయిపోయింది" పాల మల్లయ్య అన్నాడు.

"ఏం జేద్దాం మల్లయ్యా రోజులిట్లవచ్చినయి..." అనుకుంటూ సీతారాంరెడ్డి యాపచెట్టుకింద బండమీద కూర్చున్నాడు. ఇంకో పదిమంది రైతులు మాటాముచ్చట్లలో పడ్డారు. అందరినోళ్లలో పండ్లపుల్లలు. ఎవరూ ముఖాలు కడుగలేదు.

"ఏరా లింగయ్యా. నీ బోరు గజం దూరం పోసేదిగదా. ఏ మాత్రం నాటేశావు" రెడ్డి అడిగాడు.

'రెండెకరాలు నాటుబెట్టిన పటేలా. బోరుసగానికి సగం తగ్గింది. రోజుకో మడి వెనుకకు వస్తుంది. వుంటదో ఎండిపోద్దో తెలుస్తలేదు. ఇంకో బోరు వెయ్యాలే. ఎక్కడి అప్పులు అక్కడేవున్నాయి" లింగయ్య అన్నాడు.

"మరి. మస్తాన్ నీ బోరో...."

"ఏం లేదు బాబాయ్ ఆగి ఆగిపోస్తుంది. పొలమంతా పడావే వుంది. నారుమడి కూడా పారడంలేదు. నిన్నా మొన్నా బర్ల మేపుకొచ్చిన. ఈ మధ్యనే రెండో బోరు వేసి చూశా చుక్కనీరు రాలే. అంతా బండ. ముప్పయివేలు వదిలాయనుకో" లేని నవ్వు తెచ్చుకుంటూ మస్తాన్ అన్నాడు.

"మీ తోట వెంట సుదర్శన్‌రావు బోరువేస్తే బాగాపడ్డదటగా బాబాయి. మీ తోటంతా వాడు పట్టింది గదా ఓ బోరు వేసి చూడగూడదూ"

"వెయ్యాలిరా. ఇదిగో ఇప్పుడే కాసిం యిచ్చిన ఈ పదహారు వేలతో ఓ బోరేస్తా" మస్తాన్‌తో సీతారాంరెడ్డి అన్నాడు.

"కరెంటొచ్చింది. కరెంటొచ్చింది" అనుకుంటూ నీళ్ళ కొరకు వ్యవసాయ బోర్ల వద్దకు ఆడవాళ్ల ఉరుకులు పరుగులు. కరెంటురాకతో రైతులంతా లేచి పొలాలవైపు వెళ్లారు.

దూరంగా బయ్యిమని బోరింగు బండిచప్పుడు. నెలరోజుల నుండి ఆ వూరిలో బోరింగు వేయని రోజులేదు. పొలాలు, తోటలు ఎండి పోతుంటే రైతులు అప్పులు చేసి మరీ బోర్లు వేస్తున్నారు. పాత బోర్లు మొరాయిస్తుంటే కొత్తకొత్త బోర్లు వేస్తూ పోతున్నారు. ఈ నెలరోజుల్లో ఓ వంద బోర్లంటే వేశారు.

సీతారాంరెడ్డి తండ్రి తాతల నుండి బాగా బతికిన కుటుంబం. పది రకాల పశువులు, ఓ అయిదారుగురు జీతగాండ్లు, బండ్లు, ఎడ్లు, ఆవులతో దొడ్డి నిండుగా వుండేది. ఇంటిముందు ఎప్పుడూ సందడి సందడిగా వుండేది. కారుకు పదిపుట్లవడ్లు, సజ్జలు, జొన్నలు, ఆముదాలు, కందులు, పెసలు, వేరుశనగ లాంటి సాంప్రదాయ పంటలు బాగా పండేవి.

సీతారాంరెడ్డి హెచ్.యస్.సి పాస్ కాగానే తహశీల్ ఆఫీసులో క్లర్కు ఉద్యోగం వచ్చింది. ఉద్యోగానికి వెళతానంటే తండ్రి ససేమిరా అన్నాడు. మనకిందనే పని చేసి ఓ వందమంది బతుకుతున్నారు. వాళ్లిచ్చే వందరూపాయిల జీతం కొరకు ఒకరి కింద మనం నౌకరి చేసేదేంది, వద్దంటే వద్దని సీతారాం రెడ్డిని వ్యవసాయంలో దింపాడు.

తర్వాత పెండ్లి, పిల్లలు కలిగారు. తల్లి, తండ్రి చనిపోయారు. ఓ అయిదారేండ్లు పంటలు బాగానే పండాయి. క్రమక్రమంగా బావులు ఎండిపోయి బోరింగులు వచ్చాయి. మోటారు బదులు కరెంటు మోటర్లు వచ్చాయి.

ఊరిలో రైతులంతా సాంప్రదాయ పంటలు వదలి బత్తాయి తోటలు పెడుతుంటే తన ఐదెకరాల ఎర్ర చెలకలో బోరువేసి ఓ అయిదొందల బత్తాయి మొక్కలు వేశాడు. చెట్లకు డ్రిప్‌లైన్ వేశాడు. ఎరువులు, పురుగు మందులు వాడి చెట్లను కన్న బిడ్డల్లా పెంచాడు. రాత్రి అయిదారు గంటలు ఇంట్లో పడుకుంటే పగలంతా తోటలో పనితోనే సరిపోయేది రెడ్డికి. మొదట్లో నీళ్ళు సరి పోయినా చెట్లు పెరిగేకొద్దీ నీటికి కటకటవచ్చింది. బోర్లలో నీళ్ళు తగ్గుతూ వుంటే అప్పులు చేసి తోట నిండా ఓ పది బోర్లు వేశాడు.

ఎండాకాలం నీళ్ళు సరిపోకుంటే ట్యాంకర్లతో నీళ్ళు తోలిచ్చి చెట్ల పాదులు తడిపాడు. కిలో మీటరు దూరంలో ఓ బోరు కొని పైపు లైనువేసి కొన్నాళ్ళు చెట్లకు నీరు పెట్టాడు. మొత్తానికి తోటకు ఓ అయిదు లక్షలు అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు సీతారాంరెడ్డి.

ఆయన ఆశలన్నీ ఆ తోటమీదే. తోట కాపుకాస్తే అప్పులన్నీ తీర్చేయడం, బిడ్డ చదువు, పెండ్లి, కొడుకు అమెరికా ప్రయాణం, అన్నీ ఒక్క సంవత్సరం పంట మీద వస్తాయనుకున్నాడు. చెట్లు కూడా బలంగా బాగా పెరిగాయి. ఈ సంవత్సరమే కాపుకొచ్చింది. చెట్ల నిండా కాయలతో చూడముచ్చటగా వుంది తోట. దానికి తోడు ఓ నాల్గెకరాలపొలం, ఐదెకరాల పత్తి సాగు చేస్తూ వస్తున్నాడు.

ఆ ఊరిలో చాలామంది రైతులు బత్తాయితోటలే పెంచుతున్నారు. బత్తాయి తోటలతో తమ బతుకులు బాగుపడతాయని వాళ్ల ఆశ. ఒకరి మీద ఒకరు ఓ రెండువందల బోర్లంటే వేశారు. ఈ కరువుకు ఎండిపోయే తోటలు ఎండిపోతున్నాయి. వాడు పట్టేవి నీళ్ళు సరి పోక వాడు పడుతున్నాయి. కాయలు దూది పింజల్లా మెత్తగా తయారయ్యాయి. పది రోజుల కింద తోట ఎండిపోతుంటే చూడలేక గోవిందనే రైతు రెండులక్షల అప్పు చేసి పది బోర్లు వేసి నీరు రాక వురి వేసుకుని చనిపోయాడు.

సీతారాంరెడ్డి బర్లనమ్మిన పదహారు వేలతో సుదర్శన్‌రావు బోరువెంట తన తోటలో బోరువేశాడు. మోస్తరు నీళ్ళు వచ్చాయి. అతని కండ్లల్లో ఆశ మెరిసింది. మోటారుకు డబ్బులు ఎలా? అని దిగుల పడుతున్న రెడ్డిని చూసి భార్య భారతమ్మ మెడలోవున్న ఒక్కగానొక్క పుస్తెలతాడు పుస్తెతో సహా తీసి యిచ్చింది. తనో పసుపు కొమ్మును పసుపు తాడుకు కట్టుకొని మెడలో వేసుకుంది. భార్య మాట కాదనలేక మోటార్ తెచ్చి బిగించాడు. ఓ పది రోజులు నడిచినట్లే నడిచి ఒక్క సారిగా చిక్కిపోయింది.




నడితోటలో తాటాకుల గుడిశె ముందు మంచంలో రెండుచేతులు గదిమలకు ఆనించి మునిలా కూర్చున్న సీతారాంరెడ్డి ఆలోచనలోపడ్డాడు. నిన్నటి దాకా పచ్చగా వున్న చెట్లు నీల్లులేక వాడుకొచ్చాయి. వారం రోజుల్లో తోలు నిలవునా ఎండిపోయేటట్టుంది. రెండేండ్లనుండి కొడుకు ప్రసాద్ ఇంటికి రావడంలేదు. రెండేండ్ల కింద జరిగిన సంఘటన రెడ్డి కండ్లముందు మెదిలింది.

ఇంజనీరింగ్ ఫైనలియర్ రిజల్ట్స్ వచ్చిన నెల రోజులకు సీతారాంరెడ్డి కొడుకు ప్రసాద్ ఉత్సాహంగా ఇంటికివచ్చాడు. అమెరికా వెళ్ళటానికి పాస్‌పోర్ట్, వీసాతో సహా వచ్చాడు. ఇంటిముందు రేకుల సాయమానులో మంచంమీద కూర్చున్న తండ్రి ముందు స్టూలు మీద కూర్చున్నాడు ప్రసాద్.

"నాన్నా......"

"నా ఇంజనీరింగు అయిపోయింది నాన్నా! ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను మంచి మార్కులు వచ్చాయి.

"నాకు అమెరికా వీసావచ్చింది నాన్నా"

"అమెరికాలో నాకు మంచి కాలేజీలో యం.యస్ సీటువచ్చింది" చెప్పుకుపోతున్న ప్రసాద్. సంతోషంతో వుక్కిరిబిక్కిరవుతాడునుకున్న తండ్రి మౌనం ప్రసాద్‌కు అంతు బట్టలేదు.

"మన ఇంటి పక్క కమ్మరి కొండయ్య కొడుకు రాంబాబుకు గూడా అదే కాలేజీలో సీటు వచ్చింది"

"అమెరికా వెళ్ళాలంటే ఓ నాలుగు లక్షల రూపాయిలు కావాలి నాన్నా. అక్కడికి వెళ్లాక ఏదైనా పార్ట్‌టైమ్ జాబ్ చూసుకుని చదువుకుంటా. మీరు వ్యవసాయం చేయకున్నా ఫర్వాలేదు" హుషారుగా చెప్పుకుపోతున్నాడు ప్రసాద్. అమెరికా ప్రయాణం. నాలుగు లక్షల రూపాయిలనే వరకు సీతారాంరెడ్డి గుండెల్లో రెళ్లు పరుగెత్తాయి. ఇప్పుడున్న అప్పులే ఎక్కడివక్కడే వున్నాయి. నీళ్ళు సరిగాలేక పంటలు సరిగా పండటం లేదు. అనే మాట కొడుకుతో చెప్పాడు.

"నీ చదువంటే అయిపోయింది. చెల్లె చదువు, పెండ్లి ఆలాగే వున్నాయి. తోట కొరకు చేసిన అప్పులు ఐదు లక్షల దాకా ఆలాగే నిలబడిపోయాయి. మళ్లీ ఇప్పుడు అప్పు ఎవరిస్తారురా" ఇంకో సంవత్సరం అయితే తోట కాపుకొస్తుంది అప్పుడు వెళుదువుగానిలె! ఈ లోపు హైదరాబాదులో ఎదో ఓ కంపెనీలో చిన్నదో, పెద్దదో ఉద్యోగం చూసుకో" తన మనసులోని మాట అన్నాడు రెడ్డి.

"అదికాదు నాన్నా... ఈ అవకాశం మళ్ళీ రాదు కమ్మరి కొండయ్య మన చెలక పక్కన వున్ననాలుగెకరాల చెలక ఎకరాలక్షన్నర చొప్పున హైదరాబాదు పార్టీకి అమ్మాడు. దాని వెంట వున్న మన చెలక ఐదెకరాలు అమ్మదాం నాన్నా" తండ్రికి పరిష్కారమార్గంగా చెప్పాడు ప్రసాదు.

"ఒరేయ్ ప్రసాద్. భూమి అమ్మాలంటే నాతో అయ్యేపని కాదురా. కన్న తల్లిలాంటి భూమిని అమ్మడమంటే మనల్ని మనం అమ్ముకున్నట్లే. ఇన్నాళ్ళు మనం బతికింది ఆ భూమిమీదే. భూమి అమ్మడం మాత్రం నాతోనికాదు. కమ్మరి కొండయ్యంటావు వులి బాడిశ చేత బట్టుకుంటే ఎక్కడికి పోయినా బతుకుతాడు. భూమిని అమ్ముకొని మనమేం చేయగలం" తండ్రి మాటలతో ఖంగుతిన్న ప్రసాద్ మౌనంగా వచ్చిన బాటనే హైదరాబాదు వెళ్ళి ఏదో కంపెనీలో చిన్నపాటి ఉద్యోగంలో చేరిపోయాడు. పోయిన పోకడ రెండేండ్ల నుండి యింటి ముఖం చూడలేదు.

కొడుకును తలుచుకున్న సీతారాంరెడ్డి కండ్లల్లో నీళ్ల తిరిగాయి. తను తప్పు చేశాడా! భూమిని అమ్మి డబ్బులిస్తే సరిపోయేది. కమ్మరి కొండయ్య కొడుకు అమెరికా వెళ్ళి చదివి మంచి ఉద్యోగం సంపాదించుకొని తండ్రికి బాగా డబ్బులు పంపుతున్నాడు. వాళ్ళ కుటుంబం చీకూ చింతా లేకుండా హాయిగా బతుకుతున్నారు. తువ్వాలుతో ముఖం తుడ్చుకొని ఇంటి దారి పట్టాడు సీతారాంరెడ్డి.

వారం రోజుల్లో రెడ్డి తోట పూర్తిగా ఎండిపోయింది. నాటేసిన రెండెకరాల పొలం, నారుమడితో సహా ఎండిపోయింది. నాలుగు బోర్లు చిక్కిపోయాయి. చేసిన ఐదులక్షల అప్పు అలాగే మిగిలిపోయింది. దిగులుతో మంచం పట్టాడు రెడ్డి. ఏదో ఇంత తిని ఇంట్లోనే పడుకుంటున్నాడు. ఎటూ బయటకు వెళ్ళడం లేదు. ఎవరితోను మునుపటిలా మాట్లాడటంలేదు.

చీకటితో లేచి తోట దగ్గరకు వెళ్ళిన మనిషి మధ్యాహ్నం పన్నెండు గంటలయినా ఇంటికి రాలేదని భారతమ్మ ఇరుగుపొరుగువారిని తీసుకుని తోట దగ్గరకు వెళ్ళింది. మంచంలో నిర్జీవంగా పడివున్న సీతారాంరెడ్డి. పక్కన పురుగు మందులడబ్బా. నోటి దగ్గర తెల్లటినురగ. అక్కడికి చేరిన జనమంతా గొల్లుమన్నారు. భారతమ్మ కుప్పకూలి పోయింది. కూతురు సుజాత భోరున ఏడుస్తూ తండ్రి మీద పడిపోయింది.

వార్త తెలిసిన ప్రసాద్ హైదరాబాదు నుండి ఆగమేఘాల మీద వచ్చాడు. తండ్రి మీద పడి ఒకటే ఏడుపు. సీతారాంరెడ్డి జేబులో నుండి ఓ కాగితం జారి మంచం పక్కన పడింది. ప్రసాద్ కండ్లు తుడుచుకొని ఆ కాగితం తీసిచూశాడు. అది తన తండ్రి తనకు రాసిన ఉత్తరం.

'చిరంజీవి ప్రసాద్‌కు మీ నాన్న నీకు రాసే చివరి ఉత్తరం. మీ అందరికి అన్యాయం చేసి జీవితంలో వోడిపోయి ఈ లోకం విడిచి వెళుతున్నాను. ముఖ్యంగా నీకు తీరని అన్యాయం చేశాను. భూమి మీదున్న మమకారంతో ఆ రోజు భూమి అమ్మి నీకు డబ్బులీయక బంగారం లాంటి అమెరికా అవకాశం చెడగొట్టాను. మట్టికి, రైతుకున్న అనుబంధం నన్ను భూమిని అమ్మనీయలేదు. ఇంకా ఏవో, ఏవేవో, పంటలు పండించాలని అప్పులు చేసి నిండా మునిగాను. నా బొందిలో ప్రాణముండగా ఈ భూమిని అమ్మలేకపోయాను. పచ్చటి బత్తాయి తోట చూసి మోసపోయాను. లెక్కకు మించి అప్పులు చేశాను. భూమిని అమ్మి ఎవరి అప్పులు వారికి ఇచ్చేయి.

రైతన్నవాడు ఎవరికి అప్పు ఎగనామం పెట్టాలని చూడడు. నీతి నిజాయితీతో బతికే రైతు ఎవరికీ రుణగ్రస్తుడు కావాలనుకోడు. అందరి అప్పులు తీర్చి వేసి, నీ తండ్రిని రుణ విముక్తున్ని చేయి.

మీ అమ్మ భారతమ్మ వట్టి వెర్రి బాగులది. ఈ ఇంటికి వచ్చిన్నాడు ఇరువది ఐదు తులాల బంగారంతో వచ్చింది. ఈ రోజు మెడలో వీసమెత్తు బంగారం లేదు. మొన్నటికి మొన్న మోటరు కోసం వున్న ఒక్కగానొక్క పుస్తెల ఆడు పుస్తెతో సహా తీసి నా చేతిలో పెట్టి పసుపు కొమ్ము, పసుపుతాడును మెడలో వేసుకుంది. మీ చెల్లెలు సుజాత నా పరిస్థితి చూసి ఈ సంవత్సరం ఇంజనీరింగు ఫీజు అడుగలేక పదిహేను రోజులుగా కాలేజి మానివేసింది. దాని చదువు, పెళ్ళి బాధ్యత అంతా నీదే.

బత్తాయి తోట కాయలిస్తానని కర్నూలు సాయెబుమదార్‌సేట్ దగ్గర యాబయి వేలరూపాయిలు అడ్వాన్సుగా తీసుకున్నాను. తీరా యిప్పుడా తోటంతా కాయలతో సహా ఎండిపోయింది. వాళ్ల డబ్బులు వాళ్లకిచ్చేయి.

ఎరువుల షాపు శేషాద్రికి నలుబయివేలు, బట్టల కొట్టు భిక్షపతికి ఇరువయి అయిదువేలు, కిరాణం కొట్టు శ్రీరాములుకు పదివేలు, బట్టలకొట్టు భిక్షపతికి ఇరువయి అయిదువేలు, కిరాణం కొట్టు శ్రీరాములుకు పదివేలు, బోరింగు బండి ఖాదర్ సాహెబ్‌కి ఇరవయివేలు యివ్వాలి. వాళ్లంతా మన మీద నమ్మకంతో యిచ్చారు. వాళ్లందరి డబ్బులు యిచ్చివేయి.

ఆంధ్రాబ్యాంకు లక్షా యాబయివేలు, గ్రామీణ బ్యాంకులో క్రాప్ లోను యాబయి వేల రూపాయిల అప్పు వుంది. పోయినసారి పెద్దరైతులమని నాకు రుణ మాఫీ రాలేదు. ఇంకా మన ఇంటి ఎదురుగా వున్న బసవరాజుకు లక్షా యాబయి వేల రూపాయిలు, సీతమ్మత్తకు ముప్పయి వేలు, కరెంట్ మెకానిక్‌కు ఐదువేల రూపాయిలు ఇవ్వాలి. అందరి బాకీలు నయా పైసాలేకుండా తీర్చేయి. అసమర్థుడైన ఈ తండ్రి ఆఖరి కోరిక తీరుస్తావుకదూ!

ప్రేమతో
మీ నాన్న
*సీతారాంరెడ్డి.*

ఉత్తరం చదివిన ప్రసాద్ వెక్కివెక్కి ఏడ్చాడు. రెడ్డి చివరి చూపు కొరకు వూరు వూరంతా కదలి వచ్చింది. దూరంగా కూలీలు రెడ్డి శవదహనం కొరకు ఎండిన బత్తాయి చెట్లు కొట్టి కాష్టం పేరుస్తున్నారు.



# మంచినీటి సరఫరా. గ్రామ పారిశుద్ధ్యం - పంచాయితీల పాత్ర

**ఇటీవల ప్రచురించబడిన ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం భారత దేశంలో సంవత్సరంలో మరణాల సంఖ్య 1 కోటి 3 లక్షలు కాగా, యిందులో 7.5 శాతం అనగా 7.8 లక్షల మంది అనారోగ్యకరమైన మంచి నీళ్లు త్రాగటం వలన వచ్చే వ్యాధులకు గురై మరణిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం అమలు లోపాల వలన గాని వ్యక్తిగతంగా శుభ్రత లోపించిన కారణాల వలన ప్రతి పది మరణాలలో ఒకరు ప్రపంచ మంతటిలో చనిపోవుతున్నారు.**

భారతదేశంలో మరణిస్తున్న 7.8 లక్షల ప్రజల వివరాలు, నీటి పరి శుభ్రతలో లోపమున్న యెడల కలిగే మరణాలు ఈ విధంగా వున్నాయి.

❄ అతిసార వ్యాధి, విరోచనాలు - 4.02 లక్షలు ❄ పౌష్టికాహార లోపాలతో - 2.17 ❄ మంచినీటి ద్వారా వ్యాపిస్తున్న ఇన్‌ఫెక్షన్ల ద్వారా- 19,000 ఉదా: ఫైలీరియా మొదలగు మరణాలు

ప్రపంచవ్యాప్తంగా 110 కోట్ల ప్రజలకు ఆరోగ్యప్రదమైన మంచినీరు లభించటం లేదు. ఈ మధ్య, అనగా జూలై 7 న విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో ప్రపంచ వ్యాప్తంగా ఒక సంవత్సర కాలంలో 97 లక్షల చిన్న పిల్లల (5 సం॥లో) మరణాలకు కారణం వారు కలుషితమైన నీరు త్రాగటం వల్లేనని నిర్ధారణ అయింది. కలుషిత త్రాగునీరు, పారిశుద్ధ్య లోపం ప్రపంచవ్యాప్తంగా 14 సం॥లోపు పిల్లల మరణాల్లో 20 శాతం మంది మరణాలకు కారణం అవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సంభవించే అతిసార వ్యాధులలో 88 శాతం కలుషిత నీరు త్రాగినందువల్ల ఏర్పడుతున్నది. కలరా, టైఫాయిడ్, రక్త విరేచనాలు యేటా 15 లక్షల మంది ప్రాణాలు బలితీసికొంటున్నాయి.

చిన్న పిల్లలలో వయస్సుకు తగిన బరువు లేకపోవటం ప్రపంచ వ్యాప్తంగా 35 శాతంగా వుంటే, భారత దేశంలో వీరు 47 శాతం వరకున్నారు. ఇందుకు ముఖ్య కారణం త్రాగునీటి లోపం. దీని వలన 15 లక్షల మంది మృత్యువు పాలౌతున్నారు.

మంచి నీటి లోపం వలన, పౌష్టికాహార లోపం వలన సంభవించే మరణాలు 8.6 లక్షలు ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల ప్రజలు అనగా 33 శాతం ఇన్‌ఫెక్షన్స్‌కు గురవుతున్నారు. $2^{1/2}$ కోట్ల ప్రజలు ఫైలేరియా జబ్బు వలన నడవడానికి ఇబ్బంది పడుతూ దుర్భర జీవితం గడుపుతున్నారు. ఫైలేరియాకు కారణమైన దోమల నివారణ యుద్ధ ప్రాతిపదిక మీద చేపట్టినందున విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలలో దాని బారిన పడిన ప్రజల సంఖ్య తగ్గు ముఖం పడుతున్నది.

మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం ప్రాథమికంగా పంచాయితీలే నిర్వహించవలసిన బాధ్యత ఉంది. ప్రజలకు సరఫరా చేస్తున్న మంచినీటిని తరచుగా నమూనాలు సేకరించి పరీక్షించి లోపాలు నివారించడానికి ఏర్పాట్లు చేయాలి. అదే విధంగా పంపులు , డ్రెయిన్లు, మురికి గుంటలు, లోతట్టు ప్రాంతాలలో నీరు చేరే అవకాశమున్న చోట్ల శుభ్రం చేస్తూ అక్కడ క్లోరిన్, బ్లీచింగ్ పౌడరు మొదలగునవి కలుపుతూ ఉండాలి. ఇతర కాలుష్యాల నివారణకు అధికారుల సలహా పాటించి ఆ ప్రకారం అమలు చేయాలి.

ఈ మధ్య ప్రవేశపెట్టిన టోటల్ శానిటేషన్ కాంపెయిన్ (TSC) ప్రకారం గ్రామంలోని అన్ని ఇండ్లలో సెప్టిక్‌ట్యాంక్ మరుగు దొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసికోవాలి. ఖాళీగా నున్న ప్రదేశాలలో గ్రామస్తు లెవరూ మలవిసర్జన జరుపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. అంటురోగాలు వ్యాప్తి చెందుతున్న సమయాలలో ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు వ్యాక్సిన్లు వేసే చర్యలను తీసుకోవాలి. బయటి ప్రాంతాల నుండి వచ్చే పాలు, మొదలగు వస్తువులను ప్రభుత్వ లేబరేటరీలలో పరిశీలింపచేసి వాటిపై చర్యలు తీసికోవాలి.

పంచాయితీరాజ్ చట్టం లోని 84 నుండి 94 సెక్షన్‌లో గ్రామపంచాయితీ విధులు నిర్వహించే 45 సెక్షనులో మంచినీటి సరఫరా, స్నానాలకు, బట్టలు ఉతకటానికి కావలసిన నీరు సరఫరా చేసే బాధ్యత పంచాయితీరాజ్ చట్టంలోని సెక్షన్ 45 (VIII) లో తెలియచేయబడినది.



**పరిసరాలను పరిశుభ్రంగా వుంచడానికి పంచాయితీలు తీసికొనవల సిన చర్యలు :**

ఎ) గ్రామాలలో కొన్ని చోట్ల దిగుడు బావులు వుంటుండగా, వాటిని ఫెన్సింగుతో గాని పారపిట్ వాల్‌తో కాని కట్టడి చేసి వాటి నీటిని పరి శుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసికోవాలి. వాటిని మంచి నీరుగా ఉపయోగించరాదు.

బి) గ్రామస్తులు నివసించే ఇండ్లలోని డ్రైయిన్స్ లేదా పాయిఖానాలు నిండి మురికి నీరు వీధుల లోనికి ప్రవేశించకుండునట్లు చర్యలు తీసుకోవటానికి పంచాయితీ పూనుకోవాలి.

సి) గ్రామంలో నున్న ఖాళీ స్థలాల నుండి ఇంటి నిర్మాణానికి ఇతరత్రా ప్రయోజనాలకై గుంతలు తీసి అవి కప్పిపుచ్చకుండా నిరుపయోగంగా ఉన్నట్లయితే, అందులో వర్షాకాలం నీరు చేరి దోమలు విస్తరించడానికి అవకాశమున్నందున, అవి పూడ్చి వాటిలో పబ్లిక్ స్థలాలయినట్లయితే చెట్లు నాటించవచ్చును.

డి) పోరంబోకులలో లోతట్టు ప్రాంతాలలో కూడా ఇటువంటి చర్యలు తీసుకోవాలి.

*- ఎం. సెబాస్టియన్ రాజు, ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)*
*సెంటర్ హెడ్, (సి.ఎస్.ఇ ఇ), అపార్డ్*

# స్థానిక పాలనకు స్ఫూర్తిదాయకం శ్రీకృష్ణ దేవరాయల పరిపాలన

"దేశభాషలందు తెలుగులెస్స" అని నుడి తెలుగు ప్రజల గుండెల్లో పదిలంగా నిలిచిన అలనాటి విజయనగర రాజు శ్రీకృష్ణ దేవరాయలు. తెలుగు ప్రజలను జనరంజకంగా పాలించి, నేటి సమాజానికి రాయలపాలన స్ఫూర్తిదాయకంగా స్మరించుకొనే పరిస్థితులు కల్పించటం ద్వారా నిజంగా రాయల ఘన చరిత్ర స్థానిక సంస్థల పరిపాలనా పాటవాలు నేర్పింది.

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. రోశయ్య ఆధ్వర్యంలో రాయల పంచ శతాబ్ది ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. అందులో భాగంగా నెల్లూరు జిల్లా ఉదయగిరి (దుర్గం)లో జూలై 17,18 రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో గ్రామ ప్రజలు విశేషంగా పాల్గొని రాయల పాలనపై ప్రశంసలు కురిపించి, నాటి పాలన అనుభవాలను వివిధ నాటికలు, కళల రూపాల ద్వారా, మననం చేసుకోని అభిమానం చాటారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కె. రాంగోపాల్ నెల్లూరు ఎం.పి. మేకపాటి రాజమోహన్‌రెడ్డి (ఉదయగిరి) ఈ ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా భావించి సన్నాహాలు ఏర్పాటు చేశారు. క్రీ॥శ 1471 పుట్టిన రాయలు క్రీ॥శ. 1513 ఉదయగిరి దుర్గాన్ని ఆక్రమించాడు. అక్కడ నుండి తమ సామ్రాజ్య విస్తరణకు ఉదయగిరి దుర్గం ప్రధాన కేంద్రంగా చేసుకొని పాలించారు.

ఉదయగిరిలో తమ సామ్రాజాన్ని నెలకొల్పి ఉదయగిరిలో ఎత్తయిన కొండను శత్రు దుర్భేదంగా భావించి ఇక్కడ నుండి అనేక దండయాత్రలు సాగించి నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని కందుకూరు, అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ, కొండవీడు మొదలగు దుర్గాలను జయించి, 1518 తర్వాత స్థానికపాలన, సుపరిపాలన, స్వర్ణయుగమైన పాలన కోసం రాయలు చేసిన కృషి నేటి పాలకులకు స్ఫూర్తినిస్తోంది.

మన దేశం వ్యవసాయక దేశం కావున రాయల కాలంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసారు. 1512లో ఆంధ్ర కర్ణాటక ప్రాంతాల సస్యశ్యామలం కోసం తుంగభద్ర నదిపై ఆనకట్ట వేయించి వ్యవసాయరంగాన్ని ఆదుకొన్నారు. అంతేగాకుండా, నెల్లూరు జిల్లాలో సీతారామపురం చెరువు, సోమశిల అప్పసముద్రం, సోంచెరువు, వెంకట్రావుపల్లె చెరువు లాంటి అనేక చెరువులు కట్టించి, బావులు త్రవ్వించి రైతాంగాన్ని సాగునీరు, త్రాగునీటి బారి నుంచి కాపాడాడు. అందుకే ఈ ప్రాంతాలలో రాయల పాలనలో రత్నాలు, ముత్యాలు రాశులుగా అమ్మేవారని చెప్పుకొనేవారు. అంతేగాకుండా ఉదయగిరి ప్రాంతాలలోని అన్ని పల్లెల్లోను ప్రజలు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా తమ రాజ్యంలోని సైనికులను గూఢచారులుగా నియమించి సమస్యలు తెలుసుకొనేవాడు. ఒకోసారి స్వయంగా వెళ్ళి ప్రజల బాధలు తెలుసుకొనేవాడు. రాయలు కనబరిచిన మంచి నాయకత్వ లక్షణాలు నేటి నేతలకు ఆదర్శంగా ఉంటున్నాయి.

ఉదయగిరి ప్రాంతాలలో అనేక తటాకాలు (చెరువులు) త్రవ్వించి ప్రజలకు ఉపకారం చేసిన రాయలు, మంచి సంగీత ప్రియుడు. రచయితగా కూడ మన తెలుగు ప్రజలకు ఆదర్శవంతుడయ్యాడు. "అముక్త మాల్యద" అనే గ్రంథం తెలుగులో వ్రాసి, తెలుగు ప్రతిష్ఠను, కవులను రచయితలను ప్రోత్సహించాడు. ఉదయగిరి ప్రాంతం తిరుమల తిరుపతి కొండ చరియలను పోలినవి గనుక, అందమైన ఆహ్లాదకరమైన కొండపై కోట నిర్మించి, కోట నుండి జాలువారే సెలయేరుల నీటి చుక్కలు క్రిందకి చేరేలా చేసి, ప్రజలకు దాహార్తి తీరేలా చేశాడు. ఉదయగిరి చుట్టూ అనేక దేవాలయాలు, స్నానవాటికలు, కళ్యాణమండపాలు, కొండపై వల్లభరాయల గుడి, శ్రీకృష్ణుడి విగ్రహం, ఉదయగిరి నడిబొడ్డున రంగనాయకుల దేవాలయం నిర్మాణాలు నేటికి చూపరులను ఆకర్షింపచేస్తున్నాయి రాజుల నాటి కట్టడాలు.

**నెల్లూరు జిల్లా ఉదయగిరిలో వైభవంగా ముగిసిన ఉత్సవాలు**

రాయల కాలంలో కులాలు, మతాలను సమానంగా ఆదరించారు. అందరినీ కన్నబిడ్డల వలె పాలించాడని చెపుతారు. అందుకు నిదర్శనంగా ఉదయగిరి ప్రాంతంలోని ఏ పవిత్ర పురాతనమైన శ్రీ ఘటిక సిద్దేశ్వర ఆలయం నిర్మాణం చేసి దానిని అభివృద్ధి చేసిన రాయలు, తిరుమల తిరుపతిలో గల ప్రముఖ ప్రఖ్యాతి దేవాలయం వెంకటేశ్వర స్వామికి నగలు చేయించాడు. (అవి ఈ మధ్య అపహరణకు గురైనట్లు వార్తలొచ్చాయి). అలాగే అన్ని గ్రామాల్లో దేవాలయాలు నిర్మించి భక్తి శ్రద్ధలను పెంపొందించారు. అందులో భాగంగా ఉదయగిరిలో నున్న రంగనాయకుల ఆలయం ప్రాచీన ప్రముఖమయింది. ఈ విధంగా రాయలు అన్ని రంగాలలో ప్రజారంజక పాలన అందించి నేటి భావితరాలకు, స్థానికసంస్థల పాలకులకు స్ఫూర్తిదాయకమయ్యాడు. ఈ ఉత్సవాల సందర్భంగా ప్రజలు వాటి గురించి తెలుసుకుని ఆనందించారు.

## పర్యాటక కేంద్రంగా ఉదయగిరి

దట్టమైన అడవి, ఎత్తయిన కొండచరియలు, జాలువారే సెలయేర్లు, ఆహ్లాదాన్ని కల్గించే ప్రకృతి సోయగాలు ఉదయగిరి దుర్గం సొంతం. ఔషధాలకు, వనమూలికలకు నిలయంగా ఉంది. రాయల కాలం నాటి నుండి నేటికి ఈ దుర్గంలో ప్రకృతి వనమూలికలు లభ్యమవుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా రాయల కాలం నాటి నిర్మాణాలు, కట్టడాలు, దేవాలయాలను అభివృద్ధి చేయడమే కాకుండా, ఉదయగిరిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తుంది. దానికి రాజకీయ వేత్తలు, అధికారులు ఉదయగిరిని ఇప్పటికే పర్యాటక కేంద్రంగా సర్వే చేయించారు.

నాటి రాయల వైభవం సంతరించుకోవాలంటే పర్యాటక కేంద్రంగా మార్చాలనే సంకల్పంతో ఉదయగిరి మాజీ శాసనసభ్యుడు, మాజీమంత్రి మాదాల జానకీరాం ఉదయగిరి కోనేరు కోనేరు, వల్లభరాయల గుడి పున నిర్మాణం వంటి పనులు చేయించి, దుర్గం వరకు తారు రోడ్డు వేయించారు. ఈ ఉదయగిరిలోనే ఆయుర్వేద కళాశాలకు సన్నాహాలు చేశారు. కాని అవి పూర్తిగా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత నేతలు శ్రీకృష్ణ దేవరాయల ఉత్సవాల సందర్భంగా గత వైభవాన్ని గుర్తుకు తెచ్చుకొని, ఈ ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేసి, గత వైభవాన్ని ఉదయగిరికి తెచ్చిపెట్టాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నారు.

*- **ఎ.వై. శివ,** డి.ఆర్.పి, నెల్లూరు*

# మహిళా సంఘాలకు చేయూత

## జూలై 16, 2010న జరిగిన మంత్రివర్గ సమావేశ నిర్ణయాలు

- ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య అధ్యక్షతన జూలై 16న సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది.
- మహిళా సంఘాలకు వ్యవసాయ భూముల కౌలు, ఆయిల్ పాంరైతులకు చేయూత, రాష్ట్ర రాజధాని నగరానికి మెట్రోరైలు నిర్మాణం పనులను ఎల్ అండ్ టి సంస్థకు అప్పగించడం వంటి పలు నిర్ణయాలున్నాయి.
- గతంలో ప్రభుత్వం నిర్ణయించిన మేరకు స్వయం సహాయ సంఘాల మహిళలకు వ్యవసాయ భూములు కౌలుకిచ్చే ప్రతిపాదనలకు చట్టబద్ధత కల్పించాలని మంత్రి వర్గం నిర్ణయించింది.
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 30 లక్షల మంది మహిళా సభ్యులతో తొమ్మిది లక్షల స్వయం సహాయక సంఘాలున్నాయి. ఒక్కో మహిళకు ఎకరాకు మించకుండా స్వయం సహాయక సంఘాలు కౌలుకు తీసుకునే హక్కు ఈ చట్టం ద్వారా లభిస్తుంది. ఆయిల్ పాం పెంపకంలో అగ్రస్థానంలో ఉన్న రైతులకు చేయూత నందించేందుకు తగుచర్యలు తీసుకోవాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఏటా 40 వేల హెక్టార్లలో ప్రత్యేక సబ్సిడీలు ఇవ్వడం ద్వారా ఆయిల్ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తారు. ప్రస్తుతం దేశం మొత్తం మీద 1.69 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పాం సాగవుతుండగా, రాష్ట్రంలో 1.02 లక్షల హెక్టార్లు సాగవుతున్నది.
- రాష్ట్ర రాజధాని నగరంలో ట్రాఫిక్ రద్దీ పరిష్కారం కోసం ప్రభుత్వం తలపెట్టిన మెట్రోరైలు ప్రాజెక్టు పనులను అతి తక్కువకు కోట్ చేసిన ఎల్ అండ్ టి సంస్థకు అప్పగించాలన్న ప్రతిపాదనను మంత్రిమండలి ఆయోదించింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థ, ట్రాన్స్‌స్ట్రాయ్ ఇండియా సంస్థల కంటే అతి తక్కువగా కోట్ చేసిన ఎల్ అండ్ సంస్థకు ఈ పనులు అప్పగిస్తారు. మియాపూర్ నుంచి ఎల్.బి.నగర్ వరకు 28.87 కిలోమీటర్లు, జూబ్లీస్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు 14.78 కిలో మీటర్లు నాగోల్ నుంచి శిల్పారామం వరకు 27.51 కిలోమీటర్లు మొత్తం 71 కిలోమీటర్లు నిర్మాణం చేపడతారు. మెట్రోరైలు ప్రాజెక్టుకు గతంలో చేసుకున్న ఒప్పందం రద్దయినప్పటికీ, అమల్లో ఉన్నట్టుగా గుర్తించి, ఆర్థిక సహాయం అందించడానికి అంగీకరించినందుకు ప్రధాని శ్రీమన్మోహన్ సింగ్, యూపీఏ ఛైర్ పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ, కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ ప్రణబ్ ముఖర్జీలకు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ఎస్. జైపాల్ రెడ్డికి ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య కృతజ్ఞతలు తెలిపారు.
- చిత్తూరు జిల్లా కలికిరి గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ పారిశ్రామిక పార్కు నెలకొల్పేందుకు ఏపిఐఐసికి 50 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించే ప్రతిపాదనను ఆమోదించారు. మార్కెటు రేటు ప్రకారం ఎకరాకు లక్షా నాలుగు వేల వంతున చెల్లిస్తారు.
- ప్రస్తుతం తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న మెదక్ జిల్లాను తిరిగి ఉస్మానియా విశ్వవిద్యాలయం 'పరిధిలోకి తీసుకు వచ్చే ప్రతిపాదనకు సమాచార, పౌర సంబంధాల శాఖమంత్రి శ్రీమతి (డాక్టర్) జె.గీతారెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రివర్గం ఆమోదించింది.

# కేబినెట్ నిర్ణయాలు

- పట్టణ స్థానిక సంస్థల్లో ఆదాయ, వ్యయాల అకౌంటింగ్ సక్రమ నిర్వహణకోసం, అకౌంటింగ్ మాన్యువల్‌ను కేంద్ర మార్గదర్శక సూత్రాల మేరకు నిర్వహించే చట్ట సవరణను మంత్రి మండలి ఆమోదించింది.
- సెంటర్ ఫర్ గుడ్ గవర్నర్స్ ఆధ్వర్యంలో మునిసిపల్ అకౌంటింగ్ మాన్యువల్, బడ్జెట్ మాన్యువల్, ఆడిట్ మాన్యువల్‌ను రూపొందించారు.
- రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు 6.848 శాతం కరువు భత్యం (డి.ఏ.) మంజూరు చేసే నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించింది. 2010 జనవరి నుంచి జూన్ వరకు ఉద్యోగుల భవిష్యనిధి ఖాతాకు జమచేసి, జూలై నెల మొత్తాన్ని ఆగష్టులో ఇచ్చే జీతంతో ఇస్తారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు ఏటా అదనంగా 1187.65 కోట్ల భారం పడుతుంది.

## 4-8-2010 నాటి మంత్రివర్గ సమావేశపు నిర్ణయాలు

రాష్ట్ర మంత్రివర్గం ముఖ్యమంత్రి డా॥ కొణిజేటి రోశయ్య అధ్యక్షతన ఆగష్టు 4, 2010న సచివాలయంలో సమావేమై పలు ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి నిర్ణయాలు తీసుకుంది.

మంత్రివర్గ సమావేశంలోని కొన్ని ముఖ్య నిర్ణయాలు

### కమ్యూనిటీ హెల్త్, న్యూట్రిషన్ క్లస్టర్లు

రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు

వీలుగా 360 కమ్యూనిటీ హెల్త్, న్యూట్రిషన్ క్లస్టర్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఆమోదం.

రిఫరల్ సిస్టమ్‌ను బలోపేతం చేయడానికి వీలుగా గ్రామం, సబ్ సెంటర్, పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రి, జిల్లా, బోధనాసుపత్రులకు అనుసంధానం ఏర్పాటు చేస్తారు.

సమగ్రమైన అత్యవసరమైన సదుపాయాలతో రిఫరల్ యూనిట్లను బలోపేతం.

ప్రతి నాలుగు నుంచి, పది పిహెచ్‌సి ల మధ్య పటిష్టమైన ప్రణాళిక, సమన్వయం ఏర్పరుస్తారు.

ప్రివెంటివ్, ప్రమోటివ్, క్యూరేటివ్, రిఫరల్ హెల్త్ వ్యవస్థలను బలోపేతం చేస్తారు.

ఈ ప్రతిపాదనలను కొత్త సిబ్బంది అవసరం లేకుండా ప్రస్తుతం ఉన్న సిబ్బంది, వైద్యులతో సిహెచ్‌ఎన్‌సి లను పటిష్టపరుస్తారు.

దీనివల్ల ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పటిష్టపడడానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం లభిస్తుంది.

## మెట్రోరైలు

రాష్ట్ర రాజధాని నగరంలో హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టును పిపిపి పద్ధతిలో అభివృద్ధి పరచడానికి, ప్రి-కన్‌స్ట్రక్షన్ దశ అవసరాలకు రూ. 1980 కోట్ల ఖర్చు మంజూరు ప్రతిపాదనలు ఆమోదం.

ఈ 71.16 కిలో మీటర్ల ప్రాజెక్టును తక్కువ ధర ప్రతిపాదించిన ఎల్ & టి సంస్థకు అప్పగించాలని ప్రాథమికంగా నిర్ణయించిన విషయం తెలిసిందే.

పై మొత్తంలో 2010-11 సంవత్సరానికి రూ. 500 కోట్లు విడుదల చేస్తారు.

మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని రూ. 12,132 కోట్లుగా అంచనా వేశారు.

2014 నాటికి రోజుకు 14.76 లక్షల ప్రయాణీకులు, 2024 నాటికి 22.13 లక్షల మంది ప్రయాణికులు ఉంటారని అంచనా.

## జీతాలు

మునిసిపల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు, పింఛనులను ట్రెజరీల ద్వారా చెల్లించడానికి వీలుగా సంబంధిత చట్ట సవరణ ప్రతిపాదనలు ఆమోదం.

గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ విశాఖ, విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్ మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల మునిసిపల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 1-4-2009 నుంచి జీతాలు, పింఛన్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రస్తుతం ఎ.పి. మునిసిపల్ చట్టం, 1965 కు తగు సవరణలు చేస్తారు.

## అడ్వాన్స్‌డ్ వాటర్ టెండర్లు

రాష్ట్రంలో ఫైర్, ఎమర్జెన్సీ సేవలను బలోపేతం చేయాలన్న కేంద్ర సూచనల మేరకు అధునాతన యంత్రాల కొనుగోలుకు రూ. 1.16 కోట్ల పాలనా మంజూరు ఆమోదం.

ఈ మొత్తంలో 9 అడ్వాన్స్‌డ్ వాటర్ టెండర్లు, త్వరితగతిన స్పందించే వాహనాలను సమకూర్చుకుంటారు.

## స్కాలర్‌షిప్పులు

పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పుల మంజూరు, ఫీజుల రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి మంత్రుల బృందం సూచించిన మార్గ దర్శకాల ఆమోదం.

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, డిడబ్ల్యు, ఎండబ్ల్యు విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్ సిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల అధ్యయనానికి ప్రభుత్వం మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ఈ బృందంలో - సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, గిరిజన సంక్షేమ, ఉన్నత విద్య, పాఠశాల విద్య, సాంకేతిక విద్య, వైద్య విద్య, పంచాయితీ రాజ్, వ్యవసాయ శాఖల మంత్రులు సభ్యులు.

మంత్రుల బృందం చేసిన సిఫార్సులలో కొన్ని ముఖ్యమైనవి.....

సంతృప్త పద్ధతిపై ప్రస్తుతమున్న సంక్షేమ స్కాలర్‌షిప్పు పథకాలను కొనసాగించడమవుతుంది.

అధ్యయనం తరువాత రూపొందించిన ఆదాయ ధృవీకరణ పత్రం నమూనాను ఆమోదించింది. దీనిపై తహశీల్దార్లకు తగు మార్గ దర్శకాలు ఇవ్వాలని సూచించింది.

రాష్ట్రమంతటా ఉన్న విశ్వవిద్యాలయాల్లో ఒకే కోర్సుకు ఒకే విధమైన రుసుము ఉండాల్సిన అవసరం ఉంది.

స్కాలర్‌షిప్పుదారుని ఫలితాలు, హాజరు వాతం, కార్పోరేట్ కళాశాలల అడ్మిషన్లు, కన్వీనర్ కోటాకు మాత్రమే స్కాలర్‌షిప్పులు, స్వయం సహాయక కోర్సుల ఫీజువంటి అంశాలపై వివరణాత్మక సూచనలు ఉన్నాయి.

విద్యార్థులందరికీ యునిక్ ఐడి ఇవ్వాలని సూచించింది.

## ఆక్టోపస్‌కి భూమి

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, ఇబ్రహీంపట్నం ఖాల్సా గ్రామంలో 570 ఎకరాల భూమిని ఆక్టోపస్ కమాండో శిక్షణా కేంద్రానికి సేకరించే ప్రతిపాదన ఆమోదం. దీనికోసం తాత్కాలికంగా రూ. 34.20 కోట్ల మంజూరుకు ఆమోదం.

సోలోటియమ్, అదనపు మార్కెట్ రేటు చెల్లింపు, తదితర వ్యయాల కోసం ఈ మొత్తాన్ని రంగారెడ్డి జిల్లా తూర్పు ఆర్‌డివోకు కేటాయిస్తారు.

## ఇండస్ట్రియల్ పార్క్

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం, తేనెపల్లి గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం 4.10 ఎకరాల ప్రభుత్వభూమి కేటాయింపు ప్రతిపాదనల ఆమోదం.

మార్కెట్ రేటు ప్రకారం ఎకరాకు రూ. 2 లక్షల వంతున చెల్లిస్తారు.

***- అదపాక సత్యారావు***

అదనపు సంచాలకులు, సమాచార శాఖ

# వర్షాకాలపు వ్యాధులను ఎదుర్కోవటం ఎట్లా?

ప్రతి ఏటా మన రాష్ట్రంలో వర్షాకాలం ఆరంభమవగానే కొన్ని రకాల వ్యాధులు వస్తున్నాయి. వీటిని సీజనల్ వ్యాధులుగా వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అతిసార, వైరల్ జ్వరాలు, చికున్‌గున్యా జ్వరాలు, కామెర్లు, మెదడువాపు వ్యాధి, డెంగ్యూ మొదలగునవి సోకి ప్రాణ నష్టం జరుగుతున్నది. ఈ వ్యాధులన్నింటికి పారిశుధ్యలోపం, దోమల వ్యాప్తి, కలుషితనీటి సరఫరా మూలకారణాలు. పైవాటితో పాటు వ్యక్తిగత పరిశుభ్రత గురించి, పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన లేక పోవటం వలన, సీజనల్ వ్యాధులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో సంభవిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం వ్యాధుల ద్వారా ప్రపంచంలో జరిగే మరణాలలో 50 శాతం క్షయ వ్యాధి వలన, 20% అతిసార, న్యుమోనియాలవలన,20% ఎయిడ్స్ వలన, మిగిలిన 10 శాతం యితర వ్యాధుల వలన జరుగుతున్నాయి.

మన రాష్ట్రంలో కూడా గిరిజన ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధుల వలన మరణాలు సంభవిస్తున్నట్లు పత్రికలు, టి.వి.ల ద్వారా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో పంచాయితీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా సమన్వయంతో పనిచేసినట్లయితే సీజనల్ వ్యాధులను నివారించవచ్చును. పారిశుధ్యం, నీటి సరఫరా వైద్య ఆరోగ్య శాఖలు చేపట్టవలసిన కార్యక్రమాలను వివరంగా పొందుపరచడమైనది.

### గ్రామీణ పారిశుధ్యం

- వీధులను శుభ్రపరిచి, చెత్తా చెదారం ఊరికి దూరంగా తోలడం
- గ్రామ పంచాయతీలలో చెత్తకుండీల ఏర్పాటు
- చెత్తకుండీలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి చుట్టూ బ్లీచింగ్, సున్నం మిశ్రమం చల్లాలి.
- మురుగునీటి కాలువలోని పూడికలను తొలగించి ఊరికి దూరంగా తోలాలి.
- మురుగు నీటి గుంతలలో దోమల అభివృద్ధి జరగకుండా వేస్ట్ ఆయిల్ చల్లాలి. లేదా గంబూషియా చేపలను వదలాలి (గంబూషియా చేపలు మత్స్యశాఖ చేపల పెంపక కేంద్రాలలో లభిస్తాయి)
- గ్రామపంచాయితీలలోని అంతర్గత రోడ్లలో ఏర్పడిన గుంతలను గ్రావెల్/క్వారి డస్ట్‌తో పూడ్చివేయాలి.
- మాంసాన్ని బహిరంగంగా వీధులలో విక్రయించటాన్ని నిషేదించాలి. గ్రామపంచాయితీలలో ఖాళీ జాగా ఉన్నట్లైతే మాంసం విక్రయదారులకు వారి నిధులతో రూములు నిర్మించి ఇవ్వాలి.
- గ్రామపంచాయితీలలో ఉన్న హోటళ్లను, టీకొట్లను పంచాయతీ కార్యదర్శి తనిఖీ గావించి, పరిశుభ్రమైన వేడివేడి పదార్థాలు సరఫరా చేయడానికి ఈగల వ్యాప్తి లేకుండా చేయడానికి చర్యలు తీసుకోవాలి.
- ఇండ్లనుండి వచ్చే వాడకపు నీరు రోడ్లపై పారకుండా ఇంకుడు గుంతలు ఏర్పరచుకోవలసినదిగా సూచించాలి. నోటీసులు జారీ చేయాలి.
- చిన్న చిన్న గ్రామాలలో పారిశుధ్య కమిటీలు ఏర్పరచి, ప్రజలకు పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించాలి.
- బహిరంగ మల విసర్జన ఆరోగ్యానికి హానికరమని ప్రజలకు తెలియజేయాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ప్రోత్సహించాలి.
- దోమల వ్యాప్తిని అరికట్టడానికి, మలాథియాన్ 50, బైటెక్స్‌లను పిచికారి చేయాలి.
- గ్రామ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి గ్రామీణ పారిశుధ్యపు చర్యలు చేపట్టాలి.
- పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పర్యటించి పై కార్యక్రమాలను అమలు పరచాలి.



- విస్తరణాధికారులు (పి.ఆర్.అండ్.ఆర్.డి.) డివిజనలు పంచాయతీ అధికారులు పై కార్యక్రమాలను పర్యవేక్షించాలి.
- ప్రతి గ్రామపంచాయతీలో పారిశుధ్యపు చర్యలు చేపట్టడానికి అవసరమైన కూలీలు, బ్లీచింగ్ పౌడర్, సున్నం తదితర సామాగ్రిని సర్పంచ్ అందుబాటులో ఉంచాలి.
- పారిశుధ్యం కొరకు గ్రామపంచాయతీ నిధులు ఉపయోగించవచ్చును.
- రాత్రి సమయాలలో 6.30 గం.ల నుండి 8.30 గం.ల మధ్య ఫాగింగ్ చేయవచ్చును. అన్ని మేజర్ గ్రామపంచాయతీలలో ఫాగింగ్ మిషన్‌లు ఉన్నాయి.

### గ్రామీణ నీటి సరఫరా

- చేతి పంపును, దాని పరిసరాలను శుభ్రముగా ఉంచాలి.
- చేతి పంపు దగ్గర బట్టలు ఉతకకుండా చూడాలి. ప్రజలకు

నచ్చచెప్పాలి.

- చేతి పంపును జాగ్రత్తగా వాడాలని గ్రామ ప్రజలకు తెలపాలి.
- చేతి పంపుచుట్టూ పేడ దిబ్బలు వేయకుండా చూడాలి.
- గ్రామంలోని మురికి నీరు చేతి పంపు దగ్గరకు చేరకుండా చూడవలయును.
- చేతి పంపుల ద్వారా వృధా అయిన నీటిని చెట్లకు వదలాలి. అట్లా చేయడానికి వీలుకానిచో, ఇంకుడు గుంతలు నిర్మించి అందులోనికి పోవునట్లు చేయాలి.
- ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రం చేయాలి.
- త్రాగునీరు సరఫరా చేసిన ప్రతి పూట క్లోరినేషన్ చేయాలి. ప్రతి 10,000 లీటర్లకు సుమారుగా 50 గ్రాములు బ్లీచింగ్ పౌడరు ఒక బకెట్ నీటిలో తీసుకొని బాగా కలిపి ట్యాంకులో వేయాలి. ఒక గంట తరువాత ఆ నీటిని వాడాలి. రిసెడ్యూయల్ క్లోరిన్ 0.2 0.4 పి.పి.యం. ఉండునట్లు ప్రతిరోజూ క్లోరోస్కాప్‌తో పరీక్షించాలి.
- 40,000 లీటర్ల ట్యాంకు వున్న గ్రామానికి, పూటకు 200 గ్రాములు, రోజుకు 400 గ్రాములు చొప్పున 30 రోజులకు సుమారుగా 12 కేజిల బ్లీచింగ్ పౌడర్ కావాలి. దీని ఖర్చు సుమారుగా రూ. 250/- మాత్రమే.
- పబ్లిక్ కొళాయిల చుట్టూ ఫ్లాట్ ఫారంలు కట్టించాలి. కొళాయిల చుట్టూ నీరు నిలువకుండా చూడాలి. కొళాయిలలో వృధా అయిన నీరు 10 అడుగుల దూరంలో పారునట్లు చేయాలి.
- నీటి ట్యాంకుల లోపల పిల్లలు దిగి ఆటలాడటాన్ని నిషేదించాలి.
- మంచినీటి స్కీమ్ ద్వారా నీటి సరఫరా జరిగే గ్రామంలో పబ్లిక్ స్టాండ్ పోస్టులు, ప్రైవేట్ కనెక్షన్‌లకు ట్యాప్‌లు తప్పక ఉండునట్లు చూడాలి. లేకపోతే 50% నీటి వృధా అవుతుంది.
- పైపులైనులలో లీకేజీలు ఉంటే, వెంటనే రిపేరు చేయించాలి. లేకుంటే నీరు వృధా అవడమే కాకుండా పైపు లైనులోని నీరు కలుషితం అవుతుంది.
- పంపింగ్ మెయిన్ నుండి నీరు అక్రమంగా తీయటానికి అనుమతించకూడదు.
- త్రాగునీటి వనరుల సమీపంలో మల, మూత్ర విసర్జన జరగకుండగా చూడాలి.
- కొళాయి గుంతలు (Pit Taps) పూడ్చి వేయవలసినదిగా ఇంటి యాజమానులకు నోటీసులు జారీచేయాలి. పూడ్చనట్లైతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించాలి.
- మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పరచి గ్రామాలలో పర్యటించి త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం పర్యవేక్షించాలి.

## వర్షాకాలంలో సాధారణంగా సంభవించే వ్యాధులు

వ్యాధులు నాలుగు రకాలుగా సంక్రమిస్తాయి. 10% నీటి ద్వారా 30% ఆహారం, దోమలు వంటి కీటకాలు ద్వారా వస్తాయి.

- అతిసార వ్యాధి లక్షణాలు : వాంతులు, విరోచనాలు, నీరసం రావడం
- మలేరియా వ్యాధి లక్షణాలు : రోజు విడచి రోజు వణకుతో కూడిన జ్వరం రావటం, తలనొప్పి, వంటినొప్పులు.
- డెంగ్యూ వ్యాధి లక్షణాలు : తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దులు, చర్మం ద్వారా రక్తస్రావం, ఆకలి మందగించడం.
- చికున్‌గున్యా వ్యాధి లక్షణాలు : జ్వరం రావడం, కీళ్లనొప్పులు (మోచేయి, మోకాళ్లు, మడమల) రావడం.
- వైరల్ జ్వరాలు - లక్షణాలు : చలిజ్వరం, నొప్పులు మొదలగునవి.
- స్వైన్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు : తీవ్రమైన తలనొప్పి, జ్వరం, జలుబు, గొంతునొప్పి, ఎడతెరిపి లేని దగ్గు,

ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు, చలి, వాంతులు, ఆకలి లేకపోవడం, విరోచనాలు మొదలగునవి.

- పై వ్యాధి లన్నీ నీరు కలుషితం కావడం వలన లేదా దోమకాటు వలన, లేదా బ్యాక్టీరియా లేదా వైరస్ ద్వారా సంక్రమిస్తాయి.
- వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఈ వ్యాధులు సోకకుండా నివారించవచ్చు.
- సురక్షితమైన నీటిని అనగా కాచి, చల్లార్చిన, వడపోసిన నీటిని లేక క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే త్రాగాలి.

## గ్రామ ఆరోగ్య పారిశుధ్య కమిటీలు

గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలు అందరికీ అందివ్వాలనేది దీని ముఖ్య ఉద్దేశ్యం. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం అంటు వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త తీసుకోవడం, తదితర పనులకు గాను సంవత్సరానికి రూ. 10,000/-లు చొప్పున విడుదల చేస్తారు. ఈ కమిటీకి పంచాయతీ సర్పంచ్ అధ్యక్షులుగా ఉంటారు.

- ప్రతి నెల మొదటి సోమవారం గ్రామపంచాయితీ స్థాయి పారిశుధ్యం - ఆరోగ్య కమిటి సమావేశం నిర్వహించాలి. ఇందులో సభ్యుల సూచనల మేరకు యస్.ఆర్.హెచ్.యం. గ్రాంటు ఖర్చు చేయాలి.
- 108 మరియు 104 సేవలను వినియోగించడానికి ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలి.
- హాస్టలు అధికారులు విద్యార్థులకు కాచి చలార్చిన నీటిని లేదా క్లోరిషన్ చేయబడిన నీటిని సరఫరా చేయాలి.
- పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి.
- మధ్యాహ్న భోజనం ఆరోగ్యవంతమైన పరిసరాలలో వండి సరఫరా చేయాలి.
- వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. విద్యార్థులకు ఆరోగ్య విద్యను వసతి గృహాధికారులు బోధించాలి.

***- జి. శంకరయ్య,*** జిల్లా పంచాయితీ అధికారి, కర్నూలు

## రాజకీయ భీష్ముడు

# గాడిచర్ల హరిసర్వోత్తమరావు

తొలితెలుగు రాజకీయ ఖైదీగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా, గ్రంథాలయోద్యమనేతగా, వయోజన విద్యాస్ఫూర్తి దాతగా, నిస్వార్థ సేవాపరాయుడిగా తెలుగు ప్రజల మన్ననలందుకొన్న త్యాగమూర్తి గాడిచర్ల హరిసర్వోత్తమరావు.

గాడిచర్ల వారి పూర్వీకులు కడప జిల్లా సింహాద్రిపురంలో వుండేవారు. ఉద్యోగ రీత్యా తండ్రి వెంకటరావు కర్నూలు లోవుండేవారు. హరిసర్వోత్తమరావు 14-09-1863న కర్నూలులో జన్మించారు. బాల్యంలోనే తల్లిని పోగొట్టుకొన్న రావు మేనమామ ఇంట పెరిగారు. గుత్తి, నంద్యాలలో హైస్కూలు చదువు ముగించి, మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో ఆరేళ్లు చదివి ఎం.ఎ. పట్టభద్రులు అయ్యారు.



"ఆ కాలంలో కాలేజీ ఫీజు, గది అద్దె భోజనం, చాలా తక్కువ. అన్ని ఖర్చులు చేరి నెలకు, 13 రూపాలయిలే! కాఫీ హోటల్‌కు పోయేవారు కారు. ఆరునెలలకు వచ్చే టోపీ ఖరీదు 5 అణాలు (అప్పట్లో కాలేజ విద్యార్థులు టోపీతో తరగతులకు హజరయ్యేవారు) ఆరునెలలకు కిరసనాయిలు దీపం ఖర్చు 5 అణాలు, ఆరు నెలలు పనికివచ్చే చాప ఖర్చు 5 అణాలు., ఇదీ ఆయన కాలేజ విద్యార్థి జీవితం. ప్రతీనెలా పిన్నతండ్రి శ్రీనివాసరావు రూ.17 మాత్రం పంపేవారు (రావుగారి స్వీయచరిత్ర నుండి).

ఎం.ఎ., చదివిన తర్వాత, ఎల్.టి. (నేటి బి.ఎడ్) చదివేందుకు, రాజమండ్రిలోని ప్రభుత్వ టీచర్స్ ట్రైనింగ్ కాలేజిలో చేరారు. అప్పట్లో ప్రముఖ జాతీయనాయకుడు బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి వచ్చి, అక్కడ బహింగ సభలో అత్యంత ఉత్తేజకరంగా ఉపన్యసించారు. మరునటిరోజు కాలేజీ విద్యార్థులు 'వందేమాతరం' బ్యాడ్జీలతో తరగతులకు వెళ్ళారు. ప్రిన్సిపల్ మార్క్‌హంటర్ తరగతులకు వచ్చి వెంటనే బ్యాడ్జిలను తీసివేయమని ఆదేశించాడు. అందుకు విద్యార్థులు తిరస్కరించారు. విద్యార్థి నాయకుడైన గాడిచర్ల హరిసర్వోత్తమ రావును కాలేజి నుండి బర్తరఫ్ చేశాడు. ఆయనకెక్కడా ఉద్యోగమివ్వరాదని ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. రావు జీవితంలో ఇదొక పెద్దమలుపు.

జాతీయోద్యమ ప్రచారానికి పత్రికలు ప్రధానసాధనాలని విశ్వసించి, రావు 1908లో విజయవాడ నుండి 'స్వరాజ్య' అన్న తెలుగు వారపత్రికను ప్రారంభించారు. తెల్లదొరల అక్రమ, అన్యాయ చర్యలను తీవ్రంగా విమర్శిస్తూ, వ్యాసాలు రాసేవారు.

1908లో తిరునల్వేలిలో, ఆష్ అనే కలెక్టరు ఆదేశంతో పోలీసులు జరిపిన కాల్పులలో నలుగురు అమాయకులు మరణించారు. గాడిచర్లవారు కలెక్టరు చర్యను తీవ్రంగా ఖండిస్తూ సంపాదకీయం రాశారు. ప్రభుత్వం, రావుగారిపై 'రాజద్రోహ' నేరం ఆరోపించి మూడేళ్ళ కఠినకారాగారశిక్ష విధించింది. అట్టి కఠిన శిక్షను అనుభవించిన మొదటి వ్యక్తి గాడిచర్ల.

ఆనాటి జైలు జీవితం అత్యంతదారుణం. రావును 6×3 అడుగుల గదిలో ఒంటరిగా బంధించారు. గుండు గొరిగించి, కాళ్ళకు, మెడకు ఇనుప గొలుసు వేశారు. మలమూత్రాల విసర్జనకు రెండు ముట్టి చట్టిలిచ్చారు. పురుగులు తేలే పులుసులో రాళ్ళు గడ్డి కలిసిన రాగి సంకటి వారికిచ్చే ఆహారం. అదొక నరకలోకం - మూడేళ్ళు తీవ్ర యాతనను అనుభవించిన దేశ భక్తుడు రావు.

1914లో లోకమాన్య తిలక్, అని బిసెంట్ గార్లు స్థాపించిన, హోమ్ రూల్ లీగ్ ఆంధ్రశాఖ కార్యదర్శిగా రాష్ట్రమంతటా పర్యటించి, తమ అనర్గళ ప్రసంగాలతో ప్రజలను ఉత్తేజ పరిచారు.

రావు ఎంత గొప్ప వ్యక్తియో అంతే గొప్ప రచయిత... అబ్రహాం లింకన్ చరిత్ర, శ్రీరామ చరిత్ర, విస్మృత సార్వభీముడు మొదలగు గ్రంథాలను రాశారు. 1927లో గాడిచర్ల నంద్యాల నియోజకవర్గం నుండి మద్రాసు శాసన మండలికి జరిగిన ఎన్నికలలో, జస్టిస్ పార్టీ అభ్యర్థిపై విజయం సాధించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ మెంబరుగా

పనిచేశారు. కొమర్రాజు వెలకట లక్ష్మణరావు ప్రారంభించిన విజ్ఞాన చంద్రిక గ్రంధమండల కార్యదర్శిగా చాలా గ్రంధాలను ప్రచురించారు. కొంతకాలం 'ఆంధ్రపత్రిక' సంపాదకులుగా పనిచేశారు.

1931 - 34 మధ్య అఖిల భారత కాంగ్రెస్ సభ్యులుగా పనిచేశారు. ఒకసారి జరిగిన చర్చలో పాల్గొని, రావు చేసిన సూచనలను ఆమోదిస్తూ గాంధీజీ 'ద బ్రేవ్ హరిసర్వోత్తమ రావు' అని ప్రశంస్తూ తను 'యంగ్ ఇండియా' పత్రికలో రాశారు.

1930 నుండి క్రమంగా రాజకీయాలనుండి వైదొలగి, గ్రంధాలయోద్యమం, వయోజనవిద్యా రంగాల్లో కృషి చేశారు.

1950లో రావుగారిని, మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రాంత వయోజన విద్య గౌరవ డైరక్టర్‌గా నియమించింది. 1952లో గాడిచర్ల వారు బళ్ళారి జిల్లాలోని, కన్నడ తాలూకాల్లో పర్యటిస్తూ, గ్రంధాలయోద్యమ ప్రచారం చేశారు. వారి తెలుగు ప్రసంగాలను కన్నడంలోకి అనువదిస్తూ, వారి అనయాయిగా పనిచేయటం, నా అదృష్టంగా భావించాను.

ప్రజలలో కళలు, సాహిత్యంపట్ల అభిరుచి పెంచేందుకు. నాటికోత్సవాలు, శ్రీకృష్ణదేవరాయ జయంత్యుత్సవాలు జరిపేవారు.

వృద్ధాప్యం పైబడినా తమ పనులను తామే చేసుకునేవారు. 1956లో అనంతపురంలోని వయోజన విద్య శిక్షణ కేంద్రాన్ని చూడడానికి వచ్చారు. వారు వేకువనే లేచి వాహ్యాళికి వేళ్ళేవారు. అది వరకే నాకున్న పరిచయం పురస్కరించుకొని, వారు తిరిగి వచ్చేలోపుగా వారి పడక (దుప్పటి) దులిపి చుట్టి పెట్టాను. వచ్చిన వెంటనే, నన్ను పిలిచి "నా పడక ఎందుకు చుట్టావ్, నా పనులను నేనే చేసుకోవాలి. నన్ను త్వరగా చావమంటావా?'' అని గద్దించారు. క్షమించమని నమస్కరించాను.

తమ జీవిక నిర్వహణకు, హిందూ పత్రికలో సమీక్షలు రాసేవారు. చివరిదశలో మద్రాసులోని గోపాలపురంలో అల్లుడు పార్థసారథి, కూతురు ద్వారకాబాయి వద్ద వుండేవారు. చనిపోక ముందు గోవింద వల్లభపంత్ రావుగారి చికిత్స కోసం రెండువేల రూపాయలు పంపారు. అంతే వారందుకొన్న ప్రతిఫలం.







గాడిచర్ల వారి సేవలకు చిహ్నంగా విజయవాడలో వారి శిష్యులు పాతూరి నాగభూషణం, మరికొందరి సహకారంతో సర్వోత్తమభవనం నిర్మించారు.

త్యాగమే ఊపిరిగా సేవలందించి గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1960 ఫిబ్రవరి 29న మద్రాసులో కన్నుమూశారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు, గాడిచర్ల వారి బహుముఖ సేవలను ప్రస్తుతిస్తూ

"వందేమాతరంమనగానే వచ్చి తీరు ఎవరిపేరు?

గ్రామ గ్రామమున వెలసెది గ్రంధాలయమెవనికి గుడి.

అరగని తరగని వాడవని అక్షరదానంబెవరిది?

అరవదేండ్లు ప్రజల కొరకు అరిగిన కాయంబెవనిది?

తన బరువును మోయలేని తనువును చాలించెనెవడు?

తరతరాలు ఎవనిమేలు తరలుచు పొరలుచునుండును

అందరికెవనితో పొత్తు - అఖిలాంధ్రంబెవనిసొత్తు?

ఏస్థాన కవిననేనో, ఆస్థానాధీశుడెవడు?

వయోవృద్ధుడగు యువకుడు వాస్తవజీవితమతనిది?

హరిసర్వోత్తము దాతడు ఆంధ్రులపాలటి దేవుడు.

నిజానికి ఆనాడు ఆంధ్రలో హరిసర్వోత్తమ రావు జన్మించి వుండని యెడల, రాజకీయోద్యమానికి పునాదియే లేక పోయి వుండేది. ఆంధ్రాలో రాజకీయాలకు ఆది పురుషుడు హరిసర్వోత్తమ రావు'' అన్న యరమిల్లి జగన్న శాస్త్రిగారి పలుకులు అక్షరక్షరమూ నిజమైనవి.

**- జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

# తన భాగ్యమే తనకు గాక....

అనుకున్నవన్నీ జరగవు. జరిగేవి అనుకోకపోయినా ఆగవు. మన చేతుల్లో ఏమీలేదని సర్ది చెప్పుకొంటే-- మన భవిష్యత్తు మనమే చేతులారా జారవిడుచుకున్నట్లవుతుంది.

మనం ఎలా ఉండాలనుకొంటున్నామో.. ఎటువంటి భవిష్యత్తును కావాలనుకొంటున్నామో.. ఆ ఆలోచనకు తగిన కార్యప్రణాళికను వేసుకొని నియమబద్ధంగా పాటించాలనే అనుకొంటాం. కానీ మధ్యలో ఏదో అవాంతరమో అపనమ్మకమో కలిగితే అర్థాంతరంగా ముగించేస్తాం. కానీ ఇది మానవుని అభివృద్ధి సూచకం కాదు. ఇంకా కొందరు-

**ధనపతి సఖుడై యుండియు**

**నెనయంగా శివుడు భిక్షమెత్తగ వలసెన్**

**తనవారికెంతగలిగిన**

**తన భాగ్యమె తనది గాక తథ్యము సుమతీ**

అని అనుకొంటూ అదృష్టంపై ఆధారపడి కర్తవ్యాన్ని మర్చిపోతుంటారు. ఆలోచిస్తే-- తన భాగ్యం అన్నది తన కృషి, పట్టుదలలపైనే ఆధారపడి ఉంటుంది. అందుకోసం నిత్యం శ్రమించాలి. రేపటికోసం ఈ నాడే మనం సన్నద్ధం కావాలి.

దివసేనైవ తత్ కుర్యాత్ యేన రాత్రౌ సుఖం వసేత్

అష్టమాసేన తత్ కుర్యాత్ యేన వర్షాః సుఖం వసేత్

పూర్వే వయసి తత్ కుర్వాద్ యేన వృద్ధః సుఖం వసేత్

యావజ్జీవేన తత్ కుర్యాత్ యేన ప్రేత్య సుఖం వసేత్

మానవజీవితం నిత్యనూతనం, ఆనందభరితం కావాలంటే ఆలోచనతో కూడిన జాగ్రదావస్థ కావాలి. భవిష్యద్వీక్షణం ఎంతో నిశితంగా ఉండాలి. మనిషి రాత్రిని సుఖంగా గడపడం కోసం కావలసిన ఏర్పాట్లను పగలే చేసుకోవాలి.

విద్యుక్త ధర్మాన్ని ఆచరిస్తూ నిజాయితీగా మన వృత్తి ధర్మంలో మనసు పెట్టి ప్రవర్తించాలి. మనం చేసే పనిని చెయ్యకుండా







తప్పించుకోవడం వల్ల సుఖపడాలనే తపన మనల్ని తొలిచి వేస్తుంది. పై అధికారుల అక్షింతలు రాత్రి నిద్రను దూరం చేస్తాయి.

శారీరక శ్రమ మానసిక శ్రమ కొరవైతే రాత్రి నిద్ర ఎలా పడుతుంది. ఇక వర్షాకాలానికి కావలసిన వస్తువులన్నింటినీ వర్షం లేని రోజుల్లో ముందుగానే జాగ్రత్త చేసుకోవాలి. మన చుట్టూ జీవించే చీమల్ని చూసి ఈ విషయాన్ని నేర్చుకోవాలి. హేమంతకాలంలో సుఖంగా జీవించడానికి గ్రీష్మం నుంచే ఆహారసేకరణను అవి ప్రారంభిస్తాయి. ఇక్కడ భవిష్యత్తు కోసం ఆలోచించడమనే పనిని కొంచెం విస్తృతం చెయ్యాలి.

కేవలం వ్యక్తి శ్రేయస్సు కోసం అందరూ పాటుపడతారు. నా ఇల్లు, నా కుటుంబం, నా పిల్లలు అంటూ తాపత్రయ పడడంలో కొత్తేమీ లేదు. కానీ ఆ స్వార్థపుటాలోచనల్లోంచి ఎంతో కొంత సమాజానికి మేలు చేసే భవిష్యత్ ప్రణాళికను ఏర్పరచుకోవాలి. ఈనాడు మనం చేసే ఈ ఆలోచన చిన్నదే కావచ్చు. అదే ముందు ముందు మహత్ప్రయోజనాన్నివ్వవచ్చు.

ఇక ముసలితనంలో సుఖంగా ఉండడంకోసం యవ్వనంలో ఉన్నప్పుడే పరిశ్రమించి జాగ్రత్తపడాలి. వృద్ధాప్యంలో మనకు ఇతరుల సహాయం కచ్చితంగా అవసరం. కడుపున పుట్టిన పిల్లలకైనా పరాయివాళ్ళకయినా మనం ఎంత చేస్తామో అంతే మనం వారినుండి పొందుతామనేది వాస్తవం. సొంతపిల్లలకు ఎంత చేసినా మళ్ళీ వాళ్ళు కృతజ్ఞత చూపిస్తారన్న నమ్మకం లేదు. అటువంటప్పుడు మనలో జవసత్వాలున్నప్పుడు దుర్బలులకు సాయం అందిస్తే, అదే సాయం మనం దుర్బలత్వంలో ఉన్నప్పుడు అందకపోదు.

మరణానంతరం సుఖంకోసం బ్రతికి ఉండగానే ప్రయత్నించాలి. మన మరణం వల్ల లోకానికి బాధ కలిగిందంటే అదే సుఖం. మనం మరణిస్తే లోకంలో ఉన్న జనులు 'హమ్మయ్య, మంచి పని జరిగింది' అని అనుకొంటే-- అది దుఃఖం.

పుట్టినా, గిట్టినా నలుగురూ మెచ్చే విధంగా ఉండాలి. సర్వకాల సర్వావస్థలలోనూ మనల్ని వెన్నంటి కాపాడేది ధర్మమే. మన ధర్మాల్ని మనం పాటిస్తే మరణం కూడా సుఖంగా ఉంటుంది. మరణానంతరం కూడా సుఖం లభిస్తుంది. అందుకే కాలమహిమను మన జీవితం విలువనూ తెలుసుకొని కష్టించి పనిచేయడానికి వేసే వాయిదా పద్ధతిని అనునిత్యం వాయిదా వేస్తే జీవితం చరితార్థమవుతుంది. అదే భాగ్యం.

- అద్దంకి శ్రీనివాస్

Printed & Published by: Dr. Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Cax ton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Dr. Phani Kumar**


కృష్ణ! కృష్ణ! హరే! హరే!

RNI No. APTEL / 2009/27888




Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.